ద్వితీయోఽధ్యాయః

సాంఖ్యయోగః

మహాభారత ఇతిహాసములోని భీష్మపర్వము 25వ అధ్యాయము మొదలు 42 వ అధ్యాయము వరకు 18 అధ్యాయములు భగవద్గీతగా ప్రసిద్ధము. అట్టి 18 అధ్యాయముల భగవద్గీతలో సాంఖ్యయోగము రెండవ అధ్యాయము.

ఓ అర్జునా! నీవు దేహము కాదు. దేహివి. దేహములు నశించును. దేహి (ఆత్మ) నశింపదు. ఆత్మ ఎన్నడును పుట్టుటలేదు, చచ్చుట లేదు. జనన మరణములు లేనిది. ఆత్మ నిత్యము, శాశ్వతము, నాశరహితము సనాతనము, అప్రమేయము. ఆత్మ అగ్నిచే దహింపబడదు, జలముచే తడుపబడదు, దేనిచేతనూ ఛేదింపబడదు. దేహికి(ఆత్మకి) శరీరములు వస్త్రములవంటివి. మురికివస్త్రములుగాని, చిగిగిన వస్త్రములనుగాని మనుజుడు తొలగించివేసి నూతన వస్త్రములను ధరించునట్లు, జీవుడు కూడ జీర్ణమైన దేహములను విడిచి నూతన దేహమును పొందుతున్నాడు. జీవుడు కర్మవశముచే అనేక దేహములను ధరించి మరల వానిని విడుచుచున్నాడు. కావున ఓ అర్జునా! వస్త్రముల వంటి ఈ శరీరములకై నీవు శోకించవద్దు. నేనుగాని, నీవుగాని, ఈ రారాజులుగాని ఆత్మ రూపముతో ఎల్లప్పుడు ఉండువారమే. నాశము దేహములకే కాని ఆత్మ రూపులమైన మనకు నాశనము లేదు. అవ్యయమగు ఆత్మకు వినాశము కలుగజేయగల నాధుడెవ్వడును లేడు. కావున లేమ్ము! కర్తవ్యోన్ముఖుడవు కమ్ము.

సుఖధుఃఖములయందును, లాభాలాభములయందును, శుభాశుభములయందును, జయాపజయములందును, ప్రాప్తాప్రాప్తములయందును సమబుద్ధిగలిగి కార్యములనాచరింపుము. అప్పుడు పాపము నిన్నంటకుండును. సమత్వం యోగ ఉచ్యతే– అట్టి సమత్వబుద్ధియే వాస్తవముగా యోగమనబడును. కర్మలు చేయుటయందే నీకధికారము కలదు. కాని వాని ఫలములను గోరుటయందు కాదు. కావున నిష్కమబుద్ధితో కార్యముల నాచరింపుము. నీ స్వస్వరూపమగు ఆత్మయందు స్థితిగల్గి, దేహభావనలేనివాడవై అసక్తముగ కర్మలను జేయుము. ఆత్మ జ్ఞానము కలిగిన పిమ్మట చేయుకార్యములు ఎంతయో పవిత్రవంతములుగను నిర్లేపములుగను నుండును.

మహాభారత ఇతిహాసములోని భీష్మపర్వము 25వ అధ్యాయము మొదలు 42 వ అధ్యాయము వరకు 18 అధ్యాయములు భగవద్గీతగా ప్రసిద్ధము. అట్టి 18 అధ్యాయముల భగవద్గీతలో సాంఖ్యయోగము రెండవ అధ్యాయము.

అథ ద్వితీయోఽధ్యాయః ।
సంజయ ఉవాచ ।
తం తథా కృపయావిష్టమశ్రుపూర్ణాకులేక్షణమ్ ।
విషీదంతమిదం వాక్యమువాచ మధుసూదనః ॥౧॥

తథా = ఆ విధముగా, **కృపయా** = కరుణచే, **ఆ విష్టం** = నిండియున్న వాడును, **అశ్రుపూర్ణాకులేక్షణం** = కన్నీరు నిండుకొని కలతబారిన నేత్రములు గల వాడును, **విషీదన్తం** = శోకించుచున్న వాడును నగు, **తం** = అట్టి అర్జునునిగూర్చి, **మధుసూదనః** = మధుసూదనుడు, **ఇదం వాక్యం** = ఈ వాక్యమును, **ఉవాచ** = అనెను.

తాత్పర్యము – సంజయుడు ఇలా అన్నాడు–
ఆ విధముగా కరుణచే నిండియున్న వాడును, కన్నీరు నిండుకొని కలతబారిన నేత్రములు గల వాడును, శోకించుచున్న వాడును నగు అట్టి అర్జునునిగూర్చి మధుసూదనుడు ఈ వాక్యమును అనెను.

శ్రీభగవానువాచ ।
కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్ ।
అనార్యజుష్టమస్వర్గ్యమకీర్తికరమర్జున ॥౨॥

అర్జున! = అర్జునా!, **అనార్యజుష్టం** = పామరులచే అవలంబింపబడ దగినదియు (శ్రేష్ఠులగువారికి తగనిదియు), **అస్వర్గ్యం** = స్వర్గలోకప్రాప్తికి అనర్హమైనదియు, **అకీర్తికరం** = అపకీర్తిని గలుగ జేయునదియు నగు, **ఇదం కశ్మలం** = ఈ మాలిన్యము(అజ్ఞానము), **విషమే** = ఈ విషమస్థితియందు, **కుతః** = ఏ కారణమువలన **త్వా** = నిన్ను, **సముపస్థితం** = దాపురించినది?

తాత్పర్యము – శ్రీభగవానువాచ –
అర్జునా! పామరులచే అవలంబింపబడ దగినదియు, స్వర్గలోకప్రాప్తికి అనర్హమైనదియు, అపకీర్తిని గలుగ జేయునదియు నగు ఈ మాలిన్యము (అజ్ఞానము) ఈ విషమస్థితియందు ఏ కారణమువలన నిన్ను దాపురించినది?

క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే ।
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥౩॥

పార్థ! = అర్జునా!, **క్లైబ్యం** = అధైర్యమును, **మా స్మ గమః** = పొందకుము. **త్వయి** = నీ యందు, **ఏతత్** = ఈ అధైర్యము, **న ఉపపద్యతే** = పొందతగినది గాదు. **హే పరంతప!** = ఓ పరంతపా!, **క్షుద్రం** = తుచ్ఛమైన(నీచమైన), **హృదయ దౌర్బల్యం** = హృదయ దౌర్బల్యమును(పిరికితనమును), **త్యక్త్వా** = విడిచి, **ఉత్తిష్ఠ** = లెమ్ము.

తాత్పర్యము– అర్జునా! అధైర్యమును పొందకుము. నీ యందు ఈ అధైర్యము పొందతగినది గాదు. ఓ పరంతపా! తుచ్ఛమైన (నీచమైన) హృదయ దౌర్బల్యమును(పిరికితనమును) విడిచి లెమ్ము.

వివరణ – దుర్బలత్వము కలవాడు,అధైర్యమును వరించువాడు ఆత్మనెన్నటికి పొందజాలడని ఉపషత్తులు చెప్పుచున్నవి. "**నాయామాత్మ బలహీనేనలభ్యః**– ఈ ఆత్మ బలహీనులచే పొందబడదు" – అని ముండకోపనిషత్తు నందు చెప్పబడినది. ఎచ్చట ధైర్యముండునో, ఉత్సాహముండునో, ఆనందముండునో అచట పరమాత్మ నివసించును. పిరికితనము, దౌర్బల్యము ఉన్నచోట పరమాత్మ పొందబడదు. **ఉత్సాహం సాహసం ధైర్యం బుద్ధిశ్శక్తిః పరాక్రమః షడేతే యత్ర తిష్ఠన్తి తత్ర దేవో஽పి తిష్ఠతి**

అను శాస్త్రప్రమాణముననుసరించి ఉత్సాహము,సాహసము, ధైర్యము, సద్బుద్ధి, పరాక్తమము అను ఈ ఆరు గుణములు ఉండుచోట సాక్షాత్ భగవంతుడు నివాసముండును.

అర్జున ఉవాచ– ।
కథం భీష్మమహం సాంఖ్యే ద్రోణం చ మధుసూదన ।
ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరిసూదన ॥౪॥

అరిసూదన = శత్రువులను నశింపజేయువాడవగు, **హే మధుసూదన!** = ఓ మధుసూదన!, **అహం** = నేను, **సంఖ్యే** = యుద్ధమునందు, **పూజార్హౌ** = పూజనీయులగు, **భీష్మం** = భీష్మాచార్యుని, **ద్రోణం చ** = ద్రోణాచార్యుని, **ఇషుభిః** = బాణములచేత, **కథం** = ఎట్లు, **ప్రతియోత్స్యామి** = ఎదిరించి యుద్ధము చేయగలను.

తాత్పర్యము– అర్జున ఉవాచ–

శత్రువులను నశింపజేయువాడవగు ఓ మధుసూదన! నేను యుద్ధమునందు పూజనీయులగు భీష్మాచార్యుని, ద్రోణాచార్యుని బాణములచేత ఎట్లు ఎదిరించి యుద్ధము చేయగలను.

గురూనహత్వా హి మహానుభావాన్శ్రేయో భోక్తుం భైక్ష్యమపీహ లోకే ।
హత్వార్థకామాంస్తు గురునిహైవ భుంజీయ భోగాన్஽రుధిరప్రదిగ్ధాన్ ॥౫॥

మహానుభావాన్ = మహానుభావులైన, **గురూన్** = గురువులను, **హత్వా తు** = చంపితే, **ఇహ** = ఈ లోకము నందు, **అర్థకామాన్** = అర్థకామాత్మకములైనట్టి, **రుధిరప్రదిగ్ధాన్** = రక్తసిక్తములైనట్టి, **భోగాన్** = భోగములను, **భుంజీయ** = అనుభవిస్తాను. **హి** = ఆ కారణము

వలన, **గురూన్** = గురువులను, **అహత్వ ఏవ** = చంపకుండా, **ఇహ లోకే** = ఈ లోకము నందు. **భోక్తుం** = భుజించుటకొరకు, **భైక్ష్యం అపి** = భిక్షాన్నమైనను, **శ్రేయః హి** = శ్రేయస్కరమైనదే కదా!

తాత్పర్యము– మహానుభావులైన గురువులను చంపితే ఈ లోకము నందు అర్థకామాత్మకములైనట్టి, రక్తసిక్తములైనట్టి భోగములను అనుభవిస్తాను. ఆ కారణము వలన గురువులను చంపకుండా ఈ లోకము నందు భుజించుటకొరకు భిక్షాన్నమైనను శ్రేయస్కరమైనది కదా!

న చైతద్విద్మః కతరన్నో గరీయో యద్వా జయేమ యది వా నో జయేయుః ।
యానేవ హత్వా న జిజీవిషామస్తేఽవస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః ॥౬॥

యాన్ = ఎవరిని, **హత్వా** = వధించి, **న జిజీవిషామః** = మనము జీవించుటకు నిచ్చగించమో, **తే** = అట్టి, **ధార్తరాష్ట్రాః ఏవ** = ధృతరాష్ట్రుని సంబంధులగు భీష్మాదులే, **ప్రముఖే** = సేనాగ్రభాగమున, **అవస్థితాః** = నిలిచియున్నారు. **జయేమ** = జయింతుమో, **యద్వా** = లేక, **నః** = మనలను, **జయేయుః యది వా** = జయింతురో యేమో, **ఏతత్ చ** = ఇదియును, **న విద్మః** = ఎరుంగజాలకున్నాము. **నః** = మనకు, **కతరత్** = ఏది, **గరీయః** = శ్రేష్ఠమైనది?

తాత్పర్యము– ఎవరిని వధించి మనము జీవించుటకు నిచ్చగించమో అట్టి ధృతరాష్ట్రుని సంబంధులగు భీష్మాదులే సేనాగ్రభాగమున నిలిచియున్నారు. జయింతుమో లేక మనలను జయింతురో యేమో ఇదియును ఎరుంగజాలకున్నాము. మనకు ఏది శ్రేష్ఠమైనది?

కార్పణ్యదోషోపహతస్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసంమూఢచేతాః ।
యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥౭॥

కార్పణ్యదోషోపహతస్వభావః = కృపణత్వము(ఆత్మజ్ఞానశూన్యత)వలన గలిగిన దోషముచేత ఛిన్నాభిన్నమైన స్వభావము గలవాడను గనుక, **ధర్మసమ్మూఢచేతాః** = ధర్మవిచక్షణ చేయలేని చిత్తముగలవాడనై (యుక్తాయుక్త పరిజ్ఞానములేనివాడనై), **త్వాం** = నిన్ను, **పృచ్ఛామి** = అడుగుచున్నాను. **యత్** = ఏది, **శ్రేయః** = శ్రేయస్కరము, **స్యాత్** = అగునో, **తత్** = దానిని, **మే** = నాకు, **నిశ్చితం** = నిశ్చయముగా, **బ్రూహి** = చెప్పుము. **అహం** = నేను, **తే** = నీకు, **శిష్యః** = శిష్యుడను, **త్వాం** = నిన్ను, **ప్రపన్నం** = శరణు నొందిన, **మాం** = నన్ను, **శాధి** = శాసింపుము.

తాత్పర్యము– కృపణత్వము (ఆత్మజ్ఞానశూన్యత) వలన గలిగిన దోషముచేత ఛిన్నాభిన్నమైన స్వభావము గలవాడను గనుక ధర్మవిచక్షణ చేయలేని చిత్తముగలవాడనై నిన్ను అడుగుచున్నాను. ఏది శ్రేయస్కరము అగునో దానిని నాకు నిశ్చయముగా చెప్పుము. నేను నీకు శిష్యుడను. నిన్ను శరణు నొందిన నన్ను శాసింపుము.

వివరణ –

న హి ప్రపశ్యామి మమాపనుద్యాద్యచ్ఛోకముచ్ఛోషణమింద్రియాణామ్ ।
అవాప్య భూమావసపత్నమృద్ధం రాజ్యం సురాణామపి చాధిపత్యమ్ ॥౮॥

ఇంద్రియాణాం = ఇంద్రియములను, **ఉచ్ఛోషణం** = శోషింప చేయుచున్న, **మమ** = నా యొక్క, **శోకం** = శోకమును, **యత్** = ఏది, **అపనుద్యాత్** = తొలగజేయునో, **తత్** = దానిని, **భూమౌ** = భూలోకమునందు, **అసపత్నం** = నిష్కంటకమైనదియు, **ఋద్ధం** = సమృద్ధమైనదియు నగు, **రాజ్యం** = రాజ్యమును, **సురాణాం** = దేవతలకు, **ఆధిపత్యం చ** = అధిపతిగా నుండునట్టి ఇంద్రపదవినిన్ని, **అవాప్య అపి** = పొందియైనను, **న ప్రపశ్యామి హి** = జూడజాలకున్నానుగదా!

తాత్పర్యము– ఇంద్రియములను శోషింప చేయుచున్న నా యొక్క శోకమును ఏది తొలగజేయునో దానిని భూలోకమునందు నిష్కంటకమైనదియు సమృద్ధమైనదియు నగు రాజ్యమును, దేవతలకు అధిపతిగా నుండునట్టి ఇంద్రపదవినిన్ని పొందియైనను జూడజాలకున్నానుగదా!

సంజయ ఉవాచ– ।
ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతప ।
న యోత్స్య ఇతి గోవిందముక్త్వా తూష్ణీం బభూవ హ ॥౯॥

పరంతపః = పరంతపుడగు (శత్రువినాశకుడగు), **గుడాకేశః** = అర్జునుడు, **హృషీకేశం** = సర్వేంద్రియములకు ఈశ్వరుడగు, **గోవిందం** = గోవిందునితో(శ్రీకృష్ణునితో), **ఏవం** = ఈ ప్రకారము, **ఉక్త్వా** = చెప్పి, **న యోత్స్యేఇతి** = యుద్ధముచేయనని, **ఉక్త్వా** = పలికి, **తూష్ణీం బభూవ** = మౌనముగా ఉండెను. **హ** = ఆశ్చర్యము

తాత్పర్యము– సంజయ ఉవాచ–
పరంతపుడగు (శత్రువినాశకుడగు) అర్జునుడు సర్వేంద్రియములకు ఈశ్వరుడగు గోవిందునితో(శ్రీకృష్ణునితో) ఈ ప్రకారము చెప్పి యుద్ధముచేయనని పలికి మౌనముగా ఉండెను.

తమువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత ।
సేనయోరుభయోర్మధ్యే విషీదంతమిదం వచః ॥౧౦॥

హే భారతా! = భరతవంశజుడవైన ఓ ధృతరాష్ట్రమహారాజా!, **ఉభయోః** = ఉభయ, **సేనయోః** = సైన్యముల యొక్క, **మధ్యే** = నడుమ, **విషీదన్తం** = దుఃఖించుచున్న, **తం** = ఆ యర్జునునిగూర్చి, **హృషీకేశః** = శ్రీ కృష్ణమూర్తి, **ప్రహసన్ఇవ** = నవ్వుచున్నవానివలె, **ఇదం** = ఈ, **వచః** = వాక్యమును, **ఉవాచ** = పలికెను.

తాత్పర్యము– భరతవంశజుడవైన ఓ ధృతరాష్ట్రమహారాజా! ఉభయ సైన్యముల యొక్క నడుమ దుఃఖించుచున్న ఆ యర్జుననిగూర్చి శ్రీ కృష్ణమూర్తి నవ్వుచున్నవానివలె ఈ వాక్యమును పలికెను.

శ్రీభగవానువాచ–।
అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।
గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥౧౧॥

త్వం = నీవు, **అశోచ్యాన్** = దుఃఖింపతగనివారిని గూర్చి, **అన్వశోచః** = దుఃఖించితివి, **ప్రజ్ఞావాదాన్ చ** = ప్రజ్ఞావంతులు పలుకునట్టి మాటలనుగూడ, **భాషే సే** = పలుకుచున్నావు. **పండితాః** = పండితులు, **గతాసూన్** = మరణించినవారల గూర్చియు, **ఆగతాసూన్ చ** = బ్రతికియుండువారిని గూర్చియు, **న అనుశోచన్తి** = శోకింపరు.

తాత్పర్యము– నీవు దుఃఖింపతగనివారిని గూర్చి దుఃఖించితివి. ప్రజ్ఞావంతులు పలుకునట్టి మాటలనుగూడ పలుకుచున్నావు. పండితులు మరణించినవారల గూర్చియు, బ్రతికియుండువారిని గూర్చియు శోకింపరు.

వివరణ –పతంజలియోగసూత్రము నందు అవిద్య గురించి ఇలా చెప్పబడినది. "**అనిత్యాశుచిదుఃఖానాత్మసు నిత్యశుచిసుఖాత్మఖ్యాతిరవిద్యా**– అనిత్యమును నిత్యముగను, అపవిత్రమైనదానిని పవిత్రవంతముగను, అనాత్మను ఆత్మరూపముగను గ్రహించుటయే అవిద్య." అవిద్యా ప్రభావముచే మోహితుడవై దుఃఖింపతగనివారిని గూర్చి దుఃఖించుచున్నావు. ప్రజ్ఞావంతులు పలుకునట్టి మాటలనుగూడ పలుకుచున్నావు. కాని పండితులు మరణించినవారల గూర్చియు, బ్రతికియుండువారిని గూర్చియు శోకింపరు.

న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః ।
న చైవ న భవిష్యామః సర్వే వయమతః పరమ్ ॥౧౨॥

అహం = నేను, **జాతు** = ఒకప్పుడు, **న అసం** = లేకుంటిననునది, **న ఏవ** = లేనేలేదు, **త్వం తు** = నీవైతేనో, **న** = లేకుంటివనునది, **న** = లేదు, **ఇమే జనాధిపాః** = ఈ రాజులు, **న** = లేకపోయిరనునది, **న** = లేదు, **వయం సర్వే** = మనమందరము, **అతః పరం** = ఇకమీదను, **న భవిష్యామః ఏవ చ** = లేకపోదుమనునదియు, **న** = లేదు.

తాత్పర్యము– నేను ఒకప్పుడు లేకుంటిననునది లేనేలేదు. నీవైతేనో లేకుంటివనునది లేదు. ఈ రాజులు లేకపోయిరనునది లేదు. మనమందరము ఇకమీదను లేకపోదుమనునదియు లేదు. ఆత్మ దృష్టిలో అందరము నిత్యులమేనని భావము.

వివరణ – అర్జునా! నీవు ' భీష్మదు మొదలగువారు చనిపోవుదురు ' అని దుఃఖించుచున్నావే. భీష్మదు అనునది శరీరమా? లేక ఆత్మయా? శరీరమే అందువా? అదెట్లును నశించెడిదే. నీవు ఎంత జాగ్రత్తగా కాపాడినను, అది నిలుచునదికాదు. ఆత్మ యందువా? అది ఎప్పుడును చచ్చునదికాదు. ఎవరును చంపలేరు. ఇక దేనికొరకు ఏడ్చుట?

శరీరములు నశించునప్పటికిని ఆత్మకు నాశనము లేదు, అని అర్జునినికి ధైర్యము కలిగించుటకు ఇట్లు ఉపదేశించడమైనది. జనన మరణములు దేహములకే కాని ఆత్మకు లేవు. ఆత్మ సనాతనము, జ్ఞానస్వరూపము. దేహము దేశకాల పరిచ్ఛిన్నము, కాని దేహమునందు ఉండు ఆత్మ దేశకాల అపరిచ్ఛిన్నము.

దేహినోఽస్మిన్యథా దేహే కౌమారం యౌవనం జరా ।
తథా దేహాంతరప్రాప్తిర్ధీరస్తత్ర న ముహ్యతి ॥౧౩॥

దేహిన = దేహధారియగు జీవునికి, **అస్మిఁదేహే** = ఈ శరీరమునందు, **కౌమారం** = బాల్యదశ, **యౌవనం** = యౌవనదశ, **జరా** = వార్ధక్యదశయును, **యథా** = ఏ ప్రకారమో, **తథా** = అ ప్రకారమే, **దేహాంతర ప్రాప్తిః** = మఱియొక దేహమును పొందుటయు, **ధీరః** = ధీరుడు, **తత్ర** = ఆ విషయమున, **న ముహ్యతి** = మోహమును జెందదు.

తాత్పర్యము– దేహధారియగు జీవునికి ఈ శరీరమునందు బాల్యదశ, యౌవనదశ, వార్ధక్యదశయును ఏ ప్రకారమో అ ప్రకారమే మఱియొక దేహమును పొందుటయును. ధీరుడు ఆ విషయమున మోహమును జెందదు.

వివరణ – దేహమునకు మూడు అవస్థలుండును. అవి బాల్యము, యవ్వనము, వార్ధక్యము. కాని ఈ మూడు అవస్థలు దేహధారియగు జీవునికు(ఆత్మకు) ఉండవు. దేహము ఒక అవస్థ నుండి మరొక అవస్థకి మార్పు చెందుతూ ఉంటుంది. కాని ఆత్మ మార్పుచెందదు. అటులనే ఆత్మ వికారమొందకయే దేహాంతరమును పొందుచున్నది. అనగా దేహము నశించినను ఆత్మ మూడుకాలములలోను మార్పు చెందక నిత్యుడిగా నుండును. కావున దేహి(ఆత్మ) త్రికాలములలోనూ ఉన్నవాడు, నిత్యుడు. దేహము నశించిపోయినను, జీవుడెట్టి వికారమును జెందక మరియొక దేహమును పొందుచున్నాడు.
మట్టితో చేసిన ఒక బొమ్మను తీసుకుందాము. మట్టితో ఒక బొమ్మను చేయడం అంటే మట్టి ఒక ఆకారాన్ని పొందినట్టే కదా! ఆ ఆకారము (బొమ్మ) కొంతకాలము ఉండి పగిలిపోయి మరొక ఆకారము(బొమ్మ)గా రూపాంతరము జెందుతుంది. అంటే ఇక్కడ ఆకారము రూపాంతరము చెందుతుంది కాని, ఆ ఆకారముల యందు వ్యాపించిన మట్టి రూపాంతరము జెందడము లేదు. ఇక్కడ బొమ్మ అనగా దేహము, మట్టి అనగా దేహమంతటా వ్యాపించిన ఆత్మ.

మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః ।
ఆగమాపాయినోఽనిత్యాస్తాంస్తితిక్షస్వ భారత ॥౧౪॥

హే కౌంతేయ! = కుంతీ పుత్రుడవగు ఓ అర్జునా!, **మాత్రాస్పర్శాః తు** = ఇంద్రియములకు శబ్దము మొదలగు విషయములతోడ గలిగెడు సంయోగములైతేనో, **శీతోష్ణసుఖదుఃఖదాః** = శీతోష్ణ సుఖదుఃఖముల నిచ్చునవి, **అగమాపాయినః** = రాకపోకలు (జనించి అంతరించు స్వభావము) గలిగినవి, **అనిత్యాః** = అనిత్యములును అయినవి, కావున, **హే భరత!** = ఓ భరతకులసంభవుడా!, **తాఁ** = వాటిని, **తితిక్షస్వ** = సహింపుము.

తాత్పర్యము– కుంతీ పుత్రుడవగు ఓ అర్జునా! ఇంద్రియములకు శబ్దము మొదలగు విషయములతోడ గలిగెడు సంయోగము శీతోష్ణ సుఖదుఃఖముల నిచ్చునవి, రాకపోకలు

(జనించి అంతరించు స్వభావము) గలిగినవి, అనిత్యములును అయినవి. కావున ఓ భరతకులసంభవుడా! వాటిని సహింపుము.

వివరణ - కన్ను-ఇంద్రియము, చూసేశక్తి-ఇంద్రియశక్తి. వీటితో ఒక రూపమును(దృశ్యమును) చూస్తున్నాము. కనుక రూపము(దృశ్యము) అనునది ఇంద్రియవిషయము. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు అను ఈ ఐదు ఇంద్రియవిషయములు.

కన్ను-ఇంద్రియము చూసేశక్తి-ఇంద్రియశక్తి వీటితో ఒక రూపమును చూస్తున్నాము, కనుక రూపము(దృశ్యము) - ఇంద్రియవిషయము	చెవి-ఇంద్రియము వినేశక్తి-ఇంద్రియశక్తి వీటితో ఒక శబ్దమును వింటున్నాము, కనుక శబ్దము - ఇంద్రియవిషయము

ఇలా ఐదు ఇంద్రియవిషయములు ఉంటాయి. అవి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు. వీటినే పంచతన్మాత్రలు అంటాము. ఇంద్రియములతో గూడిన ఈ దేహము ఈ ఐదింటి ద్వారానే ప్రపంచాన్ని గ్రహిస్తుంది. ఇలా గ్రహించేటప్పుడు ఈ ఐదింటితో ఏర్పడే సంయోగము వలన శీతోష్ణ సుఖదుఃఖములు కలుగుచున్నవి. ఈ శీతోష్ణ సుఖదుఃఖములు అనిత్యములు, వస్తూపోతూ ఉంటాయి. వీటిని సహించడమే తితిక్ష. వీటిని సహింపమని శ్రీకృష్ణుడు అర్జునునికి చెప్పెను. అలా చెప్పుటకు గల కారణమును ఈ క్రింది శ్లోకము నందు వివరించెను.

యం హి న వ్యథయంత్యేతే పురుషం పురుషర్షభ ।
సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే ॥౧౫॥

హే పురుషర్షభ! = పురుషశ్రేష్ఠుడవగు ఓ అర్జునా!, **హి** = ఏలయనగా, **సమదుఃఖసుఖం** = సుఖదుఃఖములయందు సమభావముగలవాడును, **ధీరం** = ధీరుడైన (దృఢచిత్తముగలవాడునునైన), **యం పురుషం** = ఏ పురుషుని, **ఏతే** = ఇంద్రియవిషయ సంయోగము వలన కలిగెడి ద్వంద్వములు, **న వ్యథయంతి** = చెలింపచేయవో, **సః** = ఆ పురుషుడు, **అమృతత్వాయ** = మోక్షముకొఱకు, **కల్పతే** = అర్హుడగుచున్నాడు.

తాత్పర్యము- పురుషశ్రేష్ఠుడవగు ఓ అర్జునా! ఏలయనగా సుఖదుఃఖములయందు సమభావముగలవాడును ధీరుడైన (దృఢచిత్తముగలవాడునునైన) ఏ పురుషుని ఇంద్రియవిషయ సంయోగము వలన కలిగెడి ద్వంద్వములు చెలింపచేయవో, ఆ పురుషుడు మోక్షముకొఱకు అర్హుడగుచున్నాడు.

వివరణ - ఎవడు సుఖదుఃఖములను సమముగా చూడగలుగుచున్నాడో, ఎవనిని ఈ ఇంద్రియవిషయ సంయోగము వలన కలిగెడి ద్వంద్వములు చలింపజేయజాలవో, అట్టి ధీరుడు మాత్రమే అమృతత్వమునకు-మోక్షమునకు- అర్హుడగుచున్నాడు.
వీరుడనగా బాహ్యశత్రువులను జయించగలిగినవాడు, ధీరుడనగా అంతఃశత్రువులను జయించగలిగినవాడు. కావుననే ఈ శ్లోకములో "ధీరం" అని ప్రయోగించినాడు. ధీరునకు సుఖదుఃఖములు సమానములు. ఇవన్నియును అనిత్యములగుటచే, అతనికి ఈ ద్వంద్వములయందు ఇష్టానిష్టములుండవు. ద్వద్వములను సహించుకొనగలడు. ధీరుని ఈ ఇంద్రియవిషయ సంయోగము వలన కలిగెడి ద్వంద్వములు ఎంతమాత్రమును బాధింపజాలవు. ధీరుడు విషయేంద్రియ సంయోగమునకు చలించడు. కనుక శ్రీకృష్ణుడు అర్జునునితో "అర్జునా! నీవు సహజముగ ధీరుడవు. కనుక మోహితుడవుగాక వీటిని సహించుకొనుము. అట్లు

సహించుకొనగలిగినవాడే, ద్వంద్వములచేత బాధనొందనివాడే, మోక్షమునకు అర్హుడగుచున్నాడు" అని చెప్పుచున్నాడు

నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।
ఉభయోరపి దృష్టోఽంతస్త్వనయోస్తత్త్వదర్శిభిః ॥౧౬॥

అసతః = అసత్తునకు(లేనిదానికి), **భావః** = వాస్తవమైన ఉనికి, **న విద్యతే** = లేదు. **సతః** = సత్తునకు (కలదానికి), **అభావః** = లేకుండుట, **న విద్యతే** = లేదు. **అనయోః** = ఈ, **ఉభయోః అపి** = రెండింటియొక్కయు, **అంతః తు** = నిశ్చయమైతేనో, **తత్త్వదర్శిభిః** = తత్త్వమును (బ్రహ్మమును) దర్శించిన వారలచేత , **దృష్టః** = తెలిసికొనబడియున్నది.

తాత్పర్యము- అసత్తునకు(లేనిదానికి) వాస్తవమైన ఉనికి లేదు. సత్తునకు (కలదానికి) లేకుండుట లేదు. ఈ రెండింటియొక్కయు నిశ్చయమైతేనో తత్త్వమును (బ్రహ్మమును) దర్శించిన వారలచేత తెలిసికొనబడియున్నది.

వివరణ- ఇక్కడ భావము అనగా నిత్యత్వము, అభావము అనగా అనిత్యత్వము. అసత్తునకు ఎప్పుడును నిత్యత్వములేదు. సత్తునకు అనిత్యత్వము లేదు అనగా సత్తు నిత్యము, శాశ్వతము. అసత్పదార్థము అనగా ఈ నామరూపాత్మకమైన జగత్తంతయును. సత్పదార్థమనగా ఆత్మసముదాయము ,పరమాత్మ, పరబ్రహ్మ. అశాశ్వత వస్తువుకు స్థిరమైన ఉనికి లేదు. శాశ్వత వస్తువుకు నాశములేదు. ఈ రెండిటియొక్క పర్యవసానము తత్త్వజ్ఞులకు గోచరించుచుండును.

దేనికి పరివర్తనము, నాశనము కలదో, అది "అసత్" అనియును, "అసత్" ఎల్లప్పుడును ఉండునది కాదనియును; దేనికి ఏ అవస్థయందును, ఏ కారణముచేతను, ఎప్పుడును, పరవర్తనము, నాశనములేదో, ఏది ఎల్లప్పుడును ఉండునో అది "సత్" అనియును, ఆ సత్పదార్థము ఎప్పుడును నశించునది కాదనియును పరమాత్మసాక్షాత్కారము పొందిన తత్త్వదర్శినులు అనుభవపూర్వకముగ తెలుసికొని నిర్ణయించినారు.

అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్ ।
వినాశమవ్యయస్యాస్య న కశ్చిత్కర్తుమర్హతి ॥౧౭॥

యేన = ఏ ఆత్మచేత, **ఇదం సర్వం** = ఈ సమస్తప్రపంచము, **తతం** = వ్యాపింపబడియున్నదో, **తత్ తు** = ఆ యాత్మనైతేనో, **అవినాశి** = నాశరహితమైనదానినిగా, **విద్ధి** = ఎఱుంగుము. **అవ్యయస్య** = నాశములేని, **అస్య** = ఈ ఆత్మకు, **వినాశం** = నాశమును, **కర్తుం** = చేయుటకు, **కశ్చిత్** = ఎవడును, **న అర్హతి** = అర్హుడుగాడు.

తాత్పర్యము-ఏ ఆత్మచేత ఈ సమస్తప్రపంచము వ్యాపింపబడియున్నదో, అట్టి(సర్వవ్యాపియైన)ఆత్మ నాశరహితమైనదానినిగా ఎఱుంగుము. నాశములేని ఈ ఆత్మకు నాశమును చేయుటకు ఎవడును అర్హుడుగాడు.

వివరణ - ఈ జగత్తంతయు ఏ "సత్" అను పేరుగల బ్రహ్మముచేత వ్యాపింపబడియున్నదో దానిని నాశరహితముగా తెలుసుకొనుము. ఇట్టి ఈ బ్రహ్మము నిర్వకారము. సర్వకాలసర్వావస్థలలో ఒకే రీతిగా

ఉండునది, మార్పుచెందనిది. దానిని నశింపజేయుటకు సమర్థులైనవారు ఎవరును లేరు. ఏ పదార్థము చేతను ఇది నశింపజేయబడదు. ఆత్మ అవినాశి, నిత్యము.

అంతవంత ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః ।
అనాశినోఽప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత ॥౧౮॥

నిత్యస్య = నిత్యుడుగను(శాశ్వతముగా నుండువాడును), **అనాశినః** = నాశరహితుడును, **అప్రమేయస్య** = ప్రత్యక్షాది ఏ ప్రమాణములచేతనూ తెలియబడనివాడును(అగోచరుడును) నగు, **శరీరిణః** = దేహధారియగు జీవునియొక్క, **ఇమే దేహాః** = ఈ శరీరములు, **అన్తవన్తః** = నశించునట్టివి అని, **ఉక్తాః** = చెప్పబడినవి, **తస్మాత్** = అందువలన, **హే భారత!** = ఓ అర్జునా!, **యుధ్యస్వ** = యుద్ధము చేయుము.

తాత్పర్యము– నిత్యుడుగను(శాశ్వతముగా నుండువాడును),నాశరహితుడును, ప్రత్యక్షాది ఏ ప్రమాణములచేతనూ తెలియబడనివాడును(అగోచరుడును) నగు దేహధారియగు జీవుని(ఆత్మ)యొక్క ఈ శరీరములు నశించునట్టివి అని చెప్పబడినవి. అందువలన ఓ అర్జునా! యుద్ధము చేయుము.

వివరణ – ఆత్మ, శరీరమును ధరించినవాడు కనుక శరీరి, నాశనము లేనివాడు కనుక అనాశి. ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శబ్దము, అర్థాపత్తి, అనుపలబ్ధి మొదలగు ఏ ప్రమాణములచేతనూ తెలియబడనివాడును కనుక అప్రమేయుడు. కాలము, దేశము, స్వరూపము వీటిచే తెలుసుకొనుటకు వీలులేనివాడు కనుక అప్రమేయుడు. ఇట్టివాడని కాని, ఇంతవాడని కాని, బుద్ధీంద్రియములచే తెలియబడనివాడు కనుక అప్రమేయుడు. దేశకాల అపరిచ్ఛిన్నము, భూతభవిష్యద్వర్తమాన కాలములయందుండువాడు కనుక ఆత్మ నిత్యుడు, అవినాశి.

య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్ ।
ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే ॥౧౯॥

యః = ఎవడు, **ఏనం** = ఈ ఆత్మను, **హంతారం** = చంపుదానినిగా, **వేత్తి** = తలంచుచున్నాడో, **యః చ** = ఎవడైతే, **ఏనం** = ఈ ఆత్మను, **హతం** = చంపబడుదానినిగా, **మన్యతే** = తలచుచున్నాడో, **తౌ ఉభౌ** = వారిరువురును, **న విజానీతః** = తత్త్వమును తెలిసినవారుకారు, **అయం** = ఈ ఆత్మ, **న హన్తి** = చంపునదికాదు, **న హన్యతే** = చంపబడునదియు కాదు.

తాత్పర్యము– ఎవడు ఈ ఆత్మను చంపుదానినిగా తలంచుచున్నాడో, ఎవడైతే ఈ ఆత్మను చంపబడుదానినిగా తలచుచున్నాడో వారిరువురును తత్త్వమును తెలిసినవారుకారు. ఈ ఆత్మ చంపునదికాదు, చంపబడునదియు కాదు.

వివరణ –

న జాయతే మ్రియతే వా కదాచిన్నాయం భూత్వా భవితా వా న భూయః ।
అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥౨౦॥

అయం = ఈ ఆత్మ, **కదాచిత్** = ఎప్పటికిని, **న జాయతే** = పుట్టునది కాదు, **న మ్రియతే వా** = చచ్చునదియును కాదు, **న భూత్వా** = ఇదివఱకు లేకుండి, **భూయః** = మఱల, **భవితా వా న** = కలుగునదియు(పుట్టునదియు) కాదు, మఱియేనిన, **అయం** = ఈ ఆత్మ, **అజః** = పుట్టుక లేనిది, **నిత్యః** = నిత్యమైనది, **శాశ్వతః** = శాశ్వతమైనది(ఎల్లప్పుడు నుండునది), **పురాణః** = పురాణమైనది(అనాదియైనది) కనుక, **శరీరే** = దేహము, **హన్యమానే** = చంపబడినదైనను, (ఈ ఆత్మ) **న హన్యతే** = చంపబడదు.

తాత్పర్యము– ఈ ఆత్మ ఎప్పటికిని పుట్టునది కాదు, చచ్చునదియును కాదు. ఇదివఱకు లేకుండి మఱల కలుగునదియు(పుట్టునదియు) కాదు. మఱియేనిన, ఈ ఆత్మ పుట్టుక లేనిది, నిత్యమైనది, శాశ్వతమైనది(ఎల్లప్పుడు నుండునది), పురాణమైనది(అనాదియైనది) కనుక, దేహము చంపబడినదైనను ఈ ఆత్మ చంపబడదు.

వివరణ – లోకమునందు ప్రతి వస్తువునకు ఆరు వికారములు కలవు. అవి పుట్టుట, ఉండుట, వృద్ధిపొందుట, మార్పుచెందుట, క్షీణించుట, నశించుట. కాని ఈ ఆరు వికారములు ఆత్మకు లేవు. కనుక ఆత్మ వికారరహితము, నిర్వికారము. ఆత్మ శాశ్వతము, సనాతనము.

ఆత్మ, ఒక కాలము నందును జనించుటలేదు, ఏకాలమునందును మరణమొందుటలేదు. ఒక కాలమునందు ఉండి, మరొక కాలము నందు లేకుండుట యనునది లేదు. అన్ని కాలములయందును, ఎల్లప్పుడును ఉండునదియే. ఆత్మ అజుడు(జననము లేని వాడు),నిత్యుడు (మరణము, నాశనములేని వాడు) జననమరణరహితుడు.

రామగీతలో ఇలా చెప్పబడినది...

కదాచిదాత్మా నమృతో నజాయతే నక్షియతే నాపి వివర్ధతేఽనవ ।
నిరస్త సర్వాతి శయః సుఖాత్మకః స్వయంప్రభః సర్వగతో ఽ యమద్వయః ॥

ఆ పరమాత్మ యెప్పుడైనను చావడు, పుట్టడు, క్షీణింపడు, పెరుగడు, సనాతనుడు, సర్వవ్యాపి, స్వయంప్రకాశము గలవాడు, సుఖస్వరూపుడు. ఇంతకంటే వేఱైనదిలేదు. అతిశయమైనదిలేదు.

వేదావినాశినం నిత్యం య ఏనమజమవ్యయమ్ ।
అథం స పురుషః పార్థ కం ఘాతయతి హంతి కమ్ ॥౨౧॥

హే పార్థ! = ఓ అర్జునా!, **యః** = ఎవడు, **ఏనం** = ఈ ఆత్మను, **అజం** = జన్మలేనిదానినిగను, **నిత్యం** = నిత్యమైనదానినిగను, **అవ్యయం** = క్షయము లేనిదానినిగను, **అవినాశనం** = వినాశనము లేనిదానినిగను, **వేద** = తెలిసికొనుచున్నాడో, **సః పురుషః** = అట్టి పురుషుడు, **కథం** = ఎట్లు, **కం** = ఎవనిని, **ఘాతయతి** = చంపించుచున్నాడు!, **కం** = ఎవనిని, **హంతి** = చంపుచున్నాడు!

తాత్పర్యము– ఓ అర్జునా! ఎవడు ఈ ఆత్మను జన్మలేనిదానినిగను, నిత్యమైనదానినిగను, క్షయము లేనిదానినిగను, వినాశనము లేనిదానినిగను తెలిసికొనుచున్నాడో అట్టి పురుషుడు ఎట్లు ఎవనిని చంపించుచున్నాడు! ఎవనిని చంపుచున్నాడు!

వివరణ – మనోబుద్ధీంద్రియములకు విలక్షణమై, గుణ కర్మాదులకు అతీతమై **న జాయతే, నమ్రియతే,**

నశుష్యతి, నక్లిద్యతే, నదహ్యతే, నకంపతే, నబిద్యతే, నచ్ఛిద్యతే, నిర్గుణః సాక్షిభూతః శుద్ధో నిరవయ వాత్మా కేవలః సూక్ష్మో నిర్మమో నిరంజనో నిర్వికారః– అవయవ శూన్యమైన ఆ పరమాత్మ సాత్వికాదిగుణములులేనివాడు, సర్వమునకు సాక్షియైనవాడు, పరిశుద్ధుడు కేవలము సూక్ష్మరూపుడు. నాది యన్న మాటలేనివాడు, అందువల్లనే అనురాగశూన్యుడు. షడ్భావ వికారములులేనివాడు. కావున ఆ పరమాత్మ పుట్టడు, చావడు, ఎండింపబడడు, తడుపబడడు, దహింపబడడు, చలింపడు, పగులగొట్టబడడు, చీల్పబడడు.(ఆత్మప్రభోదోపనిషత్తు)

వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ ॥౨౨॥

నరః = మనుష్యుడు, **యథా** = ఏ ప్రకారము, **జీర్ణాని** = చినిగిపోయిన, **వాసాంసి** = వస్త్రములను, **విహాయ** = విడిచి, **నవాని** = నూతనములైన, **అపరాణి** = ఇతర వస్త్రములను, **గృహ్ణాతి** = గ్రహించుచున్నాడో, **తథా** = ఆ ప్రకారము, **దేహీ** = ఆత్మ, **జీర్ణాని** = శిథిలములైన, **శరీరాణి** = దేహములను, **విహాయ** = విడిచి, **నవాని** = నూతనములైన, **అన్యాని** = ఇతర దేహములను, **సంయాతి** = పొందుచున్నాడు.

తాత్పర్యము– మనుష్యుడు ఏ ప్రకారము చినిగిపోయిన వస్త్రములను విడిచి నూతనములైన ఇతర వస్త్రములను గ్రహించుచున్నాడో ఆ ప్రకారము ఆత్మ శిథిలములైన దేహములను విడిచి నూతనములైన ఇతర దేహములను పొందుచున్నాడు.

వివరణ – జీర్ణమైన వస్త్రములు అనగా చినిగిపోయిన, మలినమైన, ధరించయోగ్యముకాని వస్త్రములు. మనుష్యుడు జీర్ణమైన వస్త్రములను వదలివేసి, వేరైన నూతన వస్త్రములనెట్లు గ్రహించుచున్నాడో అట్లే దేహియగువాడు రోగములచేతను, వార్ధక్యముచేతను, చింతాపరంపరలచేతను శిధిలీ భూతములైన శరీరములను వదలివేసి నూతనములైన వేరు శరీరములను బొందుచున్నాడు.

యథాత్యజతివై జీర్ణం వాసో గృహ్ణాతి నూతనమ్ తథా జీర్ణం పరిత్యజ్య దేహీ దేహంపునర్నవమ్ ।
భజత్యేవ సదాతత్ర శోకస్యావసరః కుతః ఆత్మా నమ్రియతే జాతుజాయతేన చవర్ధతే॥

పురుషుడు పాతవస్త్రములను విడిచిపెట్టి నూతన వస్త్రమునెట్లు గ్రహించుచున్నాడో అట్లే ప్రాతశరీరములను వదలివేసి మఱియొక క్రొత్తశరీరమును ధరించుచున్నాడు. ఆత్మ యెన్నడును చావడు, పుట్టడు, పెరుగడు. కావున దీనియందు శోకింపవలసిన అవసరమేమున్నది. కనుక ఉత్పత్తి నాశనములు శరీరములకే కాని, ఆత్మకు లేవనియు తెలియుచున్నది.

నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః ।
న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః ॥౨౩॥

ఏనం = ఈ ఆత్మను, **శస్త్రాణి** = ఆయుధములు, **న ఛిందంతి** = ఛేదింపజాలవు. **ఏనం** = ఈ ఆత్మను, **పావకః** = అగ్ని, **న దహతి** = దహింపజాలదు. **ఆపః చ** = ఉదకమున్ను, **ఏనం** = ఈఆత్మను, **న క్లేదయంతి** = తడుపజాలదు, **మారుతః** = వాయువు, **ఏనం** = ఈ ఆత్మను, **న శోషయతి** = ఎండింపజేయజాలదు.

తాత్పర్యము– ఈ ఆత్మను ఆయుధములు ఛేదింపజాలవు. ఈ ఆత్మను అగ్ని దహింపజాలదు. ఉదకమున్ను ఈ ఆత్మను తడుపజాలదు. వాయువు ఈ ఆత్మను ఎండింపజేయజాలదు.

వివరణ –

అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమక్లేద్యోఽశోష్య ఏవ చ ।
నిత్యః సర్వగతః స్థాణురచలోఽయం సనాతనః ॥౨౪॥

అయం = ఈ ఆత్మ, **అచ్ఛేద్యః** = ఛేదింపదగినదికాదు, **అయం** = ఈ ఆత్మ, **అదాహ్యః** = దహిందగినదికాదు, **అక్లేద్యః** = తడుపదగినదికాదు, **అశోష్యః ఏవ చ** = ఎండింపదగినదియుకాదు, **అయం** = ఈ ఆత్మ, **నిత్యః** = త్రికాలములయందు ఏకరీతిగా నుండునది, **సర్వగతః** = సర్వవ్యాపకమైనది, **స్థాణుః** = నిశ్చలమైనది, **అచలః** = చలింపనిది, **సనాతనః** = సనాతనమైనదియునై యున్నది.

తాత్పర్యము– ఈ ఆత్మ ఛేదింపదగినదికాదు. ఈ ఆత్మ దహిందగినదికాదు, తడుపదగినదికాదు, ఎండింపదగినదియుకాదు. ఈ ఆత్మ త్రికాలములయందు ఏకరీతిగా నుండునది, సర్వవ్యాపకమైనది, నిశ్చలమైనది, చలింపనిది, సనాతనమైనదియునై యున్నది.

వివరణ – ఆ పరమాత్మ తత్త్వము భావ వికారములు లేక ఒకటే రీతిగ నుండునది. కనుక నిత్యమైనది. సర్వవస్తువులయందు వ్యాపించియుండునది. శాశ్వతమైన ప్రతిష్ఠ కలిగినది. చాంచల్యము లేనిది. ఆద్యంతములు లేకపోవుటచేసనాతనమైనది. అందువల్లనే ఛేదింపరానిది. దహింపరానిది. తడుపరానిది. ఎండింపరానిది. ఇట్టి పరమాత్మ ఏ విధముగనైననూ నశించునది కాదు. ఆత్మ నిత్యము, సర్వగతము, సనాతనము.

అవ్యక్తోఽయమచింత్యోఽయమవికార్యోఽయముచ్యతే ।
తస్మాదేవం విదిత్వైనం నాను శోచితుమర్హసి ॥౨౫॥

అయం = ఈ ఆత్మ, **అవ్యక్తః** = అవ్యక్తము (ఇంద్రియములకు గోచరము గానిది), **అయం** = ఈ ఆత్మ, **అచింత్యః** = అచింత్యము (చింతింప వీలు కానిది). **అయం** = ఈ ఆత్మ, **అవికార్యః** = ఎట్టి వికారమున్ను బొందనిదనియు, **ఉచ్యతే** = చెప్పబడుచున్నది. **తస్మాత్** = అందువలన, **ఏవం** = ఈ చెప్పబడిన ప్రకారముగా, **ఏనం** = ఈ ఆత్మను, **విదిత్వా** = ఎఱిగి(తెలిసికొని), **అనుశోచితుం** = దుఃఖించుటకు, **న అర్హసి** = తగవు (అర్హుడవుకావు)

తాత్పర్యము– ఈ ఆత్మ అవ్యక్తము (ఇంద్రియములకు గోచరము గానిది), ఈ ఆత్మ అచింత్యము (చింతింప వీలు కానిది), ఈ ఆత్మ ఎట్టి వికారమున్ను బొందనిదనియు చెప్పబడుచున్నది. అందువలన ఈ చెప్పబడిన ప్రకారముగా ఈ ఆత్మను ఎఱిగి (తెలిసికొని) దుఃఖించుటకు తగవు (అర్హుడవుకావు).

వివరణ – ఆ పరమాత్మ తత్త్వము రూపనామములు లేనిది కనుక అది ఇట్టిదట్టిదని వర్ణింపరానిది. నిరాకారము, నిర్గుణము అగుటచే బుద్ధిచే ఊహింపరానిది. కరచరణాద్యవయవములు లేనిదగుటచే క్రియారహితమైనది

నసందృశే తిష్ఠతిరూపమస్య, న చక్షుషా పశ్యతి కశ్చిదేనమ్ ।
మనీషయా మనసావైహృదాచ, యఏనం విదురమృతాస్తేభవంతి ॥

ఆ పరమాత్మ స్వరూపము సాదృశ్యము నందు నిలుచునదికాదు. దాని నెవడైనను కంటిచేతను, బుద్ధిచేతను, మనస్సుచేతను. హృదయభావముచేతను చూడజాలరు. అట్టి పరమాత్మ నెవరు తెలిసికొందురో వారు మరణము లేనివారగుదురు. కనుక ఈ ఆత్మ ఇంద్రియములన్నిటికిని అందనిది కావున అవ్యక్తము. ఏది ఇంద్రియములకు అందునో అదియే చింతింపదగినది. కాని ఈ ఆత్మ ఇంద్రియముల కందనిదగుటవలన చింతింపవీలులేనిది. అవయవశూన్యమగుటచేత అవికారియగును. కనుక ఆత్మ వికారరహితమైనది. కవున ఓ అర్జునా! ఆత్మను ఈ ప్రకారముగా తెలుసుకొని దుఃఖింపకుము.

అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్ ।
తథాపి త్వం మహాబాహో నైవం శోచితుమర్హసి॥౨౬॥

హే మహాబాహో! = ఓ అర్జునా!, **అథ చ** = ఒకవేళ, **ఏనం** = ఈ ఆత్మను, **నిత్యజాతం** = సదా జననము గలదానినిగా గాని, **నిత్యం మృతం** = సదా మరణముగలదానినిగా గాని, **మన్యసే** = తలంతువేమో, **తథా అపి** = అట్లైనను, **త్వం** = నీవు, **ఏనం** = ఈ ప్రకారముగా, **శోచితుం** = దుఃఖించుటకు, **న అర్హసి** = తగవు (అర్హుడవుకావు).

తాత్పర్యము– ఓ అర్జునా! ఈ ఆత్మను సదా జననము గలదానినిగా గాని, సదా మరణముగలదానినిగా గాని తలంతువేమో అట్లైనను నీవు ఈ ప్రకారముగా దుఃఖించుటకు తగవు (అర్హుడవుకావు).

వివరణ –

జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ ।
తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి॥౨౭॥

జాతస్య = జననము నొందినవానికి, **మృత్యుః** = మరణము, **ధృవః** = నిశ్చయము, **మృతస్య** = మరణము నొందినవానికి, **జన్మ చ** = జననము పొందుటయు, **ధృవం హి** = నిశ్చయమేగదా!, **తస్మాత్** = కాబట్టి, **అపరిహార్యే** = నివారింపదగని, **అర్థే** = విషయమునందు, **త్వం** = నీవు, **శోచితుం** = దుఃఖించుటకొఱకు, **న అర్హసి** = తగవు.

తాత్పర్యము – జననము నొందినవానికి మరణము నిశ్చయము. మరణము నొందినవానికి జననము పొందుటయు నిశ్చయమేగదా! కాబట్టి నివారింపదగని విషయమునందు నీవు దుఃఖించుటకొఱకు తగవు.

వివరణ – జన్మించు స్వభావముగల వస్తువునకు మరణము నిశ్చితమైయుండును. మరణించు స్వభావముగల వస్తువునకు మరల జన్మము పొందుటయు నిశ్చయమైయుండును. ఏ వస్తువుకైనను జనన మరణములలో ఒకటి మాత్రమే ఒకటి మాత్రమే ఉండుట వీలుపడదు. లేని దానికి ఈ రెండు ఉండవు. ఉన్నదానికి ఈ రెండు ఉండును. ఇట్లు తప్పనిసరిగా జననమరణములు రెండును నియతమై యుండు వస్తువు కొఱకైనను నీవు శోకింపరాదు.

బంధత్వమపి చే న్మోక్షో బంధాభావే క్వమోక్షతా।
మరణం యదిచేజ్జన్మ జన్మాభావే మృతిర్నచ ॥

బంధముండినయెడల మోక్షమున్నది. బంధము లేకపోయినప్పుడు మోక్షమెక్కడిది? జన్మముండినయెడల మరణమున్నది. జన్మము లేకపోయినప్పుడు మరణము లేదు.(తేజోబిందూపనిషత్ ౫–౨౪)

జన్మవాా యది లోకేఽస్మిం స్తర్హి తం మృత్యురన్వగాత్ ।
తస్మాదపరి హార్యోఽయం మృత్యుర్జన్మవతాం సదా॥

ఈ లోకములో జన్మముగలవాడు కాగానే వానిని మృత్యువు వెంబడించుచున్నది. అందువలన ఎల్లప్పుడును జన్మగలవారికి మరణము అనివార్యమైయున్నది. (అధ్యా– అయో– 7 స. 99 శ్లో)

జాయతే మృత్యవే లోకో మ్రియతే జననాయచ।
అస్థిరా స్సర్వ ఏవేమే సచరాచర చేష్టితా ॥

ఇంద్రియగోచరమైన వస్తుసముదాయమంతయు (జన్మించుచున్నది, మరణించుచున్నది) చచ్చుటకే పుట్టుచున్నది. మరల పుట్టుటకే చచ్చుచున్నది. జంగమస్థావర సహితమైన లోకముయొక్క ఈ చేష్టితములు (జననమరణాదులు) అన్నియును అస్థిరములే. (మహోపనిషత్తు 3 అధ్యా 4 శ్లో)

మరణం జన్మని ప్రోక్తం జన్మవై మరణాశ్రితమ్।
అవిద్వాా మోక్ష ధర్మేషు బద్ధో భవతి చక్రవత్ ॥

జన్మమునందు మరణమున్నది. మరణము నాశ్రయించి జన్మమున్నది. మోక్షధర్మములయందు జ్ఞానయుక్తుడు కానివాడు చక్రమువలె బద్ధుడైయున్నాడని చెప్పబడినది. (పరాశరగీత 9 అ. 19 శ్లో)

అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ।
అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా॥౨౮॥

హే భారత! = ఓ అర్జునా!, **భూతాని** = భూతములు(ప్రాణులు), **అవ్యక్తాదీని** = అవ్యక్తమును (కనబడకుండుటను) ఆదిగను, **వ్యక్తమధ్యాని** = వ్యక్తమవ్వుటను(కనబడుటను) మధ్యభాగము గను, **అవ్యక్తనిధనాని ఏవ** = అవ్యక్తమునే (కనబడకుండుటనే) ముగింపుగనుగలవి , **తత్ర** = అట్టి శరీరవిషయమై, **పరిదేవనా** = దుఃఖము, **కా** = ఏల?

తాత్పర్యము– భూతములు (ప్రాణులు) ఆదియందు (ఉత్పత్తికి మునుపు) అవ్యక్తముగా (కనబడకుండా) ఉండి, మధ్యన (ఉత్పత్తి మరణములమధ్య) కొంతకాలము కనబడి అంతమున(మరణము తరువాత) మరల కనబడకనే పోవుచున్నవి. ఓ అర్జునా! ఈ విషయమై దుఃఖించుట ఏల?

వివరణ – భూతములనగా– ''భూ సత్తాయామ్'' అను సూత్రమువలన కలుగునది(ఉద్భవించునది)

భూతము. సర్వ భూతములును ఉత్పత్తికిముందు తెలియుటలేదు. ఉత్పత్తి అయినది మొదలు మరణములోపల తెలియుచున్నవి. మరల మరణానంతరము తెలియుటలేదు. దీనికి దుఖించుట ఎందులకు?

అదర్శనాదాపతితః పునశ్చాదర్శనంగతః ।
నాసౌ తవ న తస్య త్వం వృధా కా పరిదేవనా॥

కనబడనిదానినుండి వచ్చినవారు మరల కనబడనితనమునే పొందుచున్నారు. అనగా అవ్యక్తము నుండి వ్యక్తమైనవారు అవ్యక్తమునే పొందుచున్నారు. నీకు వారు లేరు. వారికి నీవు లేవు. వారు నిన్ను చేరినవారు కారు. నీవు వారిని జేరినవాడవుగావు. వ్యర్థముగనేల ప్రలపించుట? (భారతము స్త్రీ. 2-13)

అభావాదీని భూతాని భావమధ్యాని భారత ।
నైతే తవ నతేషాం త్వం తత్ర కా పరిదేవనా ॥

ఓ భారత! ఆదిలోలేక, అంతములో లేక, నడుమ కొంతకాలము మాత్రమే ఉండు భూతములకొఱకై యేల శోకింపవలయును. (భారతము స్త్రీ. 2-6)

తేషాంస్నేహో న కర్తవ్యో విప్రయోగో ధ్రువోహితైః ।
అదర్శనా దా పతితః పునశ్చాదర్శనం గతః ॥

(లౌకికులైన) వారి స్నేహము చేయదగినదికాదు. వారి స్నేహము మఱెప్పుడైనను ఎడబాటగుట నిజము. అట్టి వాడు కనబడని దశనుండి వచ్చుచున్నాడు, మరల కనబడని స్థితినే పొందుచున్నాడు. (పింగళగీత 17 శ్లో)

ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమాశ్చర్యవద్వదతి తథైవ చాన్యః ।
ఆశ్చర్యవచ్చైనమన్యః శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥౨౯॥

కశ్చిత్ = ఒకానొకడు, **ఏనం** = ఈ ఆత్మను, **ఆశ్చర్యవత్** = ఆశ్చర్యమైన (అద్భుతమైన) దానినిగా, **పశ్యతి** = చూచుచున్నాడు, **అన్యః** = మఱియొకడు, **తథా ఏవ** = అలాగుననే, **ఆశ్చర్యవత్** = ఆశ్చర్యమైన (అద్భుతమైన) దానినిగా, **వదతి చ** = చెప్పుచున్నాడు, **అన్యః** = ఇంకొకడు, **ఏనం** = ఈ ఆత్మను, **ఆశ్చర్యవత్** = ఆశ్చర్యమైన (అద్భుతమైన) దానినిగానే, **శృణోతి** = వినుచున్నాడు. **శ్రుత్వా చ** = (ఇట్లు)వినియును, **కశ్చిత్ అపి** = ఎవడును, **ఏనం** = ఈ ఆత్మతత్త్వముయొక్క యాథార్థ్యమును, **న వేద ఏవ** = యెఱుగనే యెఱుగడు.

తాత్పర్యము- ఒకానొకడు ఈ ఆత్మను ఆశ్చర్యమైన (అద్భుతమైన) దానినిగా చూచుచున్నాడు. మఱియొకడు అలాగుననే ఆశ్చర్యమైన (అద్భుతమైన) దానినిగా చెప్పుచున్నాడు. ఇంకొకడు ఈ ఆత్మను ఆశ్చర్యమైన (అద్భుతమైన) దానినిగానే వినుచున్నాడు. ఇట్లు వినియును ఎవడును ఈ ఆత్మతత్త్వముయొక్క యాథార్థ్యమును యెఱుగనే యెఱుగడు.

వివరణ - ఈ ఆత్మదేవుడు "అవ్యక్తుడుగను, అప్రమేయుడుగను" ఉండుటవలన అతనినెఱుంగ వీలుకానందులకు కారణముగనున్న మోహము సకలజనులకున్ను సమానమే. అనేక జన్మలలో చేసిన పుణ్యవశమున గాని ఆత్మవిచారము చేయ ప్రవృత్తిగలుగనేరదు. అట్టి ప్రవృత్తి గలుగుట వేల సంఖ్యాకులలో ఒకనికే. అట్లు ప్రవర్తించు వారిలో ఎవ్వడో ఒక్కడే ఈ ఆత్మను అద్భుతముగ చూచుచున్నాడు, లేక చెప్పుచున్నాడు, లేక వినుచున్నాడు. అట్లు ఈ ఆత్మను చూచువాడున్ను, చెప్పునట్టివాడున్ను, వినువాడున్ను లోకమునందు

ఆశ్చర్యమువలె నగుదురు. అట్టి వాడు అనేక వేలలో నొకడేఉండును. కావున ఆత్మనెఱుంగుట మిక్కిలి అరుదైనది. కఠోపనిషత్తు 2 వ వల్లి 7 వ మంత్రము ఇలాచెప్పబడినది.

శ్రవణాయాపి బహుభిర్యో నలభ్యః శృణ్వన్తోఽపిబహవోయం న విద్యుః।
ఆశ్చర్యోవక్తా కుశలోఽ స్యలబ్ధా ఆశ్చర్యోజ్ఞాతా కుశలానుశిష్టః॥

ఆ యాత్మస్వరూపమును అనేకులు వినుటకు లభించని వారలైయున్నారు. అనేకులు వినినను తెలిసికొను సామర్థ్యములేనివారలుగనున్నారు. ఈ ఆత్మనుపదేశించువాడును ఆశ్చర్యపడుచున్నాడు. ఉపదేశము పొందినవాడును ఆశ్చర్యపడుచున్నాడు. ఆత్మనెఱుంగువాడును ఆశ్చర్యపడుచున్నాడు.

దేహీ నిత్యమవధ్యోఽయం దేహే సర్వస్య భారత ।
తస్మాత్సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి ॥30॥

హే భారత! = భరతవంశీయుడవగు ఓ అర్జునా!, **సర్వస్య** = పిపీలికాదిబ్రహ్మ పర్యంతముగల సమస్త భూత(జీవ) సమూహముయొక్క, **దేహే** = దేహమునందలి, **అయం దేహీ** = ఈ ఆత్మ, **నిత్యం** = నిత్యమైనది , **అవధ్యః** = (ఎల్లప్పుడును) వధింపబడునది కాదు. **తస్మాత్** = ఆ కారణమువలన, **త్వం** = నీవు, **సర్వాణి** = సమస్తములైన, **భూతాని** = భూతముల (జీవుల) గురించి, **శోచితుం** = దుఃఖించుటకు, **న అర్హసి** = తగవు.

తాత్పర్యము– భరతవంశీయుడవగు ఓ అర్జునా! పిపీలికాదిబ్రహ్మ పర్యంతముగల సమస్త భూత(జీవ) సమూహముయొక్క దేహమునందలి ఈ ఆత్మ నిత్యమైనది. (ఎల్లప్పుడును) వధింపబడునది కాదు. ఆ కారణమువలన నీవు సమస్తములైన భూతముల (జీవుల) గురించి దుఃఖించుటకు తగవు.

వివరణ – సమస్త దేహములలో నుండెడి ఆత్మలుకూడా నశించనివే. దేహములన్నియును వధింపబడినను, వాటిలో ఉండెడి ఆత్మలు వధింపబడవు. బ్రహ్మమొదలుకొని స్థావరపర్యంతమైన దేహములలో నుండెడి ఆత్మ ఒకటియే. ఈ ఆత్మ నిత్యము, అవ్యక్తము, అచింత్యము, నిర్వికారము, అవికారము, సనాతనము, అచ్ఛేద్యము, అదాహ్యము, అక్లేద్యము, అశోష్యము. నీవు యుద్ధము చేసినను చేయకపోయినను ఈ దేహములు నశించెడివే, కాని ఈ దేహములందు ఏకమై వ్యాపించిన దేహి(ఆత్మ) నశించదు. కనుక ఈ ఆత్మ అవినాశి.

యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ ।
యథా పృథివ్యా యోషధయ స్సంభవంతి॥
యథాసతః పురుషాత్కేశలోమాని ।
తథాఽక్షరాత్సంభవతీహ విశ్వం॥

సాలీడుపురుగు తంతువు నెట్లు సృజించి యుపసంహరించు చున్నదో, భూమియందు ఏకవార్షికములైన సస్యములెట్లు సంభవించుచున్నదో, సత్పురుషుని శిరమునుండి, దేహము నుండి వెంట్రుకలెట్లు పుట్టుచున్నవో అట్లే అస్ఖలిత పరబ్రహ్మతత్త్వమునుండి ఈ విశ్వము సంభవించుచున్నది.

స్వధర్మమపి చావేక్ష్య న వికంపితుమర్హసి ।
ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽ న్యత్క్షత్రియస్య న విద్యతే ॥31॥

స్వధర్మం = స్వధర్మమును (స్వకీయమగు క్షత్రియ ధర్మమును), **అవేక్ష్య అపి** = ఆలోచించియైనను, **వికంపితుం** = చలించుటకు, **న అర్హసి** = తగవు. **హి**= ఏలయనగా, **క్షత్రియస్య** = క్షత్రియునకు, **ధర్మ్యాత్** = ధర్మయుక్తమైన, **యుద్ధాత్** = యుద్ధముకంటె, **శ్రేయః** = శ్రేయస్కరమైనది, **అన్యత్** = మఱియొకటి, **న విద్యతే** = లేదు.

తాత్పర్యము– స్వధర్మమును (స్వకీయమగు క్షత్రియ ధర్మమును) ఆలోచించియైనను చలించుటకు తగవు. ఏలయనగా క్షత్రియునకు ధర్మయుక్తమైన యుద్ధముకంటె శ్రేయస్కరమైనది మఱియొకటి లేదు

. **వివరణ** – యుద్ధమునకు కారణము అవినీతియో, రాజ్యలోభమో కారాదు. విషయలోలుపత కారణముగ యుద్ధమునకు దిగరాదు. రాజ్యలోభముచేతనో, ధనలోభము చేతనో, అన్యాయముగ ఆక్రమణ చేసికొనుటకై యుద్ధము ప్రకటించరాదు. అది అధర్మ యుద్ధము. కాని స్వధర్మయుక్తమైన ధర్మయుద్ధము క్షత్రియునకు ముక్తిప్రదము. ధర్మరక్షణకై నిష్కామ్యముగా యుద్ధముచేసి మరణించినయెడల ముక్తి లభించును. కనుక క్షత్రియునకు ధర్మయుక్తమైన యుద్ధముకంటె శ్రేయస్కరమైనది మఱియొకటి లేదు. నిశ్చలమైన మనస్సుతో నీ స్వధర్మము నందు నిలకడనొందుము. విషయేంద్రియములచే కదలింపబడకుండుట స్వధర్మము. అశుభకారణములైన స్వల్పసుఖములకై స్వయం ప్రకాశ సంకల్పితమైన జ్ఞానశక్తిని చెడగొట్టుకొనకుండుట స్వధర్మము. కామలోభాదులైన అంతశ్శత్రువులచే బాధింపబడక ఆత్మయందు స్థితుడైయుండుట స్వధర్మము. ఆధి వ్యాధులయందును, జననమరణ వేదనలయందును ఉద్వేగమునొందక శాశ్వతానందపదమున సుస్థిరుడైయుండుట స్వధర్మము. స్వధర్మమనగా తనధర్మము. తాననగా దేహేంద్రియములకు విలక్షణమైన పరిశుద్ధాత్మ. ఇట్టి పరిశుద్ధాత్మ తత్త్వముచే ధరింపబడినది స్వధర్మము. ఇలా స్వధర్మము నందు నిలకడనొంది ధర్మరక్షణకై నిష్కామ్యముగా యుద్ధముచేయుము. ఇట్టి యుద్ధము పరమ శ్రేయస్కరమైనది.

సర్వే క్షయాంతా నిచయాః పతనాంతాస్సముచ్చయా।
సంయోగా విప్రయోగాంతా మరణాంతం చ జీవితమ్॥

మనుష్య జీవితము మరణముతో ముగియుచున్నది. ఇట్టి అస్థిరశరీరములను అపాయములేకుండ కాపాడువాడొకడున్నాడనికాని, కాపాడుటకు సాధ్యమగుననికాని నమ్ముట మొదటిరకము వెఱ్ఱి (భ్రమ)యని చెప్పవచ్చును. అందువలన క్షత్రియుడనగా విషయచింతనము వల్లను, కామక్రోధాదులవల్లను ఆత్మకు క్షతము కలుగకుండ కాపాడువాడని ఆధ్యాత్మికులమతము. కామక్రోధాది శత్రువర్గములవలన ఆత్మకు గాయము కలుగుచున్నదనియు , అట్టి గాయమునుండి ఆత్మ ను రక్షించుటయే క్షత్రియధర్మమని యు తెలియుచున్నది. యుద్ధమనగా శత్రువును లెస్సగ ప్రహరించుట. ఆత్మ రక్షణమునకై కామక్రోధాది శత్రువర్గమును ప్రహరించుటే స్వధర్మమునకు సంబంధించిన యుద్ధము క్షత్రియునకు (ఆత్మరక్షాపరునకు) ఇంతకంటే శ్రేయము (మోక్షము) వేఱొకటిలేదు.

యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమపావృతమ్ ।
సుఖినః క్షత్రియాః పార్థ లభంతే యుద్ధమీదృశమ్ ॥౩౨॥

హే పార్థ! = ఓ పార్థ!, **యదృచ్ఛయా** = అప్రయత్నముగా, **ఉపపన్నం** = లభించినదియు, **అపావృతం** = తెరవబడిన, **స్వర్గద్వారం చ** = స్వర్గద్వారరూపమైనదియునగు, **ఈదృశం** =

ఇట్టి, **యుద్ధం** = యుద్ధమును, **సుఖినః** = ధన్యాత్ములగు, **క్షత్రియాః** = క్షత్రియులు, **లభంతే** = పొందుచున్నారు.

తాత్పర్యము–ఓ పార్థ! యాదృచ్ఛికముగా (అప్రయత్నముగా) లభించినదియు, తెరవబడిన స్వర్గద్వారరూపమైనదియునగు ఇట్టి యుద్ధమును, ధన్యాత్ములగు క్షత్రియులు పొందుచున్నారు.

వివరణ – ఓ పార్థా! యుద్ధమునకు ముందు కుంతి దేవి నాతో ఇలా చెప్పెను.
ఏతద్ధనంజయో వాచ్యో–సత్యోద్యుక్తో వృకోదరః।
యదర్థం క్షత్రియో సూతే – తస్య కాలోయ మాగతః॥ (భార. ఉద్యో- ౧౩౭-౯)
అనగా క్షత్రియమాత ఏ పని కొఱకు పుత్రులను కనునో దానికి తగిన సమయము వచ్చినదని ఓ కృష్ణా! ధనంజయునితోను, భీమునితోను చెప్పుము అని. కనుక పార్థా! యాదృచ్ఛికముగా లభించిన ఈ ధర్మయుద్ధము ఎటువంటిదో తెలియునా? తెరిచిన స్వర్గద్వారము వంటిది. ఈ యుద్ధములో మరణించిన వారు సరాసరి మధ్యలో ఎట్టి ఆటంకములను లేకుండ స్వర్గమునకు పోవుదురు. పార్థా! మీరు సంధి ప్రయత్నములు చేసినారు, కాని సంధి కుదరనందు వలన మీరు కోరుకుండగనే అప్రయత్నముగ యుద్ధము సంభవించినది. మీరు గొప్ప అదృష్టవంతులు. కనుక యుద్ధమునకు సిద్ధపడు.

అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి ।
తతః స్వధర్మం కీర్తిం చ హిత్వా పాపమవాప్స్యసి ॥౩౩॥

అథ = పిమ్మట, **త్వం** = నీవు, **ధర్మ్యం** = స్వధర్మయుక్తమైన, **ఇమం సంగ్రామం** = ఈ సంగ్రామమును, **న కరిష్యసి చేత్** = చేయకపోతివేని, **తతః** = అందువలన, **స్వధర్మం** = స్వధర్మ (ఫల) మును , **కీర్తిం చ** = కీర్తినిన్ని, **హిత్వా** = పోగొట్టుకొని, **పాపం** = పాపమును, **అవాప్స్యసి** = పొందగలవు.

తాత్పర్యము– పిమ్మట నీవు స్వధర్మయుక్తమైన ఈ సంగ్రామమును చేయకపోతివేని, అందువలన స్వధర్మ (ఫల) మును, కీర్తినిన్ని పోగొట్టుకొని పాపమును పొందగలవు .

వివరణ – నీవు యుద్ధము చేయకపోయినయెడల , నీ కర్తవ్యరూపమైన స్వధర్మమును వదలిన పాపము వచ్చును. ఇదివరలో " అర్జునుడు మహాశూరుడు, వీరుడు, అతిరథుడు " అని సంపాదించిన కీర్తి యంతయును నశించిపోవును. అంతశ్శత్రువులైన కామలోభాదులను జయించిన పరిశుద్ధాత్ములకు బాహ్యశత్రువులుండరు, భౌతికమైన యుద్ధము తటస్థించదు. ఆధ్యాత్మిక యుద్ధరంగమున ప్రధాన అంతశ్శత్రువులైన కామక్రోధలోభాదులను జయించుటయే కీర్తికరమైన స్వధర్మము. కామాది శత్రువులను ప్రహరించుటకు అవకాశము పొందిన ఆత్మరక్షా విశారదులే క్షత్రియులు, సుఖవంతులు.

అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయామ్ ।
సంభావితస్య చాకీర్తిర్మరణాదతిరిచ్యతే ॥౩౪॥

అపి చ = మఱియును, **భూతాని** = ప్రాణులు, **తే** = నీయొక్క, **అవ్యయాం** = చిరకాలము వరకు మాయకుండనట్టి, **అకీర్తిం** = అపకీర్తిని (అపయశస్సును), **కథ యిష్యంతి** = చెప్పుకొందురు.

సంభావితస్య = గౌరవస్థునికి, **అకీర్తిః** = అపకీర్తి (అపయశస్సు), **మరణాత్ చ** = మరణముకంటెను, **అతిరిచ్యతే** = అధికమైనదగుచున్నది.

తాత్పర్యము– మఱియును ప్రాణులు నీయొక్క చిరకాలము వరకు మాయకుండనట్టి అపకీర్తిని (అపయశస్సును) చెప్పుకొందురు. గౌరవస్థునికి అపకీర్తి (అపయశస్సు) మరణముకంటెను అధికమైనదగుచున్నది.

వివరణ – అర్జునా! యుద్ధము చేయకపోవుట చేత, కీర్తి నశించుటయేగాక, స్వధర్మమును వదిలిన పాపము లభించును. అదియును గాక మానవులు, దేవతలు, ఋషులు, యక్షులు, రాక్షసులు అనేక ప్రకారములుగ నిన్ను నిందించెదరు. ఈ అపకీర్తి చిరస్థాయిగా నిలిచియుండును. యశోధనులైనవారికి ఈ అపకీర్తి మరణము కంటె అధికమగుచున్నది. నీవు ఏమాత్రము ఈ అపకీర్తిని సహించలేవు. కాబట్టి ఎట్లు విచారించినను యుద్ధముచేయుటయే నీకు కర్తవ్యము.

భయాద్రణాదుపరతం మంస్యంతే త్వాం మహారథాః ।
యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ ॥౩౫॥

ఏషాం = ఎవరికి, **త్వం** = నీవు, **బహుమతః** = సన్మానింపబడతగిన వాడవుగానుంటివో, అట్టి **మహారథాః చ** = మహారథులుగూడ, **త్వాం** = నిన్ను, **భయాత్** = భయమువలన, **రణాత్** = యుద్ధమునుండి, **ఉపరతం** = మఱలినవానినిగా, **మన్యంతే** = తలంతురు, **భూత్వా** = అట్లు తలంపబడినవాడవై, **లాఘవం** = చులకదనమును (అగౌరవమును), **యాస్యసి** = పొందగలవు.

తాత్పర్యము– ఎవరికి నీవు సన్మానింపబడతగిన వాడవుగానుంటివో అట్టి మహారథులుగూడ నిన్ను భయమువలన యుద్ధమునుండి మఱలినవానినిగా తలంతురు. అట్లు తలంపబడినవాడవై చులకదనమును పొందగలవు.

వివరణ – అర్జునా! ఉభయసేనలలోని మహావీరులందరు నిన్ను ఇంతవరకు " అతిరథుడు, మహావీరుడు " అని తలంచి, నీ విషయమున గౌరవముగ నున్నారు. ఇప్పుడు నీవు యుద్ధము చేయకపోయినయెడల, నిన్ను అతి లాఘవముగ, చులకనగ చూచెదరు. ఎవరిదృష్టిలో నీవు ఇంతవరకును శూరుడవు, వీరుడవు అని గౌరవింపబడితివో ఆ మహారథులే ఇప్పుడు నిన్ను చులకనజేసి, భయముచేత యుద్ధమునుండి పారిపోతివని నిందలుపల్కుదురు. నీవు భరించలేవు. ప్రతిష్ఠ సంపాదించినవారికి అపకీర్తిని భరించుట మరణముకంటె దుఃఖకరముసుమా! కనుక నీవు యుద్ధము చేయుటయే కర్తవ్యము.

అవాచ్యవాదాంశ్చ బహూన్వదిష్యంతి తవాహితాః ।
నిందంతస్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ ॥౩౬॥

తవ అహితాః = నీకు హితులుకానివారు (నీ శత్రువులు), **తవ సామర్థ్యం** = నీ సామర్థ్యమును, **నిందంతః** = నిందుంచుచున్నవారై, **బహూన్** = అనేకములైన, **అవాచ్యవాదాన్ చ** =

వచింపరాని దుర్భాషణములను కూడ, **వదిష్యంతి** = పలుకగలరు, **తతః** = అంతకంటె, **దుఃఖతరం** = మిక్కిలి దుఃఖకరమైనది, **కిం ను** = ఏమిగలదు!

తాత్పర్యము– నీకు హితులుకానివారు (నీ శత్రువులు) నీ సామర్థ్యమును నిందుంచుచున్నవారై, అనేకములైన వచింపరాని దుర్భాషణములను కూడ పలుకగలరు. అంతకంటె మిక్కిలి దుఃఖకరమైనది ఏమిగలదు!

వివరణ – ఆధ్యాత్మిక యుద్ధరంగమున హతుడనగా కామలోభాదిశత్రువులచే పీడింపబడినవాడని, మనసేంద్రియములచే సంఘాతము చేయబడినవాడని చెప్పవచ్చును. కామలోభాది అంతశ్శత్రువుల వలన కలిగిన మానసిక సంకల్పవికల్పములకు చలించి నీవు నీ స్వధర్మమునందు నిలకడనొందక యుద్ధముచేయని యెడల నీ శత్రువులు నీ సామర్థ్యమును నిందుంచుచున్నవారై, అనేకములైన వచింపరాని దుర్భాషణములను కూడ పలుకుదురు. నీలో ఉన్న కామాది శత్రువులతో యుద్ధముచేసి గెలుచిన యెడల బ్రహ్మానందమును పొందగలవు. నీయెదుట వ్యక్తులలోనున్న కామాది శత్రువులతో యుద్ధముచేసి గెలిచినయెడల భూరాజ్యసుఖమును పొందగలవు. కామాది శత్రువులను ప్రహరించుటకు అవకాశము పొందిన ఆత్మరక్షా విశారదులే క్షత్రియులు, సుఖవంతులు.

హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్ ।
తస్మాదుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః ॥౩౭॥

హే కౌంతేయ! = ఓ కుంతీపుత్రుడవగు ఓ అర్జునా!, **హతః వా** = హతుడవైనచో (చంపబడితివేని), **స్వర్గం** = స్వర్గమును, **ప్రాప్స్యసే** = పొందగలవు. **జిత్వా వా** = జయించితివేని, **మహీం** = మహిని (భూమి యందు రాజ్యసుఖమును), **భోక్ష్యసే** = అనుభవింపగలవు, **తస్మాత్** = కాబట్టి, **యుద్ధాయ** = యుద్ధముకొఱకు, **కృతనిశ్చయః** = కృతనిశ్చయుడవై, **ఉత్తిష్ఠ** = లెమ్ము.

తాత్పర్యము– ఓ కుంతీపుత్రుడవగు ఓ అర్జునా! హతుడవైనచో (చంపబడితివేని) స్వర్గమును పొందగలవు. జయించితివేని మహిని (భూమి యందు రాజ్యసుఖమును) అనుభవింపగలవు. కాబట్టి యుద్ధముకొఱకు కృతనిశ్చయుడవై లెమ్ము.

వివరణ – అర్జునా! యుద్ధము చేసినయెడల స్వధర్మమును నిర్వర్తించిన వాడవగుదువు. అంతయేకాదు, యుద్ధమునందు మరణించితివా స్వర్గమననుభవించెదవు. జయించితివా భూమండలాధిపత్యమును అనుభవించెదవు.

హతోఽపిలభతే స్వర్గం హత్వాచ లభతేయశః।
ఉభయంనో బహుగుణంనాస్తి నిష్ఫలతారణే॥ (భార. స్త్రీ ౨-౧౪)

యుద్ధములో హతుడైనప్పటికి స్వర్గమును పొందుచున్నాడు. శత్రువులను చంపినను యశస్సును (కీర్తిని) పొందుచున్నాడు. మనకీరెండును గొప్ప ప్రయోజనకరములే. నిష్ప్రయోజనమన్నమాటేలేదు.

నీలో ఉన్న కామాది శత్రువులతో యుద్ధముచేసి గెలుచిన యెడల బ్రహ్మానందమును పొందగలవు. నీయెదుట వ్యక్తులలోనున్న కామాది శత్రువులతో యుద్ధముచేసి గెలిచినయెడల భూరాజ్యసుఖమును పొందగలవు.

అంతశ్శత్రువులైన కామలోభాదులను జయించిన పరిశుద్ధాత్ములకు బాహ్యశత్రువులద్వారా భౌతికమైన యుద్ధము తటస్థించినను అపజయముండదు. ఆధ్యాత్మిక యుద్ధరంగమున ప్రధాన అంతశ్శత్రువులైన కామక్రోధలోభాదులను జయించుటయే కీర్తికరమైన స్వధర్మము. కనుక అంతశ్శత్రువులను జయించి, మనస్సును నిశ్చలమొనర్చి, మోహరహితుడవై యుద్ధముచేయుట కొఱకు కృతనిశ్చయుడవై లెమ్ము. నిష్కామమనస్కుడవై యుద్ధము చేసినయెడల రాజ్యసుఖమును మఱియు బ్రహ్మానందమును పొందగలవు.

జేతావా బ్రాహ్మమానందం జితోవా విషయాదికమ్।
ప్రాప్నోతి నియతం తస్మాత్కామాదీన్ ప్రహరేద్యతిః॥ (విశ్వగీత ౬౮)

కామాది శత్రువులతో పోరాడి జయించినచో బ్రహ్మానందమును పొందుచున్నాడు. ఓడుపోయినను విషయానందమును (భూరాజ్యసుఖమును) పొందుచున్నాడు. ఎట్లైనను ఆనందం తప్పినదికాదు. అందువలన బ్రహ్మానందముకొఱకు యతీశ్వరుడు కామాదులను కొట్టవలసినదే.

సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ ।
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి ॥౩౮॥

సుఖదుఃఖే = సుఖదుఃఖములను, **లాభాలాభౌ** = లాభనష్టములను, **జయాజయౌ** = జయాపజయములను, **సమేకృత్వా** = సమములుగా భావించి, **తతః** = అటుపిమ్మట, **యుద్ధాయ** = యుద్ధముకొఱకు, **యుజ్యస్వ** = ఆయత్తపడుము, **ఏవం** = ఇట్లు చేసితివేని, **పాపం** = పాపమును, **న అవాప్స్యసి** = పొందవు.

తాత్పర్యము– సుఖదుఃఖములను, లాభనష్టములను, జయాపజయములను సమములుగా భావించి అటుపిమ్మట యుద్ధముకొఱకు ఆయత్తపడుము. ఇట్లు చేసితివేని పాపమును పొందవు.

వివరణ – అర్జునా! స్వధర్మాచరణము వలన సుఖము కలిగినను, దుఃఖము కలిగినను, లాభము, నష్టము, జయము, అపజయము ఏది సంభవించినను సమముగా దోచునట్లు అంతఃకరణమును సంస్కరించుకొని తరువాత నీ స్వధర్మమును నిర్వహించుము. అట్లైన పాపము పొందవు. అర్జునా! నీకు స్వధర్మములలో ప్రధానమైనది ధర్మయుద్ధము, ఈ యుద్ధములో శస్త్రాస్త్రప్రహరణములచేత దుఃఖమే కలుగనీ, లాభమురానీ, నష్టమురానీ, జయమే కలుగనీ, లేక శత్రువులచేత జయింపబడి నీ సర్వస్వమూ నశించనీ– వీటియందు మనస్సును ఉంచకుము. వీటియందు మనస్సునుంచుట చేత రాగద్వేషములును, హర్షశోకములును కలుగును. ఇట్టివి కలుగనీయక నిష్కామమనస్కుడవై కేవలము స్వధర్మమును నిర్వహించుట నీ బాధ్యత, కర్తవ్యము అని తెలుసుకొని, ధర్మము కొఱకే యుద్ధము చేయుము. ఇట్లు యుద్ధముచేసినయెడల నీకు పాపము ఎంతమాత్రమును అంటదు.

సుఖస్యానంతరం దుఃఖం దుఃఖస్యానంతరం సుఖమ్।
ద్వయమే తద్ధి జంతూనామలంఘ్యం దినరాత్రివత్ ।
సుఖమధ్యేస్థితం దుఃఖం దుఃఖమధ్యేస్థితం సుఖం ।
ద్వయమన్యోఽన్య సంయుక్తం ప్రోచ్యతే జలపంకవత॥ (అధ్య అయో ౬ స. ౧౩,౧౪ శ్లో)

జీవులకు పగలు, రాత్రి ఒకదాని తర్వాత నొకటి తప్పనిసరిగా ఎట్లు వచ్చుచున్నవో అట్లే సుఖదుఃఖములు ఒకదాని

తరువాత మఱియొకటి వచ్చుచున్నవి. వీనిని తప్పించుటకు వీలులేదని తెలిసికొనుము. జలము బురద ఒకదానియందొకటి కలిసికొని యుండినట్లు సుఖదుఃఖములు కూడ పరస్పరము ఒకదానియందొకటి అన్యోన్యముగ కలిసియుండునని చెప్పబడినది.

సుఖదుఃఖే సమేకృత్వా లాభం హానిం జయంతథా।
పరాజయంచ శీతోష్ణం మానం చాప్యవమానకం॥ (వరాహపురాణము పూర్వా. ౩౮ అధ్యా)

సుఖదుఃఖములను, లాభాలాభములను, జయాజయములను, అదే ప్రకారము శీతోష్ణములను, మానావమానములను సమముగ భావింపవలెయును.

క్వచిత్పృధ్వీశయ్యః క్వచిదపిచ పర్యంక శయనః।
క్వచిచ్ఛాకాహారః క్వచిదపిచ శాల్యోదనరుచిః।
క్వచిత్కంథాధారీ క్వచిదపిచ దివ్యాంబరధరో।
మనస్వీకార్యార్థీ న గణయతి దుఃఖం న చ సుఖం॥ (శ్రీభర్తృహరి ౧-౨౩)

కార్యము సాధింపదలచిన ధీరాగ్రేసరుడు ఒకయెడ (కఠిన శిలాకంటక సమన్వితమైన) భూమిమీదశయనించుచున్నాడు. ఒకయెడ (అతిమృదులములైన హంసతూలికాది) తల్పముల మీదను శయనించుచున్నాడు. ఒకయెడ కందమూలాది వన్యపదార్థముల దినుచున్నాడు. ఇంకొకయెడ మంచి స్వాదుగలిగిన వరియన్నము మొదలైన పదార్థములగూడ భుజించుచున్నాడు. ఒకయెడ పాతప్రేలికలతో గూర్పబడిన బొంత ధరించుచున్నాడు. వేఱొకయెడ దివ్యములైన (బంగారపట్టు) వస్త్రములు సైతము ధరించుచున్నాడు. కాని భూశయ్యాదుల యందలి దుఃఖమును, మృదుపర్యంకాదుల యందలి సుఖమును గూడ లెక్కింపడు. ఇటువంటి యార్థవిద్యార్థి పాపమునుండి విడువబడును.

సుఖదుఃఖే మనుష్యాణాం చక్రవత్పరివర్తతః।
సుఖాత్త్వం దుఃఖమాపన్నః పునరాపత్యసే సుఖమ్॥ (పింగళ గీత ౨౦)

మనుష్యులకు సుఖదుఃఖములు రెండు చక్రమువలె ప్రవర్తించుచున్నవి. నీవు సుఖమునుండి దుఃఖము పొందుచున్నాడవు. మరల సుఖమును పొందుచున్నాడవు.

ననిత్యం లభతేదుఃఖం ననిత్యం లభతేసుఖం।
శరీరమేవాయతనం దుఃఖస్యచ సుఖస్యచ॥ (పింగళ గీత ౨౧)

యెల్లప్పుడు దుఃఖమునే పొందుటలేదు, ఎల్లప్పుడు సుఖమునే పొందుటయులేదు. దుఖమునకు, సుఖమునకు దేహమే నిలయము.

ఏషా తేఽభిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణు ।
బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబంధం ప్రహాస్యసి ॥౩౯॥

హే పార్థ! = ఓ అర్జునా!, **తే** = నీకు, **సాంఖ్యే** = సాంఖ్యయోగమునందు, **ఏషా బుద్ధిః** = ఈ జ్ఞానము, **అభిహితా** = చెప్పబడినది, **యయాబుద్ధ్యా** = ఏ బుద్ధితోడ, **యుక్తః** = కూడినవాడవై, **కర్మబంధం** = కర్మ(సంసార)బంధమును, **ప్రహాస్యసి** = విడవగలవో, అట్టి **యోగే** = యోగసంబంధమగు, **ఇమాం** = ఈ బుద్ధిని(జ్ఞానమును), **శృణు** = వినుము.

తాత్పర్యము– ఓ అర్జునా! నీకు సాంఖ్యయోగమునందు ఈ జ్ఞానము చెప్పబడినది. ఏ

బుద్ధితోడ కూడినవాడవై కర్మ(సంసార)బంధమును విడవగలవో అట్టి యోగసంబంధమగు ఈ బుద్ధిని(జ్ఞానమును) వినుము.

వివరణ – ఈ శ్లోకమునందు చెప్పబడిన సాంఖ్యబుద్ధి, యోగబుద్ధి అను ఈ రెండింటికి గల వ్యత్యాసమును స్పష్టముగ తెలిసికొనుట ఆవశ్యకము. “ **సమ్యక్ ఖ్యాయతే ఇతి సాంఖ్యా**”– బాగుగా పరమార్థతత్త్వమును ఏది ప్రతిపాదించుచున్నదో (స్పష్టపరచుచున్నదో) అది సాంఖ్యా అనగా ఉపనిషత్తు. ఆ ఉపనిషత్తులచేత ఏ పరమాత్మతత్త్వము నిరూపింపబడుచున్నదో అదియే సాంఖ్యమనబడును. ఈ ఆత్మతత్త్వము శ్రీకృష్ణునిచే మునుపటి శ్లోకములలో బోధింపబడినది. ఇట్టి సాంఖ్యబుద్ధి గలుగుటకు కారణమైన కర్మను అనుష్ఠించుటయే యోగమనబడును. అట్టి యోగవిషయమైన బుద్ధిని(జ్ఞానమును) చెప్పెదను వినుము.
కనుక ఓ అర్జునా! ఇంతవరకు ఆత్మవిచారణలో జేరిన జ్ఞానము నీకు బోధింపబడినది. ఆత్మతత్త్వవిషయమునందు ఈ బుద్ధి నీకు(ఇంతవరకు) చెప్పబడినది. ఎట్టి బుద్ధితో గూడినవాడవైనచో కర్మబంధమునుండి విడివడెదవో అట్టి ఆత్మజ్ఞానము పొందుటకు మార్గమైన (కర్మ) యోగవిషయమైన బుద్ధిని చెప్పెదను వినుము. ఇంక యొగమునందు ఓ బుద్ధితో గూడుకొని జన్మకారణమైన కర్మబంధమును వదలగలవో దానిని వినుము.

నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।
స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥౪౦॥

ఇహ = ఈ కర్మయోగానుష్ఠానమందు, **అభిక్రమనాశః** = ప్రారంభనాశము, **న అస్తి** = లేదు. **ప్రత్యవాయః** = దోషము, **న విద్యతే** = కలుగదు. **అస్యధర్మస్య** = ఈ నిష్కామకర్మయోగము, **స్వల్పం అపి** = స్వల్పమాత్రమైనను, **మహతః** = గొప్పదైన, **భయాత్** = భయమునుండి, **త్రాయతే** = రక్షించుచున్నది.

తాత్పర్యము– ఈ కర్మయోగానుష్ఠానమందు ప్రారంభనాశము లేదు. దోషము కలుగదు. ఈ నిష్కామకర్మయోగము స్వల్పమాత్రమైనను గొప్పదైన భయమునుండి రక్షించుచున్నది.

వివరణ – ఫలాపేక్షలేక, ఈశ్వరార్పణముగ జేయబడు ఈ (కర్మ) యోగమును ఆరంభించి ఏ కొంచెమాచరించినను అది వ్యర్థముకానేరదు. ఫలాభిలాషను వదలి ఈనిష్కామకర్మయోగమును జేయ ప్రారంభించి పూర్తియగుటకు ముందుగా మధ్యకాలమున విఘ్నములచే నిలిచిపోయినను దోషముగలుగనేరదు. ఇట్టి కర్మయోగానుష్ఠానము కొంచమైనను గూడ మిక్కిలి గొప్పదియగు జననమరణ ప్రవాహరూపమైన సంసార భయమునుండి రక్షింపగలదు. కనుక నిష్కామకర్మానుష్ఠానము ఏ కొంచమైనను వ్యర్థముకానేరదు.
స్వల్పాపిదీపకణికా బహుళంనాశయేత్తమః।
స్వల్పోఽపిబోధోనిబిడం బహులం నాశయేత్తమః॥ (ఆత్మప్రబోధోపనిషత్తు ౨౮ శ్లో.)
దీపజ్వాల చిన్నదయ్యును గొప్పచీకటిని పోగొట్టుచున్నది. అట్లే తత్త్వజ్ఞానము కొంతమాత్రము సాధించినను అది గాఢమైన గొప్ప అంధకారమును పోగొట్టుచున్నది.

వ్యవసాయాత్మికా బుద్ధిరేకేహ కురునందన ।
బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్ ॥౪౧॥

ఓ కురునన్దన! = ఓ కురునన్దనా!, **ఇహ** = ఈ అనుష్ఠానమందు, **వ్యవసాయాత్మికా** = నిశ్చయాత్మకమైన, **బుద్ధిః** = బుద్ధి(జ్ఞానము), **ఏకాః** = ఏకరీతిగా నుండును. **అవ్యవసాయినాం** = నిశ్చయరహితులయొక్క, **బుద్ధయః** = బుద్ధులు (మనోవ్యాపారములు), **బహుశాఖాః** = బహుశాఖలుగను (పరిపరివిధములుగ వ్యాపించినట్టివిగను), **అనంతాః చ** = అసంఖ్యాకములుగను, **హి** = అగుచున్నవిగదా!

తాత్పర్యము– ఓ కురునన్దనా! ఈ అనుష్ఠానమందు నిశ్చయాత్మకమైన బుద్ధి(జ్ఞానము) ఏకరీతిగా నుండును. నిశ్చయరహితులయొక్క బుద్ధులు(మనోవ్యాపారములు) బహుశాఖలుగను (పరిపరివిధములుగ వ్యాపించినట్టివిగను) అసంఖ్యాకములుగను అగుచున్నవిగదా!

వివరణ – అర్జునా! మంచినిశ్చయ జ్ఞానముతోగూడిన బుద్ధియోగము ఒకటేపద్ధతిలోనుండును. సర్వభూతములయందలి చైతన్యమంతయు ఒకటేకాని అన్యములేదను నిశ్చయజ్ఞానముగల యోగబుద్ధి యెప్పుడును ఏకభావమునే కలిగియుండును. ఈ యోగబుద్ధి వాసనలన్నియు నశించినట్టి నిశ్చయాత్మకమైనదిగా ఉండును. కనుక ఇటువంటి బుద్ధి వాసనారహితమైనది, వ్యవసాయాత్మికమైనది. నిశ్చయజ్ఞానములేనివారి బుద్ధులు అనేకములైన చీలికలుగలిగి యెంతదూరముపోయినను ఎడతెగనివైయుండును. ఈ అనిశ్చయబుద్ధి వాసనాత్మకమైనది, అవ్యవసాయాత్మికమైనది. అనేక వాసనలతో కూడుకొనినది. ఈ అనిశ్చయబుద్ధి బహుశాఖలుగా నుండును. ఏ ఒక్కదానిమీదను స్థిరముగ నిలువదు. అస్థిరమై, క్షణక్షణమునకును మారునట్టి ఆలోచనలు కలిగియుండును. ఇట్టి వారికి క్షణక్షణమునకును అభిప్రాయములు మారుచుండును. ఇట్లు ఈ సంకల్ప వికల్పములకు అంతుండదు. వివేకముండదు. శ్రీకృష్ణపరమాత్మ ఈ అవ్యవసాయాత్మికబుద్ధిగల మానవుల స్వభావమును, సిద్ధాంతమును, ఆచార వ్యవహారములు ఎలా ఉంటాయో తరువాతి శ్లోకములయందు చెప్పబోవుచున్నాడు.

యామిమాం పుష్పితాం వాచం ప్రవదంత్యవిపశ్చితః ।
వేదవాదరతాః పార్థ నాన్యదస్తీతి వాదినః ॥౪౨॥
కామాత్మానః స్వర్గపరా జన్మకర్మఫలప్రదామ్ ।
క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి ॥౪౩॥

హే పార్థ! = ఓ అర్జునా!, **వేదవాదరతాః** = వేదమునందలి అర్థవాదవాక్యములందు ప్రీతిగలవారు, **కామాత్మనః** = కోరికలతో నిండిన మనస్సుగలవారై , **భోగైశ్వర్యగతింప్రతి** = భోగైశ్వర్యములకు స్థానమైన , **స్వర్గపరాః** = స్వర్గమే పరమైనదని భావించి, **జన్మకర్మఫలప్రదాం** = జన్మపరంపరను మఱియు అనేక కర్మఫలములను ప్రసాదించునట్టి, **క్రియావిశేషబహుళాం** = బహుళమైన క్రియా విశేషములతోగూడిన, **ఇమాం** = ఇట్టి, **వాచం** = వాక్యమును, **పుష్పితాం** = వికసించిన మోదుగపూవువలె రమ్యముగ, , **ప్రవదంతి** = చెప్పుచున్నారు, **అన్యత్** = ఇంతకంటె వేఱుమార్గము, **న అస్తి** = లేదు. **ఇతి** = అని, **వాదినః** = వాదించు స్వభావము గలవారు, **అవిపశ్చితః** = అవివేకులు.

తాత్పర్యము– ఓ అర్జునా! వేదమునందలి అర్థవాదవాక్యములందు ప్రీతిగలవారు కోరికలతో నిండిన మనస్సుగలవారై భోగైశ్వర్యములకు స్థానమైన స్వర్గమే పరమైనదని భావించి జన్మపరంపరను మఱియు అనేక కర్మఫలములను ప్రసాదించునట్టి బహుళమైన క్రియా విశేషములతోగూడిన వాక్యమును వికసించిన మోదుగపూవువలె రమ్యముగ చెప్పుచున్నారు. ఇంతకంటె వేఱుమార్గము లేదు అని వాదించు స్వభావము గలవారు అవివేకులు.

వివరణ – అర్జునా! ఆత్మజ్ఞానశూన్యులు, వేదములందు వాదోపవాదములు చేయుటయందే ఆసక్తిగలిగి, వేదములయందు చెప్పబడిన ఫలశ్రుతి వాక్యములయందే ప్రీతిగలవారై, కోరికలతో నిండిన మనస్సుగలిగి భోగములందే తన్మయులై, భోగములు మఱియు ఐశ్వర్యములకు స్థానమైన స్వర్గమే పరమైనదిగా భావించి స్వర్గాదిసుఖములయందు ఆసక్తిగలవారై జన్మపరంపరను కలుగజేయునట్టియును మఱియు అనేక కర్మఫలములనిచ్చునట్టి బహుళమైన క్రియా కలాపములనే ప్రశంసించుచు, చింతించుచు వీటిని పొందుటకు మార్గమేదికలదో దానిని గుఱించి రమ్యమైన మాటలను పలుకుదురు. ఇంతకంటె వేఱుమార్గములేదని వాదించుచున్నారు. ఇలా వాదించువారు అవివేకులు.

భోగైశ్వర్యప్రసక్తానాం తయాపహృతచేతసామ్ ।
వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌ న విధీయతే ॥౪౪॥

తయా = అట్టి రమ్యమైన వాక్కుచే, **అపహృతచేతసాం** = అపహరింపబడిన చిత్తముగలిగి, **భోగైశ్వర్యప్రసక్తానాం** = భోగైశ్వర్యములయందాసక్తులైనవారికి, **సమాధౌ** = సమాధియందు, **వ్యవసాయాత్మికా బుద్ధిః** = వ్యవసాయాత్మికమైన (నిశ్చయాత్మికమైన) బుద్ధి, **న విధీయతే** = కలుగనేరదు (నిలువదు).

తాత్పర్యము– అట్టి రమ్యమైన వాక్కుచే అపహరింపబడిన చిత్తముగలిగి భోగైశ్వర్యములయందు ఆసక్తులైనవారికి సమాధియందు వ్యవసాయాత్మికమైన (నిశ్చయాత్మికమైన) బుద్ధి కలుగనేరదు (నిలువదు).

వివరణ – చలింపజేసే ఇటువంటి రమ్యమైన మాటలవలన భోగైశ్వర్యములయందు ఆసక్తిగలిగి అంతఃకరణమున ఈశ్వరధ్యాన విషయమునందు నిశ్చయస్వరూపమైన శ్రద్ధా విశ్వాసాలు కలుగవు.

పఠన్తుశాస్త్రాణి యజన్తు దేవాన్ కుర్వన్తు కర్మాణి భజన్తు దేవతాః।
ఆత్మైక్యబోధేన వినాపి ముక్తిర్న సిధ్యతి బ్రహ్మశతాన్తరేఽపి॥ (వివేకచూడామణి ౬ శ్లో.)

మానవుడు వేదాంతశాస్త్రాలను వాఖ్యానాలతో సహా పఠించవచ్చు గాక, యజ్ఞయాగాదులు చేసి మహేంద్రాది దేవతలనందరిని మెప్పించవచ్చుగాక, శ్రౌతస్మార్తాది బౌతికకర్మలు చేయుదురు గాక, మఱియు నానాదేవతలను సేవింతురు గాక – వీటి వలన ప్రయోజనం శూన్యం. సర్వభూతములయందలి యాత్మ యొకటేయని తెలివి గలిగి, ఆత్మతో మన ఐక్యతను అనుభూతి చెందకుండా నూరు బ్రహ్మకల్పములకైనను ముక్తి లభింపదు

అమృతత్వస్య నాశాస్తి విత్తేనేత్యేవ హి శ్రుతిః।
బ్రవీతి కర్మణో ముక్తేర హేతుత్వం స్ఫుటం యతః॥ (వివేకచూడామణి ౭ శ్లో.)

వేదాంత వాక్యాల ప్రకారం, సిరిసంపదల వలన మోక్షప్రాప్తి కలుగనే కలుగదు. కాబట్టి సిరిసంపదల కొసం చేసే కర్మలు కూడా మోక్షప్రాప్తికి ఏ మాత్రము సహాయపడవు.

న కర్మణా సుకృతే నైవ రాజ్ఞా సత్యం జయే జ్జుహుయాద్వా యజేద్వా।
నతేన బాలోఽమృత్యు మభ్యేతి రాజ్ఞా రతించాసౌ నలభత్యంతకాలే॥ (సనత్సుజా॥ ४-౧౯)

ఓ రాజా! వేదవిహితమైన పుణ్యకర్మచేతనే నిత్యశుభమును సాధించుటకు వీలుపడదు. ఇకను హోమముజేయుగాక, యజ్ఞముజేయుగాక, మూఢుడైనవాడు (ఆత్మజ్ఞానము లేనివాడు) మోక్షము బొందజాలడు. అవసానకాలములో ఆత్మరతి సుఖము గాంచజాలడు.

త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।
నిర్ద్వన్ద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥४౫॥

వేదాః = వేదములు, **త్రైగుణ్యవిషయాః** = త్రిగుణాత్మకములగు విషయములను తెలుపునవిగానున్నవి, **హే అర్జున** = ఓ అర్జునా (నీవు) , **నిస్త్రైగుణ్యః** = త్రిగుణాత్మకములగు విషయముల వాంఛను వదలినవాడవుగను (గుణాతీతుడవుగను), **నిత్యసత్త్వస్థః** = సదా కేవల శుద్ధసత్త్వాపన్నుడవుగను, **నిర్ద్వంద్వః** = శీతోష్ణాది ద్వంద్వములు లేనివాడవుగను, **నిర్యోగక్షేమః** = యోగక్షేమచింతారహితుడవుగను, **ఆత్మవాన్** = ఆత్మజ్ఞానము గలవాడవుగను, **భవ** = అగుము.

తాత్పర్యము– వేదములు త్రిగుణాత్మకములగు విషయములను తెలుపునవిగానున్నవి. ఓ అర్జునా! నీవు త్రిగుణాత్మకములగు విషయముల వాంఛను వదలినవాడవుగను (గుణాతీతుడవుగను), సదా కేవల శుద్ధసత్త్వాపన్నుడవుగను, శీతోష్ణాది ద్వంద్వములు లేనివాడవుగను, యోగక్షేమచింతారహితుడవుగను, ఆత్మజ్ఞానము గలవాడవుగను అగుము.

వివరణ – వేదములు సత్త్వరజస్తమో గుణములకు సంబంధించిన ప్రకృతివిషయములను ఎఱిగించుచున్నవి. ఆ కారణము వలన నీవు త్రిగుణాత్మకములగు విషయములయందు ఆశ లేనివాడవుగను, వాంఛను వదలినవాడవుగను అనగా గుణాతీతుడవుగను అగుము. సుఖదుఃఖములకు కారణములైన శీతము ఉష్ణము, లాభము నష్టము, జయము అపజయము, శుభము అశుభము మొదలగునవి పరస్పరము విరోధ స్వభావము గలిగినవి. వీటిని ద్వంద్వములని చెప్పబడును. ఈ ద్వంద్వములు సుఖదుఃఖములను కలుగజేయుచున్నవి. కనుక ఈ ద్వంద్వములను సహించుము. ఈ ద్వంద్వములతో సంపర్కము వదలి నిర్ద్వన్ద్వుడవగుము. ఏల్లప్పుడును ధైర్యముతో ఉండుము. నిరంతర హరి ధ్యానము చేయుము. ఎల్లప్పుడును శుద్ధ సత్వగుణమునే ఆశ్రయించినవాడవగుము. నిత్య సత్త్వము పరబ్రహ్మవస్తువు, ఆ సచ్చిదానంద స్వరూపుడైన కళ్యాణగుణ సింధువునందే నీ చిత్తమును సదాయుంచి తచ్చింతన, తత్స్మరణ, తత్కీర్తనాదులయందే స్థిరముగనుండుము. నిరంతరము శుద్ధ సత్త్వరూపమైన భగవత్తత్త్వమునందే స్థిరముగ నిలిచియుండు వాడవు, స్వస్వరూపము నెఱిగినవాడవు కమ్ము. ఆ పరబ్రహ్మమునే ఆశ్రయించిన వాడవగుము. సదా శుద్ధ సత్త్వవిశిష్టుడవగుము. యోగము అనగా సంపాదించని దానిని సంపాదించుట, క్షేమము అనగా సంపాదించిన దానిని కాపాడుట. కనుక సంపాదించుట, కాపాడుట యను యోగక్షేమములయందు చింత లేనివాడవు కమ్ము.

అపేక్షాశూన్యుడవు కమ్ము. మనస్సును స్వాధీనమందుంచుకొనిన వాడవగుము. ఆత్మజ్ఞానము గలవాడవుగను అగుము. ఆత్మ జ్ఞానము గలవాడవగుట వలన గలుగు ప్రయోజనమును ఈ క్రింది శ్లోకమునందు చెప్పబడినది.
నఛందాంసి వృజినం తారయంతి మాయావినం మాయయా వర్తమానం।
నీడం శకుంతా ఇవ జాత పక్షాః ఛందాంస్యేనం ప్రజహో త్యంతకాలే॥ (సనత్సుజాతీయము. ౨-౫.)
మాయావియై మాయతోగూడి వర్తించుచు పాపమును పెంచుకొనినవానిని వేదములు రక్షింపజాలవు. వాడు చదివిన వేదసారము లన్నియు మరణకాలము ప్రాప్తించినప్పుడు రెక్కలు వచ్చిన పక్షులు గూటిని వదిలివేసినట్లు వానిని వదలివేసి తొలగిపోవుచున్నవి. కనుక అర్జునా! నీవు గుణాతీతుడవు, నిర్ద్వన్ద్వుడవు, యోగక్షేమచింతారహితుడవుగను, శుద్ధ సత్త్వగుణసంపన్నుడవు, ఆత్మజ్ఞానము గలవాడవుగను అగుము. ఆత్మ జ్ఞానము గలవాడు పొందు ప్రయోజనమును ఈ క్రింది శ్లోకమునందు చెప్పబడినది.

యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే ।
తావాన్సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥౪౬॥

ఉదపానే = స్నానపానాదికముల విషయమై చిన్న చిన్న కాలువలు, నూతులు వలన , **యావానర్థ** = ఎంతటి ప్రయోజనము గలదో, **సర్వతః** = అంతటను, **సంప్లుతోదకే** = నిండియున్న యుదకముగల సరోవరమునందు కూడా కలదు, **సర్వేషు** = సమస్తములైన, **వేదేషు** = వేదములయందు గల, **తావాన్** = ప్రయోజనమంతయూ, **విజానతః** = బ్రహ్మతత్త్వమును బాగుగ తెలిసిన, **బ్రాహ్మణస్య** = బ్రహ్మనిష్ఠునికి (కలదు)

తాత్పర్యము – స్నానపానాదికముల విషయమై చిన్న చిన్న కాలువలు, నూతులు వీటి వలన కలుగు ప్రయోజనము, అంతటను నిండియున్న యుదకము గల తటాకమునందు యెటుల సిద్ధించునో , అటులనే సమస్తములైన వేదములందు ప్రతిపాదింపబడిన కామ్యకర్మ ఫలములన్నియు ఆత్మానుభవము గల బ్రహ్మనిష్ఠునికి గలుగుచున్నవి.

వివరణ – స్నానపానాదులకై స్వల్పమైన నీరుగల బావి మొదలగు వాట్లలో ఎంత ప్రయోజనముగలదో, అంత ప్రయోజనమున్నూ అంతట ప్రవహించి సముద్రపు వంటి మహత్తైన జలప్రవాహమునందు ఇమిడి ఉన్నది. అదేవిధంగా వేదములనంతట చెప్పబడిన సకలకర్మలచేతను ఎట్టి ప్రయోజనముగలదో, అట్టి ప్రయోజనమంతయునూ ఆత్మతత్త్వమున ఇమిడి ఉన్నది. వేదములనందు ప్రతిపాదింపబడిన సమస్త కామ్యకర్మల ఫలమునంతటిని బ్రహ్మ(ఆత్మ) తత్త్వము నెఱిగిన బ్రహ్మనిష్ఠుడు పొందుచున్నాడు. కనుక అర్జునా! ఆత్మజ్ఞానవంతుడవు కమ్ము.
తత్రాపరా ఋగ్వేదో యజుర్వేద స్సామవేదోఽథర్వవేద శ్శిక్షా కల్పో వ్యాకరణం।
నిరుక్తం ఛందో జ్యోతిషమితి. అథపరా యయా తదక్షర మధిగమ్యతే॥ (ముండకోపనిషత్తు ౧ ఖం ౫ శ్లో)
ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వవేదము (అను నాలుగు వేదములు), శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందస్సు, జ్యోతిషము (అను ఆరు శాస్త్రములు) అపరవిద్యలో జేరినవి. మఱియేవిద్యచే అస్ఖలిత పరబ్రహ్మతత్త్వము పొందబడుచున్నదో ఆ విద్య పరావిద్యయనబడును. పరావిద్య లభించినవారికి అపరావిద్యతో పనిలేదు.
అమృతేన తృప్తస్య పయసా కింప్రయోజనం? ఏవం స్వాత్మానుజ్ఞాత్వావేదైః కిం ప్రయోజనం భవతి।

జ్ఞానామృతతృప్తయోగినో నకించిత్కర్తవ్యమస్తి తదస్తినే న్నసతత్త్వవిద్భవతి॥ (పైంగలోపనిషత్తు ౪ అధ్యా ౯ శ్లో)
అమృతం త్రావి తృప్తిజెందినవానికి జలముతో ఏమి ప్రయోజనమున్నది? అట్లే తనయందు ప్రకాశించు పరమాత్మ తత్త్వమును తెలిసికొనిన తర్వాత వేదములతో ఏమి ప్రయోజనమున్నది? జ్ఞానామృతముతో తృప్తిపడిన యోగీశ్వరునకు చేయదగినది కొంచెమైననుండదు. ఉండినచో అట్టివాడు తత్వజ్ఞుడు కాడు.

ద్వేవిద్యేవేదితవ్యేహి పరాచైవాపరాచతే।
తత్రాపరాతువిద్యేషా ఋగ్వేదోయజురేవచ॥
సామవేద స్తథాథర్వవేదః శిక్షామునీశ్వర।
కల్పోవ్యాకరణం చైవ నిరుక్తం ఛందఏవచ॥
జ్యోతిషంచ యథానాత్మ విషయా అపిబుద్ధయః
అథైషాపరమావిద్య యయాత్మా పరమాక్షరమ్ ॥
తద్భూతయోనిం పశ్యంతిధీరా ఆత్మానమాత్మని ॥ (రుద్రహృదయోపనిషత్తు ౨౮ మొదలు)
అపరావిద్యయనియు, పరావిద్యయనియు రెండువిద్యలు తెలియదగినవి. అందు ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అదేవిధముగా అథర్వవేదము, శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందస్సు, జ్యోతిషము ఇకను అనాత్మవిషయ జ్ఞానముతో కూడిన ఇలాంటివన్నియు కూడ అపరావిద్యలో జేరుచున్నవి. మఱియేవిద్యచేత జ్ఞానయోగులు సర్వభూతముల ఉత్పత్తికి కారణమైనట్టియు, అవ్యయమైనట్టియు, ఆత్మతత్త్వమును తమలోతాము చూచుచున్నారో ఆ విద్య పరావిద్యయగును. పరావిద్య లభించినవానికి అపరావిద్యయందు ప్రయోజనముండదని తెలియవలయును.

కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన।
మా కర్మఫలహేతుర్భూర్మా తే సంగోఽస్త్వకర్మణి ॥౪౭॥

తే = నీకు, **కర్మణి ఏవ** = కర్మముచేయుటనందే, **అధికారః** = అధికారము గలుగుగాక!, **కదాచన** = ఎప్పుడును, **ఫలేషు** = కర్మఫలములయందు అధికారము, **మా అస్తు** = కలుగకుండునుగాక!, **కర్మఫలహేతుః** = కర్మఫలమునకు కారణభూతుడవు, **మా భూః** = కాకుము, **అకర్మణి** = కర్మలు చేయక మానుటయందును, **తే** = నీకు, **సంగః** = ఆసక్తి, **మా అస్తు** = కలుగకుండుగాక!

తాత్పర్యము– నీకు కర్మముచేయుటనందే అధికారము గలుగుగాక! ఎప్పుడును కర్మఫలములయందు అధికారము కలుగకుండునుగాక! కర్మఫలమునకు కారణభూతుడవు కాకుము. కర్మలు చేయక మానుటయందును నీకు ఆసక్తి కలుగకుండుగాక!

వివరణ – నీకు నీ వవర్ణమునకు, ఆశ్రమమునకు, స్వభావమునకు, పరిస్థితికి అనుగుణమైనట్టి శాస్త్రవిహిత కర్మలు చేయుటయందే అధికారము గలదు, స్వాతంత్ర్యము గలదు. త్యజించుటయందు అధికారము లేదు, స్వాతంత్ర్యములేదు. కనుక నీ కర్తవ్యకర్మను తప్పక ఆచరించియే తీరవలయును. ఎన్నడును త్యజించరాదు. కాని మానవునకు కర్మయొక్క ఫలమునందు ఎట్టి అధికారము, స్వాతంత్ర్యమును లేదు. ఎందుకనగా ఫలమును కోరి చేయు కర్మ (సకామకర్మ) బంధహేతువు. కర్మబంధములును కలుగజేయును. శాస్త్రవిహిత కర్మలయందు ఫలాభిలాష, ఆసక్తి లేకపోవుటచేత ఇవి ఫలములచేత బంధించలేవు. కర్మను ఈశ్వరసమర్పణగా ఆచరింపుము. ఇట్టు కర్తృత్వాభిమానమునువదిలి కర్మనుజేసినచో దాని ఫలమునొందక మోక్షఫలమునొందెదవు.

కాబట్టి అర్జునా! నీవు ఫలాభిలాషను పూర్తిగత్యజించి శ్రద్ధాభక్తులతో, అహంకార మమకార రహితముగా శాస్త్రవిహితకర్మలను ఆచరింపుము. నైష్కర్మ్యసిద్ధి లభించునంతవరకు కర్మలను విడువకనే చేయవలెయును. అట్లు చేసినయెడల క్రమముగా అంతఃకరణము పరిశుద్ధినొంది నిస్త్రైగుణ్యత్వమును పొందెదవు. నిస్త్రైగుణ్యత్వము లభించగానే ద్వంద్వములు నీకు తోచనేతోచవు. అట్టి స్థితిలో నీచిత్తము, బుద్ధి, ఇంద్రియములు, అన్నియును కేవలము నిత్యుడును, సచ్చిదానంద శుభస్వరూపుడును, కళ్యాణగుణ సంపన్నుడును, నిరతిశయ సౌందర్య స్వరూపుడును, దివ్యమంగళ రూపుడైన పరమాత్మయందే నిశ్చలముగ, స్థిరముగ నిలిచి యుండును. కనుక నీవు కర్మాచరణము నందే ఆసక్తుడవు కమ్ము. కర్మఫలమునందు ఆసక్తిని విడిచిపెట్టుము.

యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।
సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥౪౮॥

హే ధనంజయ! = ఓ ధనంజయ!, **సిద్ధ్యసిద్ధ్యోః** = ప్రాప్తాప్రాప్తములయందు, **సమత్వం** = సమబుద్ధి గలిగియుండుట, **యోగః**= యోగమని, **ఉచ్యతే** = చెప్పబడుచున్నది.(కనుక), **త్వం** = నీవు, **సమః** = సమబుద్ధిగలవాడవు, **భూత్వా** = అయి, **సంగం** = సంగమును, **త్యక్త్వా** = విడిచి, **యోగస్థః** = యోగమునందున్నవాడవై, **కర్మాణి** = కర్మలను, **కురు** = చేయుము.

తాత్పర్యము– ఓ అర్జునా! ప్రాప్తాప్రాప్తములయందు అనగా కర్మానుష్ఠానమువలన గలిగెడు ఫలములయొక్క కలిమిలేములయందు సమబుద్ధిని గలిగి యుండుట యోగమని చెప్పబడుచున్నది. అందువలన నీవు కర్మఫల ప్రాప్తాప్రాప్తములయెడల సమబుద్ధిగలవాడవై అట్టి కర్మఫలమందలి సంగమును విడిచి యోగనిష్ఠయందున్నవాడవై కర్మలను జేయుము.

వివరణ – ధనంజయా! నీవు నీ కర్తవ్యకర్మమును ఆచరింపుము. కాని సంగమును వదలి కర్మను చేయుము. సంగమనగా

భావాభావే పదార్థానాం హర్షామర్షవికారదా।
మలినా వాసనా యైషా సా సజ్గ ఇతి కథ్యతే॥ (యోగవాషిష్ఠము)

ఓ రామచంద్రా! పదార్థముల యొక్క భావాభావము(సంయోగ వియోగము)లందు హర్ష, క్రోధ, శోకాది వికారములను కలుగజేయు మలిన వాసనయే **"సంగమని"** చెప్పబడుచున్నది. కనుక సంగము యున్నంతకాలము సంయోగవియోగములు, రాగద్వేషములును, వాటి కార్యరూపములైన హర్ష శోకములును కలుగుచునే యుండును. ఎంతకాలము రాగద్వేషములుండునో , అంతకాలమును సిద్ధి, అసిద్ధియందు సమభావము కుదరదు. కనుక నిస్సంగుడవై యుండుము.

కర్మోదయే కర్మఫలానురాగాస్తే తత్రానుయాంతి నతరంతి మృత్యుమ్।
సదర్థ యోగానవగమాత్సమంతాత్ ప్రవర్తతే భోగయోగేన దేహీ॥ (సనత్సుజాతీయము ౧౫అ ౯శ్లో)

కర్మయోగారంభమున కర్మఫలమునందు అనురక్తులైనవారు దానియందే తగులుకొనిపోదురు. మృత్యువును తరింపజాలరు. స్వస్వరూపానుభవము అందుబాటులో లేకపోవుటవలన దేహి సంపూర్ణముగా ఐహికభోగములను సమకూర్చుకొనుటతోనే వర్తించుచుండును. కావున కర్మచేయనారంభించినప్పటినుండి

కర్మను చేస్తున్నంత కాలమూ యోగస్థుడవైయుండుము. నడుచుచున్నప్పుడు, తిరుగుచున్నప్పుడు, కూర్చున్నపుడు, నిలుచున్నపుడు, నిద్దురపోవునప్పుడు, మేలుకొనినప్పుడు, ప్రతిక్షణమును, ప్రతి చిన్నపని చేయునప్పుడును నిరంతరముగ ఈ సమత్వబుద్ధిని ఆశ్రయించియే యుండుము. సిద్ధి అసిద్ధిలను గురించి చింతింపకుము. నిరంతరము యోగస్థుడవైయుండుము. ఫలాసక్తిని పూర్తిగా త్యజింపుము. ఇదియే పరబ్రహ్మమును పొందుటకు సుగమము, సులభము, నిశ్చితమునైన ఉపాయము. కనుక అర్జునా! జయము, అపజయము అను ఈ రెండు ఫలములను గూర్చి చింతింపక యుద్ధముజేయుము. ఫలములగూర్చి ఆలోచింపక యోగస్థుడవై కర్మలాచరింపుము.

దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ ।
బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః ॥౪౯॥

హే ధనంజయ = ఓ అర్జునా!, **బుద్ధియోగాత్** = చిత్తశుద్ధిగల్గి చేసెడి సమత్వబుద్ధియుక్తమైన నిష్కామకర్మయోగముకంటె, **కర్మ** = కామ్యకర్మము, **దూరేణ** = మిక్కిలి, **అవరం హి** = దీనభావము గలదిగదా!(నికృష్టమైనది కదా) కనుక నీవు, **బుద్ధౌ** = నిష్కామకర్మానుష్ఠానబుద్ధియందు, **శరణం** = రక్షకత్వమును, **అన్విచ్ఛ** = ఇచ్ఛగింపుము. **ఫలహేతవః** = ఫలము నపేక్షించువారు, **కృపణాః** = హీనులు(దీనులు).

తాత్పర్యము- ఓ అర్జునా! చిత్తశుద్ధిగల్గి చేసెడి సమత్వబుద్ధియుక్తమైన నిష్కామకర్మయోగముకంటె కామ్యకర్మము మిక్కిలి దీనభావము గలదిగదా! (నికృష్టమైనది కదా!) కనుక నీవు నిష్కామకర్మానుష్ఠానబుద్ధియందు రక్షకత్వమును ఇచ్ఛగింపుము. ఫలము నపేక్షించువారు హీనులు(దీనులు).

వివరణ - ఓ అర్జునా! సమత్వబుద్ధితోగూడిన ఫలాపేక్షరహిత కర్మ కంటే, ఫలేచ్ఛ చేత చేయబడు కామ్యకర్మము మిక్కిలి నింద్యమైనది. ఈశ్వరార్పణ బుద్ధితో చేయుకర్మ కంటే ఫలముకోరి చేయబడిన కామ్యకర్మము మిక్కిలి నికృష్టమైనది. సిద్ధ్యసిద్ధులలో సమత్వబుద్ధితోగూడి ఈశ్వరారాధన కొఱకు చేయబడునట్టి నిష్కామబుద్ధియుక్తమైన కర్మకంటె ఫలాపేక్షతో చేయబడు కామ్యకర్మము మిక్కిలి తక్కువైనది. ఎందుకనగా ఈ కామ్యకర్మ జననము మరణము మొదలగువాటికి కారణమగుటవలన నీవు నిష్కామకర్మనుష్ఠాన బుద్ధియోగమునే ఆశ్రయించుము..

చిత్తస్యశుద్ధయే కర్మ న తు వస్తూపలబ్ధయే।
వస్తూసిద్ధిర్విచారేణ న కించిత్కర్మ కోటిభిః॥ (వివేకచూడామణి ౧౧ శ్లోకము)
కర్మయోగము చిత్తశుద్ధికి పనికివచ్చునే కాని తత్త్వప్రాప్తికి పనికిరాదు. కాని పరమాత్మతత్త్వము జ్ఞానముచేతనే లభిస్తుంది. సూక్ష్మంగా పరిశీలిస్తే నిష్కామకర్మలు గూడ విముక్తినిస్తాయి. కాకపోతే అవి నేరుగా కాక చిత్తశుద్ధి ద్వారా జ్ఞానోదయానికి దారితీస్తాయి. ఈ చిత్తశుద్ధివలన గలిగిన జ్ఞానము పరబ్రహ్మప్రాప్తిని కలిగించును. ఫలమును కోరి చేయు కర్మల వలన అనేక బంధాలు ప్రాప్తిస్తాయి. చిత్తశుద్ధి కలుగదు. పరబ్రహ్మమును పొందలేడు. **"యోవా ఏత దక్షరం గార్గ్యవిదిత్వా స్మాల్లోకాత్ప్రైతి సకృపణః"** (బృహ ఉ॥ ౩-౮-౧౦) - హే గార్గీ! ఎవడు పరబ్రహ్మమును పొందకయే ఈ లోకమునుండి పోవుచున్నాడో వాడు కృపణుడు. ఫలమునపేక్షించి

కర్మలాచరించువారు పరబ్రహ్మమును పొందలేరు. కనుక ఫలము నపేక్షించువారు కృపణులు.

బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే ।
తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ ॥౫౦॥

బుద్ధియుక్తః = చిత్తశుద్ధి గలవాడు లేక సమత్వబుద్ధి గలవాడు, **ఉభే** = రెండైన, **సుకృతదుష్కృతే** = పుణ్యపాపములను, **ఇహ** = ఈ లోకమునందే, **జహాతి** = విడుచుచున్నాడు. **తస్మాత్** = ఆ కారణమువలన, **యోగాయ** = యోగము కొఱకు, **యుజ్యస్వ** = ఆయత్తపడుము , **కర్మసు** = కర్మములయందు, **కౌశలం** = నేర్పరితనమే, **యోగః** = యోగము.

తాత్పర్యము– సమత్వబుద్ధితో గూడినవాడు పుణ్యపాపముల రెండింటిని ఈ లోకమునందు జీవించిఉండగనే విడుచుచున్నాడు. పుణ్యపాపములకతీతుడగుచున్నాడని భావము. అందువలన యోగము కొఱకు సన్నద్ధుడవగుము. కర్మలయందు (సమత్వబుద్ధితో గూడిన) నేర్పరితనమే యోగమనబడును.

వివరణ – పుణ్యముగూడ పాపమువలె మరల జననమరణములను కలుగజేయునది. కనుక యోగమునందున్నవాడు పాపఫలమును ఎట్లు అపేక్షించడో అటులనే పుణ్యఫలమును గూడ అపేక్షించడు. అనగా పుణ్యపాపములు రెండింటిని ఇక్కడే విసర్జించుచున్నాడు. అనగా ఈ జన్మలోనే సమస్త కర్మబంధనముల నుండి ముక్తుడగుచున్నాడు. సమత్వబుద్ధితో గూడిన కర్మలకు పుణ్యపాపఫలములుండవు. కనుక సమత్వబుద్ధితో గూడిన కర్మలు పునర్జన్మను కలిగించలేవు.

నకామకర్మబీజానాం దృశ్యతేయత్ర సంభవః।
వాసుదేవైక నిలయ స్సవైభాగవతోత్తమః॥ (ఆర్షభగీత. అ.౧–౫౦)

కోరికతోగూడిన కర్మబీజాంకురము ఎవనియందు గనబడదో, సర్వ భూతాత్మయైన పరమాత్మయే తనకు స్థానముగ నేవడున్నాడో వాడు దైవ పరాయణులలో ఉత్తముడు.

కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।
జన్మబంధవినిర్ముక్తాః పదం గచ్ఛంత్యనామయమ్ ॥౫౧॥

హి = ఏలయనగా, **మనీషిణః** = బుద్ధిమంతులైనవారు, **బుద్ధియుక్తాః** = నిష్కామకర్మానుష్ఠానపరులై, **కర్మజం** = కర్మమువలన గలిగెడు, **ఫలం** = ఫలమును, **త్యక్త్వా** = విడిచి, **జన్మబంధవినిర్ముక్తాః** = జన్మమనెడు బంధమునుండి విడువబడినవారై, **అనామయం** = సర్వోపద్రవరహితమైన, **పదం** = పదమును(స్థానమును), **గచ్ఛంతి** = పొందుచున్నారు.

తాత్పర్యము– ఏలయనగా బుద్ధిమంతులైనవారు నిష్కామకర్మానుష్ఠానపరులై కర్మమువలన గలిగెడు ఫలమును విడిచి జన్మమనెడు బంధమునుండి విడువబడినవారై సర్వోపద్రవరహితమైన పదమును(స్థానమును) పొందుచున్నారు

వివరణ – సమత్వబుద్ధి గలవారలు కర్మచే గలుగునట్టి ఫలమును కోరక జ్ఞానముగలవారలై జననమను బంధము నుండి ప్రాణముతో నుండునప్పుడే పూర్ణముగ విడువబడినవారలై ఎట్టి సంకటములు, క్లేశములు,

వికారములు, దుఃఖములు లేని విష్ణువుయొక్క పరమపదమును (మోక్షమును) పొందుచున్నారు. సమత్వబుద్ధితో గూడిన కర్మలకు పుణ్యపాపఫలములుండవు. కనుక సమత్వబుద్ధితో గూడిన కర్మలు పునర్జన్మను కలిగించలేవు.

యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి ।
తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥౫౨॥

యదా = ఎప్పుడు, **తే** = నీ యొక్క, **బుద్ధి** = బుద్ధి, **మోహకలిలం** = మోహస్వరూపమైన అజ్ఞానకాలుష్యమును, **వ్యతితరిష్యతి** = దాటగలదో, **తదా** = అప్పుడు, **శ్రోతవ్యస్య** = ఇక వినదగిన అర్థమునందును **శ్రుతస్య చ** = ఇదివరలో వినిన అర్థమునందును, **నిర్వేదం** = వైరాగ్యమును, **గంతాసి** = పొందెదవు.

తాత్పర్యము– ఎప్పుడు నీ యొక్క బుద్ధి మోహస్వరూపమైన అజ్ఞానకాలుష్యమును దాటగలదో అప్పుడు ఇక వినదగిన అర్థముయొక్క, ఇదివరలో వినిన అర్థముయొక్క వైరాగ్యమును పొందెదవు.

వివరణ – నిత్యానిత్యములను, కర్తవ్యాకర్తవ్యములను నిర్ణయించుకొనతగిన వివేకమును సంపాదించుకొని , మమకారము, అహంకారము, ఆసక్తి, కోరిక, కర్తృత్వాభిమానము మొదలగు వాటిని త్యజించి, నిష్కామభావముతో ఈశ్వర సమర్పణబుద్ధితో కర్మలుచేయుము. నీవు ఈ నిష్కామకర్మయోగమునందు విశ్వాసముంచి సక్రమవిధానముగ శ్రద్ధాగా ఆచరించినయెడల క్రమక్రమముగా నీ వీ మోహరూపమైన అజ్ఞాన కల్మశమును దాటగలుగుదువు. అప్పుడు నీకు ఇహలోక పరలోక సంబంధమైన ప్రతివిషయమునను వైరాగ్యము కలుగగలదు.

ఇంద్రియేభ్యశ్చ పంచభ్యో మనసశ్చైవ భారత।
అతీతానాగతేభ్యశ్చ ముక్తశ్చే త్స సుఖీభవేత్॥ (సనత్సుజాతీయము ౨ అ. ౩౮ శ్లో)
ఓ భారతా! ఇంద్రియములనుండి, మనస్సునుండి, ఆగతానాగతములైన విషయవాసనలనుండి విడువబడిన వాడగునేని, అట్టివాడు సుఖవంతుడగును.

శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।
సమాధావచలా బుద్ధిస్తదా యోగమవాప్స్యసి ॥౫౩॥

శ్రుతివిప్రతిపన్నా = కర్మకాండమునందలి అర్థవాద శ్రుతులచేత విక్షేపమును బొందియున్న, **తే** = నీయొక్క, **బుద్ధిః** = బుద్ధి(మనస్సు), **యదా** = ఎప్పుడు, **నిశ్చలా** = నిశ్చలమై, **సమాధౌ** = సమాధియందు (ధ్యానమందు), **అచలా** = అచలముగా, **స్థాస్యతి** = స్థిరముగా నుండగలదో, **తదా** = అప్పుడు, **యోగం** = యోగసిద్ధిని (పరమాత్మజ్ఞానమును), **అవాప్స్యసి** = పొందగలవు.

తాత్పర్యము– నానావిధములైన అర్థవాద శ్రుతులచేత విక్షేపమును బొందియున్న నీ యొక్క బుద్ధి లేక అంతఃకరణము ఎప్పుడు నిశ్చలమై సమాధియందు (ధ్యానమందు)

అచలముగా స్థిరముగా నుండగలదో అప్పుడు యోగసిద్ధిని (పరమాత్మజ్ఞానమును) పొందగలవు.

వివరణ – అనేక ఫలములను, వాటిని పొందుటకు అనేక సాధనములను తెలియబరచునట్టి శాస్త్రములను వినుటచే పలువిధములుగ కలతజెంది చలించిన నీ యంతఃకరణము ఎప్పుడు సమాధినందు స్థిరముగ నిలబడునో అపుడు నీవు యోగసిద్ధిని పొందగలవు. సమాధి యనగా

అక్షుబ్ధా నిరహఙ్కారా ద్వన్ద్వేష్వననుపాతినీ।
నిశ్చన్తాஉధిగతాஉభీష్టా హేయోపాదేయవర్జితా॥
ప్రోక్తా సమాధిశబ్దేన పరిపూర్ణా మనోగతిః। (యోగవాశిష్ఠము. సర్గ ౧౬ శ్లో ౩౦,౩౧)

ఏ విధమైన సంక్షోభము లేనిది, అహంకారమమకారశూన్యమైనది, శీతోష్ణసుఖదుఃఖాదిద్వంద్వములయందు ప్రవేశింపనిది, చింతావిరహితమైనది, అభిష్టప్రాప్తి పొందినది, ఇది విడువదగినది(హేయము), ఇది గ్రహింపదగినది(ఉపాదేయము) యను భేదమును వర్జించినది, సర్వత్ర పరిపూర్ణమైనదియు నగు మనఃస్థితి, **సమాధి** శబ్దముచే పేర్కొనబడినది. నీ యొక్క మతి (అంతఃకరణము) ఎప్పుడు సమాధినందు(భగవద్ధ్యనమందు) స్థిరమైనదై చలించనిదై నిలుచునో అప్పుడు భగవత్ప్రాప్తి రూపమైన యోగమును పొందగలవు.

అర్జున ఉవాచ ।
స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ ।
స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్ ॥౫౪॥

హే కేశవ! = ఓ కేశవ!, **సమాధిస్థస్య** = సమాధినిష్ఠయందుండునట్టి, **స్థితప్రజ్ఞస్య** = స్థితప్రజ్ఞుని (నిశ్చలమైన తత్త్వజ్ఞానము గలవాని) యొక్క, **భాషా** = భాష (లక్షణము), **కా** = ఎట్టిది, **స్థితధీః** = నిశ్చయజ్ఞానము గలవాడు, **కిం ప్రభాషేత** = ఎట్లు వచించును, **కిం ఆసీత** = ఏరీతిగా నుండును, **కిం వ్రజేత** = ఎట్లాచరించును (ఎట్లు ప్రవర్తించును).

తాత్పర్యము – అర్జున ఉవాచ–

ఓ కేశవ! సమాధినిష్ఠయందుండునట్టి స్థితప్రజ్ఞుని (నిశ్చలమైన తత్త్వజ్ఞానము గలవాని) యొక్క భాష (లక్షణము) ఎట్టిది? నిశ్చయజ్ఞానము గలవాడు ఎట్లు వచించును? ఏరీతిగా నుండును? ఎట్లాచరించును (ఎట్లు ప్రవర్తించును)?

వివరణ – అర్జునుడు ఆత్మజ్ఞానమొందినవాని లక్షణమును తెలుసుకొనవలెనను కోరికతో ఈవిధముగా ప్రశ్నించుచున్నాడు. "నేను బ్రహ్మముగా నున్నాను " అనుజ్ఞానమునందు నిలకడపొంది సమాధియందు నిలబడిన వాడి లక్షణమేమి? ఇతరులచే ఎట్లు చెప్పబడుచున్నాడు? ఇతని లక్షణమేమి? ఇట్టి స్థిరమైనజ్ఞానము గలవాని వాచికము (నోటిచే మాట్లాడుట మొదలగునవి) ఎట్లుండును? మానసికము(మనోవృత్తి) ఎట్లుండును? కాయికము (దేహముచే చేయబడు వ్యాపారము) ఎట్టిదైయుండును?

శ్రీభగవానువాచ ।

ప్రజహాతి యదా కామాన్సర్వాన్పార్థ మనోగతాన్ ।
ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే ॥౫౫॥

హే పార్థ! = ఓ అర్జునా!, **మనోగతాన్** = మనోగతములగు, **సర్వాన్** = సమస్తములైన, **కామాన్** = కోరికలను(సంకల్పములను) **యదా** = ఎప్పుడు, **ప్రజహాతి** = ప్రయత్నపూర్వకముగా విడుచుచున్నాడో, **తదా** = అప్పుడు, **ఆత్మని ఏవ** = తన ఆత్మయందే, **ఆత్మనా** = తన ఆత్మచేత, **తుష్టః** = సంతుష్టుడగువాడు (ఆనందించువాడు), **స్థితప్రజ్ఞః** = స్థితప్రజ్ఞుడని (నిశ్చలజ్ఞానము గలవాడని), **ఉచ్యతే** = చెప్పబడుచున్నాడు.

తాత్పర్యము– ఓ అర్జునా! మనోగతములగు సమస్తములైన కోరికలను(సంకల్పములను) ఎప్పుడు ప్రయత్నపూర్వకముగా విడుచుచున్నాడో అప్పుడు తన ఆత్మయందే తన ఆత్మచేత సంతుష్టుడగువాడు (ఆనందించువాడు) స్థితప్రజ్ఞుడని (నిశ్చలజ్ఞానము గలవాడని) చెప్పబడుచున్నాడు.

వివరణ – అంతఃకరణములో గల సమస్తములైన కోరికలను (సంకల్పములను) ఎప్పుడు యత్నపూర్వకముగా విడుచుచున్నాడో, అప్పుడు శుద్ధమైన ఆత్మయగును. ఆ స్థితిలో ఆత్మకంటె భిన్నమైనవస్తువు గోచరించనందున తనలో తానే అఖండానందమునునుభవించును. ఎల్లప్పుడునూ ఆత్మయందే ఆత్మచేత సంతుష్టుడగువాడు స్థితప్రజ్ఞుడనబడును.

ప్రజాహాతి యదాకామాన్ సర్వాంశ్చిత్త గతాన్మునే।
మయి సర్వాత్మకే తుష్టః సజీవన్ముక్త ఉచ్యతే॥ (వరాహోపనిషత్తు ४–౨౮ శ్లో)
ఓ మునీశ్వరా! ఎవడు చిత్తమందలి సమస్త కోరికలన్నిటిని లెస్సగ వదిలివేయునో, సర్వాత్ముడనైన నాయందు సంతుష్టుడై యుండునో అట్టివాడు జీవన్ముక్తుడని చెప్పబడును. ఎప్పుడయితే సర్వభూతాత్మయైన నాయందు తృప్తిజెందినవాడై తన మనస్సున తగులుకొనియుండు కోరకల నన్నిటిని విడుచుచున్నాడో అప్పుడే యతడు జీవన్ముక్తుడని చెప్పబడును.

దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।
వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥౫౬॥

దుఃఖేషు = దుఃఖములయందు, **అనుద్విగ్నమనాః** = దిగులు చెందని మనస్సు గలవాడు, **సుఖేషు** = సుఖములయందు, **విగతస్పృహః** = ఆశలేనివాడును, **వీతరాగభయక్రోధః** = అనురాగము, భయము, క్రోధము పోయినవాడునునైన, **మునిః** = మననశీలుడు (బ్రహ్మనిష్ఠుడు), **స్థితధీః** = స్థితప్రజ్ఞుడు అని, **ఉచ్యతే**= చెప్పబడుచున్నాడు.

తాత్పర్యము– దుఃఖములయందు క్లేశముచెందని మనస్సుగలవాడును, సుఖములయందు ఆసక్తిలేనివాడును, విషయముల యందు అనురాగము, భయము, క్రోధము, లేనివాడునునైన మననశీలుడు అచంచలమైన జ్ఞానము గలవాడని (స్థితప్రజ్ఞుడని) చెప్పబడుచున్నాడు.

వివరణ – దుఖము గలిగినప్పుడు భీతిజెందక, సుఖములయందు ఆశపడక రాగమును, భయమును, క్రోధమును వదులుకొని స్వస్వరూపమును మననముచేయువాడు స్థిరమైన బుద్ధిగలవాడని చెప్పబడుచున్నాడు.

నహి దుఃఖేషు శోచంతే న ప్రహృష్యంతి చర్ధిషు।
కృతప్రజ్ఞా జ్ఞానతృప్తాః క్షాంతాః సంతోమనీషిణః॥ (భారతము శాంతి ౨౨౩ అ ౨౮ శ్లో)

జ్ఞానయోగము పర్యాప్తముగ చేసి జ్ఞానముచేతనే సంతుష్టిజెంది ఓర్పు గలిగియుండు సత్పురుషులు ధీశాలురు దుఃఖములు కలిగినప్పుడు శోకింపరు. క్షేమాభివృద్ధులు కలిగినప్పుడు సంతోషపడరు గదా?

అర్థసిద్ధిః మనర్థం చ జీవితం మరణం తథా।
సుఖదుఃఖఫలంచైవ నద్వేష్మి న చ కామయే॥ (భారతము శాంతి ౨౨౪ అ ౧౩ శ్లో)

అర్థలాభమును, అనర్థమును, జీవితమును, మరణమును, సుఖదుఃఖరూపమైన కర్మఫలమును ఇట్టివాని నన్నిటిని వలదని ద్వేషింపను, కావలయునని వాంఛింపను.

"దృష్టదుఃఖేష్వను ద్వేగో విద్యయాః ప్రస్తుతం ఫలం"– దుఖములు తోచినప్పుడు భీతిజెందకుండుటే బ్రహ్మవిద్యయొక్క ఇప్పటి ఫలము. భగవత్తత్త్వమునందు మనసేంద్రియములను స్థిరముగ నిలిపినప్పుడు భౌతికములైన దుఃఖములు, సుఖములు కనపడవు. అందువలన ఖేదమోదములు కనపడవు. తనకు హానిజేయు అన్యవస్తువు లేదని తెలిసికొనినందున రాగద్వేషములు పొడసూపవు. ఇట్టి స్థితప్రజ్ఞుని గురించి తేజోబిందూపనిషత్తునందు విపులముగ వర్ణింపబడినది.

యః సర్వత్రానభిస్నేహస్తత్తత్ప్రాప్య శుభాశుభమ్ ।
నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥౫౭॥

యః = ఎవడు, **సర్వత్ర** = సకలమునందు (సర్వవిషయముల యందు), **అనభిస్నేహః** = స్నేహానుబంధము (అభిమానము) లేనివాడో, **తత్ తత్** = ఆయా, **శుభాశుభం** = శుభాశుభములను, **ప్రాప్య** = పొందినను, **న అభినందతి** = ఆనందింపడో, **న ద్వేష్టి** = ద్వేషింపడో, **తస్య** = అట్టివానియొక్క, **ప్రజ్ఞా** = ప్రజ్ఞ (జ్ఞానము), **ప్రతిష్ఠితా** = మిక్కలి స్థిరమైనది.

తాత్పర్యము– ఎవడు సర్వత్ర (సర్వవిషయముల యందు) స్నేహానుబంధము (అభిమానము) లేనివాడో, ఆయా శుభాశుభములను పొందినను శుభము వలన సంతోషమును, అశుభము వలన ద్వేషమును పొందడో అట్టివానియొక్క ప్రజ్ఞ (జ్ఞానము) మిక్కలి స్థిరమైనది.

వివరణ – ఎవరికి సకలమునందును (సమస్త విషయాదుల యందు) అభిమానము లేదో, ఎట్టి. శుభము ప్రాప్తించినను, ఎంతటి అశుభము ప్రాప్తించినను ఆనందించుట ద్వేషించుట చేయడో వాడు స్థితప్రజ్ఞుడు. ఇతని సంభాషణగాని, కర్మలుగాని, ఇంద్రియచేష్టగాని మమకారాది దోషరహితమై ఉండును. అట్టివానికి దేహమునకు ప్రారబ్ధ కర్మవశమున అనుకూల ప్రతికూలములు– ప్రియము అప్రియములు సంభవించినను చిత్తములో ఏ మాత్రము వికారముకలుగదు. ఇష్టమని అనిష్టమని, ప్రియమని అప్రియమని, శుభమని అశుభమని, లాభమని నష్టమని, జయమని అపజయమని ఏది జరిగినను ఏది లభించినను వాటియందు రాగద్వేషరహితుడై నిస్సంగుడై అభిమానరహితుడై యుండును.

లాభాలాభౌ సమౌ కృత్వా, యత్ప్రాప్తం తేనైవ నిర్లోలుప స్సర్వ విద్యా పాండిత్య ప్రపంచం భస్మీకృత్య, స్వరూపం గోపయిత్వా మత్తో వ్యతిరిక్తః కశ్చి న్నాన్యో దుఃఖేననోద్విగ్నః సుఖేన నానుమోదకో రాగేనిస్స్పృహ సర్వత్ర శుభాశుభయో రనభిస్నేహ స్సర్వేంద్రియో పరమశ్చ ఏకాకి సంచర న్న సంభాషణ పరస్వరూప ద్యానేన నిరాలంబ మవలంబ్య॥ (తురీయాతీతోపనిషత్తు)

ఎవడు లాభాలాభములను సమముగా నెంచుచుండునో , ప్రాప్తించిన దానితో తృప్తిజెంది, అలుబ్ధుడై, సమస్తవిద్యాపాండిత్యమును భస్మము చేసి తన స్వరూపమును గోప్యముగా నుంచుకొనుచుండునో, నాకంటె వేఱుగ ఎదియులేదని నిశ్చయించుకొనునో, దుఃఖముచే భీతినొందక, సుఖముచే మోదమునొందక, రాగమునందు నిస్స్పృహుడై, సర్వత్ర శుభాశుభములందు అనాసక్తుడై అభిమానరహితుడై, సర్వేంద్రియ జయశీలుడై యుండునో, ఏకాకిగా సంచరించుచు ఎవరితోను సంభాషింపక స్వరూపధ్యానముచే నిరాలంబమైన ఆత్మను అవలంబించి యుండునో– వాడు స్థితప్రజ్ఞుడు.

గృహీత్వాపీంద్రియై రర్థాన్యో నద్వేష్టి నహృష్యతి।
విష్ణోర్మాయామయం పశ్యన్సవై భాగవతోత్తమః॥ (ఆర్షభ గీత ౧-౪౮)

బాహ్యాభ్యంతరములైన ఇంద్రియములచేత విషయార్థములను గ్రహించియు, ఆ విషయార్థములవలన ఎవడైతే ద్వేషమును, సంతోషమును పొందక అంతయూ విష్ణుమాయామయముగా జూచుచుండునో అతడు భాగవతులలో ఉత్తముడు.

యదా సంహరతే చాయం కూర్మోऽంగానీవ సర్వశః ।
ఇంద్రియాణీంద్రియార్థేభ్యస్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥౫౮॥

(కిం) **చ** = మరియు, **కూర్మః** = తాబేలు, **అంగాని ఇవ** = తన అవయములనువలె, **అయం** = ఆ బ్రహ్మనిష్ఠుడు, **యదా** = ఎప్పుడు, **సర్వశః** = సమస్తములైన, **ఇంద్రియార్థేభ్యః** = ఇంద్రియవిషయములనుండి, **ఇంద్రియాణి** = ఇంద్రియములను, **సంహరతే** = మరలించుకొనుచున్నాడో, **తదా** = అప్పుడు, **తస్య** = ఆ యోగియొక్క, **ప్రజ్ఞా** = ప్రజ్ఞ (జ్ఞానము), **ప్రతిష్ఠితా** = స్థిరమైనది అగుచున్నది.

తాత్పర్యము– తాబేలు తన అవయములనువలె, ఆ బ్రహ్మనిష్ఠుడు ఎప్పుడు సమస్తములైన ఇంద్రియవిషయములనుండి ఇంద్రియములను మరలించుకొనుచున్నాడో అప్పుడు ఆ యోగియొక్క ప్రజ్ఞ (జ్ఞానము) స్థిరమైనది అగుచున్నది.

వివరణ – తాబేలు తన అవయవములను ఎట్లు లోపలకు ముడుచుకొనునో, అదేవిధముగ బ్రహ్మనిష్ఠుడు గూడ ఇంద్రియార్థములైన విషయములనుండి తన ఇంద్రియములను (మనస్సుతో సహా) ఎప్పుడైతే ఉపసంహరించుకొనుచున్నాడో అప్పుడే యతని బుద్ధి స్థిరముగ నిలుచుచున్నది.(ఈ సాధనకు యోగశాస్త్రములో ప్రత్యాహారమని పేరు).

యదాసంహరతే కామాన్ కూర్మోऽంగానీవ సర్వశః।
తదాత్మజ్యోతి రచిరా త్స్వాత్మన్యేవ ప్రసీదతి॥ (భారత శాంతి ౨౧-అ. 3 శ్లో)

తాబేలు తన అంగములను ముడుచుకొనినట్లు పురుషుడు ఎల్లరీతుల కోరికలను ఎప్పుడైతే ఉపసంహరించు కొనుచున్నాడో అప్పుడు తనయందే ఆత్మజ్యోతి త్వరగా ప్రసన్నమగుచున్నది.

"విషయేషు విచరతా మింద్రియాణాం బలాదాహరణం ప్రత్యాహారః, యద్యత్పశ్యతి తత్సర్వ మాత్మేతి ప్రత్యాహారః, నిత్యవిహిత కర్మఫలత్యాగః ప్రత్యాహారః, సర్వవిషయపరాఙ్ముఖత్వం ప్రత్యాహారః"
శబ్ద స్పర్శాది విషయములయందు చరించు ఇంద్రియములను బలవంతముగ వాపసు తీసుకొనుట ప్రత్యాహారము, ఏమేమి చూచుచున్నాడో అది యంతయు నేనేయని భావించుట ప్రత్యాహారము, నిత్యము చేయబడుచున్న శాస్త్రసమ్మతమైన కర్మయొక్క ఫలమునకు తాను కర్త కాకుండుట ప్రత్యాహారము, సర్వవిషయములయందు విముఖుడగుట ప్రత్యాహారము. (శాండిల్యోపనిషత్తు ౧ అ)

విషయేష్వాత్మతాం దృష్ట్వా మనసశ్చిత్తరంజకమ్।
ప్రత్యాహార స్స విజ్ఞేయోఽభ్యసనీయోముహుర్ముహుః॥ (తేజోబిందూపనిషత్తు)
ప్రత్యాహారమనగా – ఇంద్రియగోచరములగు సకలవిషయములు బ్రహ్మస్వరూపమే యను దృష్టితో చూచుచుండుట యగును. ఇట్టి ప్రత్యాహారమును సర్వదా అభ్యసించుచుండవలయును.

" చిత్తస్యాంత ర్ముఖీభావః ప్రత్యాహారస్తు సత్తమ " – ఓ సత్పురుషా! మనస్సు బాహ్య వ్యాపారములకు వ్యాపింపక అంతర్ముఖముగా దిరుగుట ప్రత్యాహారము (త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్తు ౩౦ శ్లో)

లభతే యోగయుక్తాత్మా పురుషస్తత్పరం పదమ్।
కూర్మఃస్వపాణిపాదాది శిరశ్చాత్మని ధారయేత్ ॥
ఏవంద్వారేషు సర్వేషు వాయుపూరిత రేచితః।
నిషిద్ధంతు నవద్వారే ఊర్ధ్వం ప్రాఙ్నిశ్వసంస్థా॥ (యోగతత్త్వోపనిషత్తు ౧౪౦–౧౪౧ శ్లో)
తాబేలు తన కర చరణాదులను, శిరమును తనయందే ధరించుచున్నది. అదే విధముగా యోగీశ్వరుడు నవద్వారములయందు రేచక పూరకములచే నిషేధింపబడిన నవద్వారబంధురమైన శరీరమునందు వాయువును ఊర్ధ్వముగా ముందు ఎక్కించుచు అట్లే మోక్షపదమును పొందుచున్నాడు.

విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః ।
రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥౫౯॥

నిరాహారస్య = విషయాహారములేని, **దేహినః** = దేహికి (పురుషునకు), **రసవర్జం** = విషయ (రసం)వాసన తప్ప, **విషయాః** = విషయానుభవములు, **వినివర్తంతే** = నివర్తించుచున్నవి, **అస్య** = ఇతనియొక్క, **రసః అపి** = విషయానురాగమున్ను, **పరం దృష్ట్వా** = పరమాత్మస్వరూప సాక్షాత్కారము గలిగిన పిమ్మట, **నివర్తతే** = నివృత్తియగుచున్నది.

తాత్పర్యము– విషయాహారము లేని పురుషునకు విషయానుభవములు నివర్తించుచున్నవి. కాని విషయములలో గల వాసన నశించుటలేదు. దైవరసము గలుగునప్పుడే విషయరసము నశించును. కావున ఇతనియొక్క విషయ వాసన (విషయానురాగము) పరమాత్మస్వరూప సాక్షాత్కారము గలిగినప్పుడు సంపూర్ణముగా నశించును.

వివరణ – ఇంద్రియములకు విషయములు ఆహారము. ఇక్కడ ఆహారమనగా ఇంద్రియములు గ్రహంచే విషయార్థములు. కనుక ఇటువంటి ఆహారములేని యెడల, ఇంద్రియములకు విషయానుభవము కలుగదు. విషయానుభవము నివృత్తములగుచున్నవి. కాని వాని యందున రసము అనగా రాగము – ఆసక్తి ,అభిలాష (

దీనినే వాసన అంటాము) నివృత్తి చెందుటలేదు. ఈ విషయరసము నందు ఆసక్తి నశించనంతకాలము వాసన రూపేన ఇంద్రియవృత్తులు మళ్ళీ మళ్ళీ మొలకెత్తుతూ విషయములవైపే పరుగులెత్తుచుండును. ఆసక్తి వేరు, అనుభవించుట వేరు– ఆసక్తి యొక్క కార్యము అనుభవించుట. నీవు విషయములను (విషయానుభవములను) వదిలిపెట్టినప్పుడు ఇంద్రియవృత్తుల ప్రవాహము నిగ్రహింపబడును, కాని నీయందు విషయరసానురక్తి నిలిచియుండును. కనుక ఈ విషయరసము నందు ఆసక్తి పరమాత్మ సాక్షాత్కారముచే సంపూర్ణముగా నశించును. దీనినే వాసనాక్షయమందురు. ఆహారమైన విషయానుభవములేని జీవునకు ఇంద్రియముల వృత్తిని ఉపసంహరించుకొనిన దేహికి విషయములు తొలగుచున్నవి. అనురాగసశూన్యమైన పరమాత్మ తత్త్వమును దర్శించుటచే అతనికి విషయములయందలి అనురాగముకూడ ఉడిగిపోవుచున్నది. ఆత్మసాక్షాత్కారము పొందినయోగికి విషయవాసన సంపూర్ణముగా నశించును.

“ శృంగారాదౌ, విషే, వీర్యే, గుణే, రాగే, ద్రవేరసః॥ రస్యత ఇతిరసః రస ఆస్వాదనే ” – రస శబ్దము శృంగారాది రసములకును, విషమునకును, బలమునకును, మధురాది షడ్రసములకును, అనురాగమునకును, ద్రవమునకును పేరు. రసమనగా రాగము. రసనమనగా ఆస్వాదించువృత్తి. (అమర నానార్థ ౨౨౮ శ్లో)

జిహ్వయాతి ప్రమాథిన్యా జనోరస విమోహితః।
మృత్యుమృచ్ఛ త్యసద్బుద్ధిర్మీనస్తు బడిశైర్యథా॥ (భాగవత ౧౧ స్కం. ౮ అధ్యా ౧౯ శ్లో)

చేప మనోవ్యాకులకారణమైన జిహ్వేంద్రియ చాపల్యముచే గాలములకు తగులుకొని యెట్లు మరణించుచున్నదో అట్లే పరమాత్మతత్త్వమునందు బుద్ధి నిలుపని మనుష్యుడు రసమోహితుడై మృత్యువును పొందుచున్నాడు.

ఇంద్రియాణి జయంత్యాశు నిరాహార మనీషిణః।
వర్జయిత్వాతు రసనం తన్నిరస్య న్నవర్ధతే॥ (భాగవత ౧౧ స్కం. ౮ అధ్యా ౨౦ శ్లో)

విషయార్థముల గైకొనని బుద్ధిమంతులు రసనమును (ఆస్వాదనమును) వర్జించి శీఘ్రముగా ఇంద్రియముల జయించుచున్నారు. రసనము నిరసింపబడిన మరల వృద్ధినొందదు.

తావజ్జితేంద్రియో నస్యాద్విజితాన్యేంద్రియః పుమాన్।
వజయేద్రసనం యావజ్జితం సర్వం జితేరసే॥ (భాగవత ౧౧ స్కం. ౮ అధ్యా ౨౧ శ్)

పురుషుడు ఎంతవఱకు రసనమును (విషయాస్వాదవృత్తిని) జయింపడో అంతవఱకు తక్కిన ఇంద్రియముల గెల్చినను విజితేంద్రియుడు కాడు. విషయానురాగము జయింపబడినప్పుడు సర్వము జయింపబడుచున్నది.

పరిగ్రహేషు వైరాగ్యం, ప్రాయో మూఢస్య దృశ్యతే।
దేహ విగళితాఽఽశస్య, క్వ రాగః? క్వ విరాగతా?॥ (అష్టావక్రసంహిత– ౧౮–౬౨)

దేహాత్మాభిమాని యగు మూఢునికి, దేహాభిమానమునకు అవసరములగు పరిగ్రహణము(భోగము)లందు వైరాగ్యము కన్పించుచున్నది. కాని దేహమున ఆశ, నిశ్శేషముగ అంతరించిన వానికి రాగవిరాగము లెక్కడివి? ఈ రాగవిరాగములు రెండును శరీరానురాగము నుండియే జనించుచున్నవిగదా!

విస్తారితం మకరకేతన ధీవరేణ స్త్రీసంజ్ఞితం బడిశమత్ర భవాంబురాశౌ।
తేనాచిరాత్తదధరామిషలోల మర్త్య మత్స్యాన్వికృష్య స పచత్య రాగావహ్నౌ॥ (శ్రీభర్తృహరి ౨–౪౨)

సంసారసాగరమున మన్మధుడను బెస్తవానిచే స్త్రీ యను గాలము విడువబడినది. అధరామృతమనెడు మాంసమున కాశపడిన నరులనెడి చేపలను సత్వరముగ బట్టుకొని అనురాగమను అగ్నిలో అతడు పాకము చేయుచున్నాడు.

యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః ।

ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః ॥౬౦॥

హే కౌంతేయ! = ఓ అర్జునా!, **యతతః** = యత్నించుచున్న, **విపశ్చితః** = విద్వాంసుడైన, **పురుషస్య** = పురుషునియొక్క, **మనః అపి** = మనస్సును గూడ, **ప్రమాథీని** = క్షోభమును గలుగజేయునట్టి, **ఇంద్రియాణి** = ఇంద్రియములు, **ప్రసభం** = బలాత్కారముగ, **హరంతి హి** = హరించుచున్నవిగదా!

తాత్పర్యము– ఓ అర్జునా! యత్నించుచున్న విద్వాంసుడైన పురుషునియొక్క మనస్సును గూడ క్షోభమును గలుగజేయునట్టి ఇంద్రియములు బలాత్కారముగ హరించుచున్నవిగదా!

వివరణ – విషయములయందు గల రసాస్వాదనే ఇంద్రియములకు అమితమైన బలం. ఆ రసాస్వాదన ఉన్నంతవరకు పురుషుడు ఎంత తెలివిగలవాడేయైనను, ఇంద్రియనిగ్రహమునకై ప్రయత్నించు వాడేయైనను కలతపెట్టు స్వభావముగల ఇంద్రియములు మనస్సును బలవంతముగ హరించుచున్నవి. దీనికి కారణము విషయములయందుండిన రసాసక్తి. ఈ రసాసక్తి మనస్సులో ఉన్నంతకాలము మానవుడు ఎంత నిగ్రహముతోనున్నను ఇంద్రియములు అతని మనస్సును బలాత్కారముగ లాగుచున్నవి. దీనికి కారణము ఇంద్రియవిషయములయందు గల రసాసక్తి మనస్సు నందు మిగిలియుండడమే. **“ఇంద్రియవిషయములను నిగ్రహించినను ఆ విషయములయందు గల రసాసక్తి మనస్సునందు అలాగే ఉండిపోయినందున ఇంద్రియములు మనస్సును మరల మరల విషయములవైపు బలాత్కారముగ లాగుచున్నవి.”**

మాత్రా స్వస్రా దుహిత్రావా న వివిక్తాసనోభవేత్।
బలవానింద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి॥ (మనుస్మృతి ౨. అధ్యా)

ఇంద్రియసమూహము బలిష్ఠమైనది. విద్వాంసుడనైనను ప్రక్కలించును. (అందువలన) తన తల్లితోనైనను, సోదరితోనైనను, పుత్రికతోనైనను ఏకాంతమున గూర్చుండరాదు అని ఇంద్రియ నిగ్రహము చేయువారలకు అజాగ్రత్త వలదని హెచ్చరిక ఇచ్చుచున్నాడు.

తస్మాదేతామహం త్యక్త్వా బ్రహ్మణ్యాధాయ మానసమ్।
నిర్ద్వంద్వో నిరహంకార శ్చరిష్యామి మృగైస్సహ॥ (భాగవతము ౯ స్కం. ౧౯ అ. ౧౯ శ్లో)

“అందువలన నేను ఈ విషయాభిలాష వదులుకొని పరబ్రహ్మమునందు మనస్సును నిలిపి సుఖదుఃఖాది ద్వంద్వములను, అహంకారము లేనివాడనై మృగములతోగూడి చరించుచుందును ” అని యయాతి మహారాజు చెప్పెను. కనుక ఉత్తమాధికారియైన గురువుచే యమనియమాది యోగాంగముల శాస్త్రోక్తరీతిగ అభ్యసించి ఇంద్రియనిగ్రహమునకై ప్రయత్నించవలెను.

తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।
వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥౬౧॥

యుక్తః = యోగసాధన గలవాడు, **సర్వాణి** = సమస్తములైన, **తాని** = అట్టి ప్రమాదకరములగు సకలేంద్రియములను, **సంయమ్య** = చక్కగా వశపరచుకొని, **మత్పరః** = మత్పరాయణుడవై (నాయందాసక్తమైన చిత్తము గలవాడై), **ఆసీత** = ఉండవలెను, **హి** = ఏలననగా, **యస్య** = ఎవనియొక్క, **ఇంద్రియాణి** = ఇంద్రియములు, **వశే** = స్వాధీనమందున్నవో, **తస్య** = వానియొక్క, **ప్రజ్ఞా** = జ్ఞానము, **ప్రతిష్ఠితా** = సుస్థిరమైనది.

తాత్పర్యము– యోగసాధన గలవాడు సమస్తములైన అట్టి ప్రమాదకరములగు సకలేంద్రియములను చక్కగా వశపరచుకొని మత్పరాయణుడవై (నాయందు అనగా పరమాత్మయందు ఐక్యపరచిన చిత్తము గలవాడై) ఉండవలెను. ఏలననగా ఎవనియొక్క ఇంద్రియములు స్వాధీనమందున్నవో వానియొక్క జ్ఞానము సుస్థిరమైనది. అతడు స్థితప్రజ్ఞుడనబడును.

వివరణ – ఇంద్రియములన్నటిని వశపరచుకొని అణకువగనున్నవాడై సకలమునకును అంతర్యామినైన(లోనున్న), ఆత్మనైన, వాసుదేవుడనైన నాయెడ ఆసక్తి గలవాడై నిలువబడవలెను. "నేను అతనికంటె వేరుకాను " అని గ్రహించియుండవలేనని అర్థము. ఇట్లున్నట్టి ఏ యతికి తన ఇంద్రియములు అభ్యాసమువలన వశమునందున్నవో అతని జ్ఞానము నిలకడచెందినది.
ఇంద్రియములను విషయములనుండి మరలించి, భగవత్పరముచేసి, సేవ, పూజ, యనునట్టి ఆహారము పెట్టవలెయును. అనగా మనస్సును భగవద్ధ్యానములో ఉంచవలెయును. భగవంతుని జన్మగుణకర్మ వైభవములను ఆ మనస్సుకు సదా బోధించుచుండవలయును. ఎందుకనగా ఇంద్రియములకు విషయములనే విషాహారమును పెట్టుటకంటె, భగవత్సేవామృతాహారమును పెట్టినయెడల, ఇక ఈ విషయములవైపు అవి చూడవుగదా! కులశేఖర మహారాజు, తామ రచించిన ముకుంద మాలలో ఇట్లు చెప్పియున్నారు. **"జిహ్వేకీర్తయ కేశవం మురరిపుం చేతో భజ శ్రీధరం। పాణిద్వంద్వసమర్చ యాచ్యుత కథాశ్రోత్రద్వయ త్వం శ్రుణు। కృష్ణం లోకాయ లోచన ద్వయ హరేర్గచ్ఛాంఘ్రీ యుగ్మాలయం। జిఘ్రఘ్రాణ ముకుంద పాదతులసీం మూర్ధాన్న మాధోక్షజమ్॥"**– ఓ జిహ్వా! కేశవుని కీర్తింపుము. ఓ మనసా! ఆ శ్రీధరున్ని భజింపుము, స్మరింపుము, ధ్యానింపుము. ఓ చేతులారా! అచ్యుతున్ని అర్చింపుము, పూజింపుము. ఓ చెవులారా! అచ్యుత కథామృతమును సదా ఆలకించుడు. ఓ నేత్రములారా! ఆ శ్రీ కృష్ణ భగవానుని దర్శించుడు. ఓ పాదములారా! శ్రీహరి ఆలయములకు పొండు. ఓ నాసికమా! ముకుందపాదసమర్పిత తులసిని వాసన జూడుము. ఓ శిరమా! మాధవుని పాదపద్మములకు నమస్కరించుము. ఈ విధముగా ఇంద్రియములకు భగవత్సేవామృతాహారమును పెట్టినయెడల విషయరసము నశించి, విషయములవైపుకు ఇంద్రియములు చూడవు.
భాగవతములో నారదభగవానులు వ్యాసమహర్షికి ఇలా బోధించియున్నారు. **"యమ నియమాది యోగముల నాత్మ నియంత్రితముయ్యు, కామరోషముల ప్రచోదితంబయగు శాంతి వహింపదు. విష్ణుసేవచే క్రమమున శాంతి గైకొనిన కైవడి"** – యమనియమాది యోగములవలన మనస్సు ఇంద్రియములు నియంత్రింపబడును. కాని శాంతి వహింపదు. విష్ణుసేవచే శాంతి గైకొనబడును. కనుక ఇంద్రియములకు భగవత్సేవారూపమైన ఆహారమును కడుపునిండుగ సదా పెట్టుచుండవలయును. అప్పుడు ఇంద్రియములు అన్నియును శాంతివహించి యుండగలవు. ఈ విధముగ ఇంద్రియములను వశముచేసుకొని శాంతింపచేసినవాని బుద్ధి పరమాత్మయందు చలించక స్థిరముగ ఉండును.
ఆత్మ ప్రసన్నత లేకున్న ఇంద్రియ నిగ్రహము కాదు. ఇంద్రియనిగ్రహము లేకున్న ఆత్మ ప్రసన్నత కలుగదు. ఈ రెండు ఒకటేసారి ఒకటే క్రియాసూత్రమువలన లభింపవలయునే కాని వేఱు వేఱు సూత్రముల వలన లభించునవికావు.(అన్నపూర్ణోపనిషత్తు ౪ అ. ౭౮–౮౦ శ్లో)
యస్తువిజ్ఞానవాౘ భవతి యుక్తేన మనసా సదా।
తస్యేంద్రియాణి వశ్యాని సదశ్వా ఇవసారధేః॥
యస్తువిజ్ఞానవాన్ భవతి సమనస్కస్సదాశుచిః।

సతు తత్పద మాప్నోతి యస్మాద్భూయో నజాయతే (కఠోపనిషత్తు ౩ వల్లి ౬,౮ శ్లో)
ఎవడైతే యెల్లప్పుడు యోగసక్తమైన మనస్సుతో జ్ఞానయోగియై యున్నాడో అతని ఇంద్రియములు సారధికి వశ్యములగు మంచి గుఱ్ఱములవలె వశ్యములగుచున్నవి. ఎవడైతే జ్ఞానయోగియై మనస్సుతో గూడి యెల్లప్పుడు పరిశుద్ధుడైయున్నాడో అతడు పుణర్జన్మములేని మోక్షస్థానమును పొందుచున్నాడు. ఇందువలన జ్ఞానశిద్ధి, ఇంద్రియనిగ్రహము వేఱువేఱుగ లేవని తెలియుచున్నది.

ధ్యాయతో విషయాన్పుంసః సంగస్తేషూపజాయతే ।
సంగాత్సంజాయతే కామః కామాత్క్రోధోఽభిజాయతే ॥౬౨॥
క్రోధాద్భవతి సంమోహః సంమోహాత్స్మృతివిభ్రమః ।
స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి ॥౬౩॥

విషయాన్ = విషయములను, **ధ్యాయతః** = చింతించుచున్న, **పుంసః** = పురుషునకు, **తేషు** = ఆ విషయములయందు, **సంగః** = సంగము (ఆసక్తి), **ఉపజాయతే** = పుట్టుచున్నది, **సంగాత్** = అట్టి సంగము(ఆసక్తి)వలన, **కామః** = ఆశ(కోరిక), **సంజాయతే** = గలుగుచున్నది, **కామాత్** = కోరికవలన, **క్రోధః** = క్రోధము(కోపము), **అభిజాయతే** = కలుగుచున్నది. **క్రోధాత్** = కోపమువలన, **సమ్మోహః** = మోహము(అవివేకము), **భవతి** = గలుగుచున్నది, **సమ్మోహాత్** = అవివేకమువలన, **స్మృతివిభ్రమః** = స్మృతి(మతి)భ్రమగలుగుచున్నది, **స్మృతిభ్రంశాత్** = మతిభ్రమవలన, **బుద్ధినాశః** = బుద్ధినాశము సంభవించుచున్నది, **బుద్ధినాశాత్** = బుద్ధినాశమువలన, **ప్రణశ్యతి** = నశించుచున్నాడు.

తాత్పర్యము– విషయములను చింతించుచున్న పురుషునకు ఆ విషయములయందు సంగము (ఆసక్తి) పుట్టుచున్నది అట్టి సంగము(ఆసక్తి)వలన ఆశ(కోరిక) గలుగుచున్నది. కోరికవలన క్రోధము(కోపము) కలుగుచున్నది. కోపమువలన మోహము(అవివేకము) గలుగుచున్నది అవివేకమువలన స్మృతి(మతి)భ్రమగలుగుచున్నది. మతిభ్రమవలన బుద్ధినాశము సంభవించుచున్నది. బుద్ధినాశమువలన నశించుచున్నాడు.

వివరణ – చెడిపోవువాని అనర్థములన్నిటికిని కారణము, విషయములను చింతించుటయే యనునది ఇక్కడ చెప్పబడినది. శబ్దాది విషయములను చింతించుచుండు పురుషునకు ఆ విషయములయందు ఆసక్తి కలుగుచున్నది. ఆ ఆసక్తి వలన విషయములను అనుభవింపవలయునను కామము– కోరిక(ఆశ) కలుగుచున్నది. ఆ కోరికకు విఘ్నము కలిగినయెడల క్రోధము కలుగుచున్నది. క్రోధము వలన అంతఃకరణములో కర్తవ్యాకర్తవ్యనిర్ణయము చేసెడి వివేకము నశించును. యుక్తాయుక్త వివేకములేని అవివేకము వలన మతిభ్రమ గలుగుచున్నది. మతిభ్రమ వలన మనోవైకల్యరూపమైన మోహము కలుగుచున్నది. వివేకము నశించు స్థితినే సమ్మోహము లేక మోహమందురు. ఈ మోహము వలన నీతి నియమములను, ధర్మములను జ్ఞప్తికి తెచ్చెడి స్మృతి నశించుచున్నది. స్మృతి నశించుట చేత చేయదగిన కార్యమేదో, చేయరాని కార్యమేదో, తన కర్తవ్యమేదో యెఱుగు బుద్ధి బలము నశించుచున్నది. బుద్ధిబలము నశించిన పురుషుడు మిక్కిలి చెడిపోవుచున్నాడు.
కర్మణా దేహమాప్నోతి దేహి కామేన వర్ధతే।

కామాల్లోభాభిభూతశ్చ లోభాత్క్రోధపరాయణః॥
క్రోధాచ్చ ధర్మనాశస్స్యాద్ధర్మనాశాన్మతిభ్రమః।
ప్రణష్టబుద్ధిర్మనుజః పునః పాపం కరోతి చ॥ (బృహన్నారదీయపురాణము ౩౦ అధ్యా)
దేహికి (జీవునికి) కర్మమువలన దేహము గలుగుచున్నది. (జీవునికి) కామము (ఆశ) వృద్ధి పొందుచున్నది. (అనగా కామముచేత లోకవ్యాపారములను జేయుచున్నాడు.) కామము చేత లోభము గలుగుచున్నది. లోభము వలన క్రోధము(కోపము) కలుగుచున్నది. క్రోధము వలన ధర్మము నశించుచున్నది. ధర్మనాశమువలన మతిభ్రమగలుగుచున్నది. మతిభ్రమచెందిన మనుష్యుడు మరల పాపమును జేయుచున్నాడు.

రాగద్వేషవిముక్తైస్తు విషయానింద్రియైశ్చరన్ ।
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి ॥౬౪॥

, **విధేయాత్మా తు** = మనస్సును స్వాధీనమందుంచుకొన్న యోగయుక్తుడు, **ఆత్మవశ్యైః** = తనకు వశీభూతములుగా నుండునట్టియు, **రాగద్వేషవియుక్తైః** = రాగద్వేషాదులు లేనట్టివియునైన, **ఇంద్రియైః** = ఇంద్రియములచేత, **విషయాన్** = విషయములయందు, **చరన్** = చరించుచున్నవాడైనను (అనుభవించుచున్నవాడైనను), **ప్రసాదం** = చిత్తశాంతిని (పరమశాంతిని), **అధిగచ్ఛతి** = పొందుచున్నాడు

తాత్పర్యము- మనస్సును స్వాధీనమందుంచుకొన్న యోగయుక్తుడు తనకు వశీభూతములుగా నుండునట్టియు, రాగద్వేషాదులు లేనట్టివియునైన ఇంద్రియములచేత విషయములయందు చరించుచున్నవాడైనను చిత్తశాంతిని పొందుచున్నాడు.

వివరణ – ఇంద్రియములను వశమునందుంచుకొనిన సాధకుడు రాగద్వేషరహితుడై, ఇంద్రియములద్వారా విషయములను గ్రహించుచున్నను ప్రశాంతతను పొందుచున్నాడు. ఇంద్రియములను , మనస్సును పూర్తిగా వశపరచుకొని మత్పరాయణుడై సర్వేంద్రియ వృత్తులను నా కైకంర్యమునందు వినియోగించుచు సచ్చిదానంద పరబ్రహ్మమును, కళ్యాణ గుణ పరిపూర్ణుడను, వాత్సల్యమహోదధిని అయిన నా సాక్షాత్కారమును పొందుటచే విషయ(రసము)- ఆసక్తి కూడ నివర్తించినట్టి స్థితప్రజ్ఞుడు ప్రపంచము నందు సంచరించుచు విషయములను అనుభవించుచున్నవాడైనను అతని భగవదనుభవమునకును పరమశాంతికిని ఏ మాత్రము ప్రతిబంధకముండదు. రాగద్వేషాదులు వదిలిన ఆత్మనిష్ఠాపరులైన యోగీశ్వరులు తనకు వశపడిన ఇంద్రియములచే విషయముల ననుభవించినను బద్ధులు కారని భావము.
ఇంద్రియై రింద్రయార్థాయ శ్చరత్యాత్మ వశ్యైరిహ।
అసజ్జమాన శ్శాంతాత్మ నిర్వకార స్సమాహితః॥ (భారతము శాంతి. ౩౩౦-౧౫)
విషయభోగాదులయందు అసక్తుడు కాక, షడ్భావవికారములజెందక చిత్తోపశమముగాంచి ప్రసన్న మనస్కుడై తనకు వశపడిన ఇంద్రియములతో లోకములో ఎవడైతే విషయముల ననుభవించుచున్నాడో అతడు స్థితప్రజ్ఞుడు.

ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే ।
ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే ॥౬౫॥

ప్రసాదే = మనోనిర్మలత గలుగుచుండగా, **అస్య** = ఈ బ్రహ్మనిష్ఠునికి, **సర్వదుఃఖానాం** = సమస్త దుఃఖముల యొక్క, **హానిః** = నాశము, **ఉపజాయతే** = కలుగుచున్నది, **ప్రసన్నచేతసః** = నిర్మలమైన చిత్తము గలవానికి, **ఆశు** = శీఘ్రముగా, **బుద్ధిః** = బుద్ధి (మతి), **పర్యవతిష్ఠతే హి** = నిలకడగలదగుచున్నదికదా!

తాత్పర్యము– మనోనిర్మలత గలుగుచుండగా ఈ బ్రహ్మనిష్ఠునికి సమస్త దుఃఖముల యొక్క నాశము కలుగుచున్నది. నిర్మలమైన చిత్తము గలవానికి శీఘ్రముగా బుద్ధి (మతి) నిలకడగలదగుచున్నదికదా!

వివరణ – మనోనిర్మలత్వము వలన అతని దుఃఖములన్నియును నశించును. ప్రసన్నచిత్తుడైన కర్మయోగియొక్క బుద్ధి అన్ని విషయముల నుండియు వైదొలగి, పరమాత్మయందు మాత్రమే పూర్తిగా స్థిరమగును. సత్ప్రాప్తి కలిగిన యోగీశ్వరుని యొక్క ఆధ్యాత్మికము మొదలైన దుఃఖములన్నిటికి వినాశము సంభవించుచున్నది. స్వస్థచిత్తుడైన శుద్ధాంతఃకరణము గలవాని బుద్ధి సత్వరముగ స్థిరపడపచున్నది. ఇట్లు మనస్సు ప్రసన్నమై బుద్ధినిలకడ జెందినవానికి పురుషార్థము చేకూరుచున్నది.

చిత్తము నిర్మలమైనదైనచో సకల దుఃఖములు నశించిపోవును. మఱియు నిర్మలమైన చిత్తము గలవానికి త్వరలో ధ్యానమందు నిలుకడ గలుగును. అతని బుద్ధి సుస్థిరమగును. ఎలాంటి అలజడులు లేని నిర్మలోదకము గల పాత్రయందు సూర్యప్రతిబంబము స్పష్టముగ కనిపించునట్లు విశుద్ధాంతఃకరణము గలవారికి ధ్యేయమగు ఆత్మసాక్షాత్కారము కలుగును.

చిత్తస్య హి ప్రసాదేన హంతి కర్మ శుభాశుభమ్।
ప్రసన్నాత్మాత్మని స్థిత్వా సుఖమక్షయ మశ్నుతే॥ (మైత్రేయోపనిషత్తు)

చిత్తము స్వాదీనమగుటచే (యోగీశ్వరుడు) శుభాశుభ రూపమైన కర్మను నిర్మూలించుచున్నాడు. ప్రసన్న చిత్తుడై తన ఆత్మయందు తాను నిశ్చలుడై యెన్నటికిని తఱుగని సుఖమును (అక్షయ సుఖమును) అనుభవించుచున్నాడు.

యానిదుఃఖాని యాతృష్ణా దుస్సహాయే దురాధయః।
శాంతిచేతః సు తత్సర్వం తమోర్కేష్వివ నశ్యతి॥ (మహోపనిషత్తు ४ అధ్యా ७८ శ్లో)

సూర్యోదయము కాగా చీకటి నశించిపోయినట్లు చిత్తము శాంతించిన పురుషులయందు సమస్త దుఃఖములు, తృష్ణ, ఆశయు, సహింపరాని అనేక సంకటములును సర్వమూ నశించుచున్నది.

చిత్తప్రసాదేన యతిర్జహాతీహ శుభాశుభమ్।
ప్రసన్నాత్మాత్మని స్థిత్వా సుఖమత్యంత మశ్నుతే॥ (భారత.శాంతి ౨४౬ అధ్యా. ౧౦)

చిత్తము శాంతించుటచేత యతీశ్వరుడు లోకములో శుభాశుభ కర్మఫలములను అతిక్రమించుచున్నాడు. ప్రసన్నచిత్తుడైన యోగీశ్వరుడు తన ఆత్మయందు తాను నిలిచి అతిశయమైన సుఖమును అనుభవించుచున్నాడు.

భిద్యతేహృదయగ్రంథి శ్ఛిద్యంతే సర్వసంశయాః।
క్షీయంతేచాస్య కర్మాణి తస్మిౝ దృష్టే పరావరే॥ (ముండకోపనిషత్తు ౨-౨-౮)

పరావర స్వరూపమైనట్టి పరమాత్మను సందర్శించినంతనే జీవునకు (అవిద్యా) హృదయగ్రంథి ఛిన్నమైపోవుచున్నది. సంశయములన్నియు తొలగిపోవుచున్నవి. సుకృత దుష్కృత కారణములైన కర్మలన్నియు నశించిపోవుచున్నవి.

తద్యథాప్రియయాస్త్రియా సంపరిష్వక్తో నబాహ్యం కించన వేదనాంతర మేవ మేవాయం పురుషప్రాజ్ఞేనాత్మనా సంపరిష్వక్తోనబాహ్యంకించన వేదనాంతరమ్।– ప్రియురాలైన స్త్రీచే లెస్సగ కౌగలింపబడిన పురుషుడు బాహ్యాంతరములను కొంచమైనను ఎట్లు తెలిసికొనకుండునో , అదే ప్రకారముగా విజ్ఞాన స్వరూపమైన పరమాత్మచే బాగుగా కౌగిలింపబడిన పురుషుడు గూడ బాహ్యాంతర సుఖదుఃఖరూపమైన ప్రపంచమును కొంచెమైనను తెలిసికొనకుండును. (బృహదారణ్యకోపనిషత్తు ౪ అ. ౩బ్రా ౨౧ శ్లో)

నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా ।
న చాభావయతః శాంతిరశాంతస్య కుతః సుఖమ్ ॥౬౬॥

అయుక్తస్య = మనోనిగ్రహము లేనివానికి, **బుద్ధిః** = శుద్ధమైన లేక స్థిరమైన మనస్సు, **న అస్తి** = గలుగదు. మఱియు, **అయుక్తస్య** = మనోనిగ్రహము లేనివానికి, **భావనా చ** = ఆత్మజ్ఞానమందు ప్రవేశమున్ను, **న** = గలుగదు, **అభావయతః** = ఆత్మభావన లేనివానికి, **శాంతిః చ** = శాంతియును (ప్రకృతిశమనమున్ను), **న** = కలుగదు, **అశాన్తస్య** = శాంతి లేనివానికి, **సుఖం** = ఆత్మసుఖము, **కుతః** = ఎక్కడిది?

తాత్పర్యము– మనోనిగ్రహము లేనివానికి శుద్ధమనస్సు లేక స్థిరమైన బుద్ధిస గలుగదు. మఱియు మనోనిగ్రహము లేనివానికి ఆత్మజ్ఞానమందు ప్రవేశమున్ను గలుగదు. ఆత్మభావన లేనివానికి శాంతియును (ప్రకృతిశమనమున్ను) కలుగదు. శాంతి లేనివానికి ఆత్మసుఖము ఎక్కడిది?

వివరణ – యోగయుక్తుడు గానివానికి వివేకములేదు. యోగయుక్తుడు గానివానికి ఆత్మభావనయును లేదు. అట్టి ఆత్మభావశూన్యునకు శాంతిలేదు. శాంతి లేనివానికి సుఖము ఎట్లు లభించును.
అయుక్తుడు అనగా మనస్సమాధానములేనివాడు, ఇంద్రియములను, మనస్సును నిగ్రహించలేనివాడు. మనస్సు నిలుకడచెందని అయుక్తునికి బుద్ధిబలముండదు. అనేకరకములైన భోగవాసనలచే ఇట్టివాని మనస్సునకు విక్షేపదోషము కలుగును. ఈ స్థితిలో బుద్ధి కర్తవ్యాకర్తవ్యములను నిర్ణయించుకొనగల శక్తిని కోల్పోవును. కనుక ఇట్టివాని బుద్ధి పరమాత్మధ్యానములో స్థిరముగ నిలువదు. ఇట్టి వానికి పరమాత్మయందు నిశ్చయాత్మక బుద్ధి ఉండదు. ఆత్మస్వరూపమునుగూర్చియు జ్ఞానము గలుగదు. ఆత్మ నెఱుంగుటలో మిక్కిలి ఆతురత కలుగదు. పరమాత్మ తత్వనిరూపణ జ్ఞానముగూడ ఉండదు. ఆత్మనెఱుంగుటలో మిక్కిలి ఆతురత లేనివానికి, పరమాత్మ తత్త్వమును అనుభూతి జెందనివానికి రాగాదులు శమించి ఉపశమనము గలుగుటలేదు. అట్లు రాగాదులు శమింపనివానికి, ఉపశమనము లేనివానికి సుఖమెక్కడిది? ఇంద్రియములు విషయానుభవాసక్తినుండి నివర్తించుటయేగదా సుఖము. విషయములనుగూర్చిన ఆసక్తి దుఃఖమేగదా? విషయాసక్తి గలచోటున ఆత్మానుభూతి గలుగదని భావము.

మనోనిగ్రహము లేనివానికి నిరంతర పరమాత్మ భావన లేదా ధ్యానము కుదరదు. ధ్యానము కుదరని వానికి అపరోక్షజ్ఞానమూ కలుగదు. అపరోక్షజ్ఞానము కలుగని వానికి శాంతి లేదు. శాంతిలేనివానికి సుఖమెక్కడిది?
యథాగ్నిర్దారు మధ్యస్థో నోత్తిష్ఠేన్మథనంవినా।
వినాచాభ్యసయోగేన జ్ఞానదీపస్తథానహి॥ (యోగకుండల్యుపనిషత్తు ౩.అధ్యా)
కొయ్యను చిలుకకున్న ఆ కొయ్యయందలి యగ్ని యెట్లు వెల్లడిగ ప్రకాశింపదో అట్లే అభ్యాసయోగములేకున్న జ్ఞానదీపముకూడ ప్రకాశింపదు.

ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽనువిధీయతే ।
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివాంభసి ॥౬౭॥

హి = ఏలననగా, **చరతాం** = విషయములయందు ప్రవర్తించుచున్న, **ఇంద్రియాణాం** = ఇంద్రియములను, **యత్** = ఏ, **మనః** = మనస్సు, **అనువిధీయతే** = అనుసరించి ప్రవర్తించుచున్నదో, **తత్** = ఆ మనస్సు, **అస్య** = ఈ మనోనిగ్రహము లేనివానియొక్క, **ప్రజ్ఞాం** = వివేకజ్ఞానమును, **వాయుః** = గాలి, **అంభసి** = ఉదకమునందు (సముద్రమునందు) **నావం ఇవ** = ఓడను వలె, **హరతి** = హరించుచున్నది

తాత్పర్యము– ఏలననగా విషయములయందు ప్రవర్తించుచున్న ఇంద్రియములను ఏ మనస్సు అనుసరించి ప్రవర్తించుచున్నదో ఆ మనస్సు ఈ మనోనిగ్రహము లేనివానియొక్క వివేకజ్ఞానమును గాలి ఉదకమునందు (సముద్రమునందు) ఓడను వలె హరించుచున్నది

వివరణ – చరించుచున్న ఇంద్రియార్థములయందు ఏ మనస్సు అనుసరించి ప్రవర్తించుచున్నదో, అట్టిమనస్సు ఈ మనుజుని యొక్క విచక్షణాశక్తిని నీటియందు ఓడను గాలివలె హరించుచున్నది. యోగికానివానికి సుఖము లేకపోవుటకు కారణమేమనిన విషయార్థములయందు చరించు ఇంద్రియములరీతి ననుసరించి మనస్సు వర్తించును. స్థిరమైన ఆధారములేక జలములో తేలుచుండు ఓడను వాయువు హరించునట్లు ఇంద్రియనిగ్రహము లేనివాని బుద్ధిని ఇంద్రియములతోగూడిన మనస్సు హరించుచున్నది.

నిర్గుణే బ్రహ్మణి మయి ధారయన్ విశదం మనః।
పరమానంద మాప్నోతి యత్రకామోఽవ సీయతే॥ (భాగవతము ౧౧ స్కం. ౧౫ అధ్యా ౧౭ శ్లో)

ఎచ్చటనైతే కామము (కోరిక) క్షీణించుచున్నదో అట్టి యస్మచ్ఛబ్ద లక్ష్యార్థమైన నిర్గుణ పరబ్రహ్మ తత్త్వమునందు నిర్మలమైన మనస్సును నిలుపుచు శ్రేష్ఠమైన ఆనందమును జెందుచున్నాడు.

తస్మాద్యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః ।
ఇంద్రియాణీంద్రియార్థేభ్యస్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥౬౮॥

తస్మాత్ = అందువలన, **హే మహాబాహో**! = ఓ అర్జునా!, **యస్య** = ఎవనియొక్క, **ఇంద్రియాణి** = ఇంద్రియములు, **ఇంద్రియార్థేభ్యః** = ఇంద్రియార్థములైన విషయముల నుండి, **సర్వశః** = సర్వవిధముల, **నిగృహీతాని** = నిగ్రహింపబడుచున్నవో, **తస్య** = అతనియొక్క, **ప్రజ్ఞా** = జ్ఞానము, **ప్రతిష్ఠితా** = స్థిరమైనది.

తాత్పర్యము– అందువలన ఓ అర్జునా! ఎవనియొక్క ఇంద్రియములు ఇంద్రియార్థములైన విషయముల నుండి సర్వవిధముల నిగ్రహింపబడుచున్నవో అతనియొక్క జ్ఞానము స్థిరమైనది.

వివరణ – ఇంద్రియములను మొట్టమొదట విషయముల నుండి మరలించుటయును , నిగ్రహించుటయును అభ్యసించవలయును. ఇట్లు ఇంద్రియములు విషయములనుండి పూర్తిగా నిగ్రహింపబడిననాడు వాని బుద్ధి పరమాత్మధ్యానములో చలనములేక స్థిరముగ నుండగలదు.

ఇంద్రియాణీంద్రియార్థేభ్యో మనసాకృష్యతన్మనః।
బుద్ధ్యాసారథినా ధీరః ప్రణయేన్మయిసర్వతః॥ (భాగవతము ౧౧ స్కం. ౧౪ అ. ౪౨ శ్లో)
జ్ఞానియైనవాడు ఇంద్రియార్థములైన విషయభోగాదులనుండి సర్వేంద్రియములను మనస్సుచే పట్టి లాగుకొని ఆ మనస్సును బుద్ధియనెడు సారధి చేత ఎల్లెడల అస్మత్పద లక్ష్యార్థమైన భగవత్తత్త్వమునందు చేర్పవలెయును. **మా భవ గ్రాహ్యభావాత్మా గ్రాహకాత్మా చమా భవ।**
భావనామఖిలాం త్యక్త్వా యచ్చిష్టం తన్మయో భవ॥ (మైత్రేయోపనిషత్తు ౨-౨౮ శ్లో)
నీవు గ్రాహ్యపదార్థము కావలదు. గ్రాహకపదార్థమున్ను కావలదు. సమస్తభావనలను విడనాడి ఏది శేషించునో, అట్టి ఆత్మతో తన్మయుడవై యుండుము.

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥౬౯॥

సర్వభూతానాం = సమస్తప్రాణులకు, **యా** = ఏది (ఏ పరమాత్మతత్త్వము) , **నిశా** = రాత్రి యగుచున్నదో (అగోచరముగా నున్నదో) , **తస్యాం** = అట్టి పరమాత్మతత్త్వము యందు, **సంయమీ** = ఇంద్రియనిగ్రహము గల యోగి, **జాగర్తి** = జాగరూకుడై యుండును, **యస్యాం** = దేనియందు (ఏ ఇంద్రియార్థములయందు), **భూతాని** = ప్రాణులు, **జాగ్రతి** = జాగరూకములగుచున్నవో, **సా** = అది (ఆ ఇంద్రియవ్యాపారము), **పశ్యతః** = పరమార్థ తత్త్వమునుచూచుచున్నవాడైన, **మునేః** = మననశీలునకు, **నిశా** = రాత్రిగా నుండును.

తాత్పర్యము– సమస్త ప్రాణులకు అనగా అజ్ఞానులకు ఏ (ఆత్మజ్ఞానము) రాత్రియగుచున్నదో (మనోదృష్టికి గోచరింపక యుండునో) అట్టి ఆత్మజ్ఞానమునందు ఇంద్రియనిగ్రహముగల యోగి జాగరూకుడై యుండును (ఆత్మావలోకనము జేయుచుండును). దేనియందు (ఏ ఇంద్రియవిషయములందు) ప్రాణులు (అజ్ఞానులు) జాగరూకములగుచున్నవో (విషయాసక్తితో ప్రవర్తించుచున్నవో) ఆ (ఇంద్రియవ్యాపారము) ఆత్మావలోకనము చేయుచున్న మునికి రాత్రిగా నుండును.

వివరణ – ఈ శ్లోకములో **"రాత్రియని"** అజ్ఞానమును ఉద్దేశించుకొని చెప్పబడినది. అజ్ఞానమును అంధకారముతో పోల్చెదరు. కనుక అది రాత్రి(నిశ) అనబడినది. పగలు అని భగవద్విషయము నుద్దేశించుకొని చెప్పబడినది. భగవద్విషయజ్ఞానమును ప్రకాశముతో పోల్చెదరు. కనుక అది పగలు. అనగా మేల్కనదగిన కాలముగ చెప్పబడినది.
సమస్త ప్రాణులకును భగవద్విషయము రాత్రి – అనగా దాని విషయమున నిద్రింతురు. స్థితప్రజ్ఞుడైన మునికి భగవద్విషయము పగలు. దానియందు మేల్కొని యుండును. మునికి ప్రపంచ విషయములు అనగా అజ్ఞానము రాత్రి. దానియందు అతడు నిద్రించును. సమస్త ప్రాణులకును విషయములు పగలు. దానియందు వారు(ప్రాణులు) మేల్కొని యుందురు.
ప్రవృత్తికి జెందిన సర్వజీవులకు అగమ్యగోచరమగుటచే నిశయని చెప్పదగిన నివృత్తి పద్ధతి (ఆత్మవిద్య) యందు సంయమీశ్వరుడు మెలకువ గలిగి యుండును. జన్మబంధముతో గూడిన జీవులకు మంచి మెలుకువ గల ప్రవృత్తి మార్గమునందు ఆత్మావలోకన పరుడైన జ్ఞానయోగికి ఆ మార్గము నిశయగుచున్నది.

యత్రసుప్తా జనానిత్యం ప్రబుద్ధ స్తత్రసంయమీ।
ప్రబుద్ధాయత్రతే విద్వాన్ విద్వాన్సుషుప్తిం యాతి యోగిరాట్॥ (యాజ్ఞవల్క్యోపనిషత్తు ౨౦ శ్లో)
జనులు దేనియందు (ఆత్మయందు) నిత్యము నిద్రాణులై యుందురో, సంయమశీలుడైన యోగి అందు మేలుకొనియుండును. జనులు దేనియందు (విషయాదులందు) మేలుకొనియుందురో, దాని యందు యోగీశ్వరుడు నిద్రించుచుండును.

మరణంయత్ర సర్వేషాం తత్రాసౌ పరిజీవతి।
యత్రజీవంతి మూఢాస్తు తత్రాసౌ మృత ఏవవై॥ (యోగశిఖోపనిషత్తు ౧అ. ౪౬శ్లో)
సామాన్య జనులెల్లరు దేనియందు మరణతుల్యమైన అజాగ్రత్త పడుచున్నారో ఆ బ్రహ్మవిద్యా పరిశ్రమయందు యోగీశ్వరుడు లెస్సగా జీవించుచున్నాడు. మూఢజనులెల్లరు దేనియందు జాగ్రత్తతో జీవించుచున్నారో అట్టి లౌకిక వ్యాపారమునందు ఆ యోగీశ్వరుడు నిస్పృహుడై చచ్చినవానివలెనే యుండును.

ప్రవృత్తిర్మానినాం గమ్యా గహనా బ్రహ్మవాదినాం।
నివృత్తిర్మౌనినాం గమ్యా గహనా దేహమానినాం॥ (విశ్వగీత ౧౧౧ శ్లో)
దేహాభిమానులకు సుగమ్యమైన ప్రవృత్తిమార్గము బ్రహ్మవాదులకు అగమ్యమైయుండును. మౌనీశ్వరులకు సుగమ్యమైన నివృత్తిమార్గము దేహాభిమానులకు అగమ్యమైయుండును.

ఆపూర్యమాణమచలప్రతిష్ఠం సముద్రమాపః ప్రవిశంతి యద్వత్ ।
తద్వత్కామా యం ప్రవిశంతి సర్వే స శాంతిమాప్నోతి న కామకామీ ॥౭౦॥

ఆపూర్యమాణం = అనేక నదులలోని యుదకముచేత సంపూర్ణముగా నిండింపబడినదియు, **అచలప్రతిష్ఠం** = హద్దుమీరని స్థిరమైన ఉనికి గలదియునగు, **సముద్రం** = సాగరమును, **అపః** = ఉదకము, **యద్వత్** = ఏ విధముగా, **ప్రవిశన్తి** = ప్రవేశించుచున్నదో, **తద్వత్** = ఆ విధముగా, **సర్వే** = సమస్తములైన, **కామాః** = కోర్కెలు, **యం** = ఎవనిని, **ప్రవిశన్తి** = ప్రవేశించుచున్నవో, **సః** = అట్టివాడు, **శాన్తిం** = ఉపరతిని, **ఆప్నోతి** = పొందుచున్నాడు, **కామకామీ** = విషయాసక్తుడగువాడు, **న** = పొందజాలడు

తాత్పర్యము– అంతటను నిండింపబడినదియు, స్థిరమైన ఉనికి గలది (అనగా హద్దును మీరుటగాని తగ్గుటగాని లేక ఎల్లప్పుడు ఒకటే రీతిగా నుండునట్టిది) యునైన సముద్రమును ఉదకములు (నదీజలములు) ఏ విధముగా ప్రవేశించుచున్నవో, ప్రవేశించి తద్రూపములే అయిపోవుచున్నవో ఆ విధముగా సమస్తములైన కోరికలు ఏ బ్రహ్మనిష్ఠునియందు స్వరూపభూతములై అణిగిపోవుచున్నవో అతడు చిత్తోపరతిని పరమ శాంతిరూపమగు మోక్షమును పొందుచున్నాడు. విషయాయక్తుడగువాడు అట్టి పరమశాంతిని పొందజాలడు.

వివరణ – సమస్త దిశలనుండి పొంగి ప్రవహించుచు వచ్చిచేరిన నదులన్నియును సముద్రమును ఏ విధముగ చలింప చేయకనే ప్రవేశించుచున్నవో , అలాగే సమస్తభోగములును స్థితప్రజ్ఞునియందు ఎట్టి వికారములు కల్గింపకయే వానిలో లీనమగును. అట్టి పురుషుడే పరమశాంతిని పొందును. భోగాసక్తుడు శాంతిని పొందలేడు.

సమస్త నదులనుండి జలము రావలెననికాని, రాకూడదనికాని సముద్రము కోరుటలేదు. ఆ జలము వచ్చి చేరకముందు ఎట్టి స్థితియందుండెనో వచ్చిన పిమ్మట అదేస్థితి యందుండును. నదులయందలి జలము

సముద్రమున కలియుటచే అంతకుముందా నదీజలముకుండిన గుణములు, నామరూపములు పోయి అంతయు సముద్రరూపమే యగుచున్నది. కాని ఈ సముద్రమునందు ఎట్టి మార్పులును, వికారములును కలుగుటలేదు. నదీజలములు నామరూపగుణములను కోల్పోయి సముద్రమునందు లయమయి సముద్రరూపమునే పొందును. ఆ నదీ జలములవలన సముద్రమునకు ఎట్టి మార్పులును, వికారములును కలుగుటలేదు. అదే విధముగా ఎవడు తన స్వస్వరూపమును ఎఱిగి తన ఆత్మ యందు స్థితుడైయుండునో ఆ బ్రహ్మనిష్ఠుని యందు శబ్దస్పర్శరూపాదులు, సమస్త విషయములన్నియును సమస్త కోరికలన్నియును ప్రవేశించి స్వరూప లయము పొందుచున్నవి. కనుక ఆ విషయములవలన అతనియందెట్టి భావవికారములు కలుగుటలేదు. అట్టి యోగీశ్వరుడు శాంతిని పొందును. అట్టి బ్రహ్మనిష్ఠుడు పరమాత్మానుభవామృతసాగరములో నిత్యము నిరంతరము అనంతమైన బ్రహ్మానందముతో పరిపూర్ణుడుగనుండును.

ఇక్కడ పరమాత్మానుభవామృతసాగరములో నిత్యము నిరంతరము ఈదులాడుచుండు స్థితప్రజ్ఞుని సముద్రముతో పోల్చి చెప్పుచున్నాడు. సముద్రము ఆపూర్యమాణము. అగాధమైన అనంతమైన జలములతో పరపూర్ణమై ఉండును. దానికి ఇతర జలములయొక్క ఆవశ్యకములేదు. కనుక సముద్రము అచలముగా ఉండును. అనగా ఎన్నెన్ని నదులద్వారా ఎంతెంత అగాధమైన అనంతమైన జలము వచ్చిపడుచున్నను సముద్రము తనస్థితినుండి మార్పుచెందదు. పొంగుట క్రుంగుట జరుగదు. హద్దుమీరదు. అటులనే పరమాత్మానుభవముగల మహాత్ముడును అనంతమైన బ్రహ్మానందముతో పరిపూర్ణుడుగనుండును. అతనికి ఈ ప్రాపంచిక సుఖభోగములతో ఈషణ్మాత్రమైనను ఆవశ్యకములేదు. అంతఃకరణములో సకలమైన కోరికలును వాసనలతోకూడ నశించిపోయినవి. అయితే ప్రారబ్ధకర్మవశమున అనేక ప్రాపంచిక భోగములు రావచ్చును. అనేక నష్టములు, దుఃఖములు రావచ్చును. ప్రాపంచిక పదార్థములతో గాని, వ్యక్తులతో గాని సంయోగవియోగములు కలుగవచ్చును. అవి అతని అంతఃకరణములో ఏమియును కలతను చెందించలేవు. పొంగుటగాని క్రుంగుటగాని జరుగదు. ఆ భోగములు వచ్చుటచేతను పోవుటచేతను గాని, పదార్థములయొక్క, వ్యక్తులయొక్క సంయోగవియోగములచేతగాని, కీర్తి అపకీర్తుల చేతగాని, స్తుతినిందలచేతగాని, హర్షశోకములు, రాగద్వేషములు, కామక్రోధములు, లోభమోహములు, భయము మొదలగు వికారములు ఆవగింజంతకూడ అతని అంతఃకరణములో కలుగవు. అచలుడై యుండును. ఆసక్తిని విడిచిన స్థితప్రజ్ఞుడైన యతికే ముక్తికలుగును.

యత్రప్రవిష్టా విషయాః పరేరితా నదీప్రవాహా ఇవ వారిరాశౌ।
లీనంతి సన్మాత్రతయా నవిక్రియా ముత్పాదయంత్యేవ యతిర్విముక్తః॥ (వివేకచూడామణి ౪౪౨ శ్లో)

ఎన్ని నదీప్రవాహాలు సాగరములో కలిసినా, సాగరములో వృద్ధి కలుగదు. అదేవిధముగా ఇతరులు ఎన్ని ఇంద్రియభావనలు కలిగించాలని ప్రయత్నించినా చలించక, బ్రహ్మతాదాత్మ్యంలో ఉండేవాడు జీవన్ముక్తుడు. ఇతరములచే ప్రేరితములైన విషయములన్నియును బ్రహ్మతాదాత్మ్యంలో ఉన్న బ్రహ్మనిష్ఠుని యందు ప్రవేశించి స్వరూపలయము పొందుచున్నవి. కనుక విషయములు ప్రవేశించుటవలన బ్రహ్మనిష్ఠునియందు ఎటువంటి వికారములు పుట్టుటలేదు.

కాంతాకటాక్ష విశిఖా నఖనంతి యస్య చిత్తం న నిర్దహతి కోపకృశాను తాపః।
కర్షంతి భూరివిషయాశ్చ న లోభపాశై ర్లోకత్రయం జయతి కృత్స్న మిదం సధీరః॥(శ్రీభర్తృహరి.నీతి.౭౫.శ్లోకము)

ఎవ్వని మనస్సును స్త్రీల కటాక్షములనెడు బాణములు త్రవ్వజాలవో, కోపాగ్నియొక్క వేడిమి దహింపజాలదో, అనేక విషయములు ఆశాపాశములచేత ఆకర్షింపజాలవో అట్టి పండితుడు మూడులోకములను సంపూర్ణముగ జయించుచున్నాడు.

విహాయ కామాన్యః సర్వాన్పుమాంశ్చరతి నిఃస్పృహః ।
నిర్మమో నిరహంకారః స శాంతిమధిగచ్ఛతి ॥౭౧॥

యః పుమాఞ్ = ఏ పురుషుడు, **సర్వాఞ్** = సమస్తములైన, **కామాఞ్** = కామములను (కోరికలను), **విహాయ** = విడిచి, **నిస్పృహః** = ఏ విషయములు కావలెనని స్పృహ (తలంపు) లేనివాడును, **నిర్మమః** = మమకారము లేనివాడును, **నిరహంకారః** = అహంకారము(గర్వము) లేనివాడునునై, **చరతి** = సంచరించుచున్నాడో, **సః** = వాడు, **శాంతిం** = పరమశాంతిని, **అధిగచ్ఛతి** = పొందుచున్నాడు.

తాత్పర్యము – ఏ పురుషుడు సమస్తములైన కామములను (కోరికలను) విడిచి, ఏ విషయములు కావలెనని స్పృహ (తలంపు) లేనివాడును, మమకారము లేనివాడును, అహంకారము(గర్వము) లేనివాడునునై సంచరించుచున్నాడో వాడు పరమశాంతిని పొందుచున్నాడు.

వివరణ – సమస్త కోరికలన్నింటిని త్యజించి మమతా–అహంకార వర్జితుడై శబ్దాదివిషయములపై ఎవనికి ఆశలేదో అట్టి పురుషునకే శాంతి లభిస్తుంది.
యోగవాశిష్ఠము నందు అహంకారము నాశము గూర్చి ఈవిధముగా చెప్పబడినది.
"భగీరథ ఉవాచ–
శరీరేఽస్మిన్నహం భావ శ్చిరస్థ స్త్యజ్యతే కథమ్? " – స్వామీ! ఈ శరీరమునందు చిరకాలముగ వేరుదన్ని, దృఢముగ పాతుకొని పోయిన అహంకారమెట్లు తొలగునో వచింపుము.
" త్రితల ఉవాచ– "
పౌరుషేణ ప్రయత్నేన , త్యక్త్వా విషయభావనామ్।
సత్తా మాశ్రిత్య సంపూర్ణా మహఙ్కారో లయం వ్రజేత్॥ (సర్గ౨౪– ౩౭శ్లో)
విషయసుఖభోగభావనను పురుషప్రయత్నముచే త్యజించి, సంపూర్ణమగు శుద్ధాత్మకారత్వమును ఆశ్రయించి యున్నచో అహంకారము నశించును.
సర్వైషణాః పరిత్యజ్య శాన్తాఽశేష విశేషణః।
అకిఞ్చనత్వ మాయాతః స శాన్తాఽహఙ్కృతిర్భవేత్॥ (సర్గ౨౪– ౩౮శ్లో)
సమస్తములైన సకలేచ్ఛలను పరిత్యజించి, సమస్త అశేష విశేషణములు శమించిన శాంతుడికి, అకించనత్వమును (లేమిని) పొందినవానికి అహంకారము నశించుచున్నది.
విరక్తుడైన ఏ పురుషుడు కర్మలను కొంచమైనను శేషములేక పూర్తిగ తిరుగుచున్నాడో, ఆసక్తి లేనివాడై, మమకారము లేనివాడై (కావలసిన దానియందు **"ఇది నాది "** అను మమకారము లేనివాడై), అహంకారము లేనివాడై యుండునో అతడు తన ఆత్మయందు స్థితుడై, జ్ఞానము నిలుకడ చెందినవాడై, బ్రహ్మము నెఱింగినవాడై, సంసార దుఃఖమంతయు తొలుగుటయైన నిర్వాణమను పేరుగల శాంతిని, మోక్షమును పొందుచున్నాడు. బ్రహ్మముగనేయగుచున్నాడు.
సుఖమే రానిమ్ము, దుఃఖమే రానిమ్ము, లాభమే కలుగనిమ్ము, నష్టమే కలుగనిమ్ము, జయమే లభించనిమ్ము, అపజయమే లభించనిమ్ము, నిందాస్తుతులు, కీర్తి అపకీర్తులు మొదలైనవి ఏది ప్రాప్తించినను వానియందు "అయ్యో, ఇది ప్రాప్తించినది, ఇది ప్రాప్తించలేదు" అను భావన ఎంతమాత్రమును లేకుండుటయే **నిస్పృహ**

అనబడును. ఈ నిస్పృహ అన్ని కోరికలు, అహంకారము, మమకారము పూర్తిగ పోయినగాని లభించదు. ఆశారహితుడై కోరికలనన్నిటిని వదిలివేసి, నాది-నేను అను భావములు నశింపజేసుకొని, తన ఆత్మయందే స్థితుడైన స్థితప్రజ్ఞుడు లోకమునందు సంచరించుచున్నను, వానిచేత ఎన్నికర్మలు చేయబడుచున్నను, వాని బ్రహ్మానందానుభవమునకు ఏ కొరతయునులేదు, ఉండదు.

ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి ।
స్థిత్వాస్యామంతకాలేఽపి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి ॥౭౨॥

హే పార్థ! = ఓ అర్జునా!, **ఏషా** = ఇంతవఱకు చెప్పబడినది, **బ్రాహ్మీ** = బ్రహ్మజ్ఞానసంబంధమైన, **స్థితిః** = స్థితి (నిష్ఠ), **ఏనాం** = ఈ నిష్ఠను, **ప్రాప్య** = పొందినవాడు, **న విమూహ్యతి** = మోహమును చెందదు. **అంతకాలే అపి** = మరణకాలమందైనను, **అస్యాం** = ఈ నిష్ఠయందు, **స్థిత్వా** = ఉండినయెడల, **బ్రహ్మనిర్వాణం** = బ్రహ్మనిర్వాణమును లేక బ్రహ్మైక్యమును, **ఋచ్ఛతి** = పొందుచున్నాడు.

తాత్పర్యము – ఓ అర్జునా! ఇంతవఱకు చెప్పబడినది బ్రహ్మజ్ఞానసంబంధమైన స్థితినిష్ఠ. ఈ నిష్ఠను పొందినవాడు మోహమును చెందదు. మరణకాలమందైనను ఈ నిష్ఠయందు ఉండినయెడల బ్రహ్మనిర్వాణమును, బ్రహ్మైక్యమును పొందుచున్నాడు

వివరణ – సర్వసంకల్ప వర్జితుడై, సుఖదుఃఖములయందు, ప్రాప్తాప్రాప్తములయందు నిస్పృహుడై , అనురాగము, భయము, క్రోధము పోయినవాడై, విషయాభిలాష లేనివాడై, ఇంద్రియార్థములైన విషయములనుండి సకలేంద్రియములను సర్వవిధముల నిగ్రహించి, చక్కగ వశపరుచుకొని మనోనిగ్రహము గలవాడవై, మమకారము-అహంకారము లేనివాడవై తన ఆత్మయందే తమ ఆత్మచేత సంతుష్టుడై శుద్ధాత్మకారత్వమును ఆశ్రయించి యుండుటయే **"బ్రహ్మీస్థితి "** . అట్టివాడు బ్రహ్మనిర్వాణమును పొందుచున్నాడు. **సంశాంత సర్వసంకల్పా యా శిలావదవస్థితిః।**
జాగ్రన్నిద్రా వినిర్ముక్తా సాస్వరూపస్థితిః పరా॥ (మైత్రేయోపనిషత్తు ౨ అ. ౩౦శ్లో)
సర్వసంకల్పములు లెస్సగ శాంతించినట్టియు , శిల వంటి స్థితిని పోలినదియు, జాగ్రద్దశ, నిద్రాదశ నతిక్రమించినట్టియు నగు స్థితి యేదిగలదో, అదియే శ్రేష్టమైన (ఆత్మ) స్వస్వరూపస్థితి అయియున్నది.
ఏషా బ్రాహ్మీస్థితిః స్వచ్ఛా నిష్కామా విగతామయా।
ఆదాయ విహరన్నేవం సంకటేషు న ముహ్యతి॥ (మహోపనిషత్తు ౬-౭౩)
ఈ బ్రహ్మీస్థితి పరబ్రహ్మ తత్త్వమునకు సంబంధించినది. పరిశుద్ధమైనది. కోరికలు లేనిది. ఆధివ్యాధులు లేనిది. ఈ స్థితిని పొంది యిట్లే విహరించుచుండు యోగీశ్వరుడు సంకటసమయములయందు మోహితుడుకాడు.
దేహే జ్ఞానేన దీపితే బుద్ధి రఖండరూపా యదా భవతి।
తదావిద్వాన్ బ్రహ్మజ్ఞానాగ్నినా కర్మబంధం నిర్దహేత్॥ (పైంగలోపనిషత్తు ౪ అధ్యా ౧౧శ్లో)
దేహము జ్ఞానముచే ఎప్పుడు వెలిగింపబడుచున్నదో, బుద్ధి దేశ కాలాది పరిచ్ఛేద రహిత స్వరూపము గలదిగ ఎప్పుడగుచున్నదో అప్పుడే విద్వాంసుడు బ్రహ్మజ్ఞానమను అగ్నిచే జన్మకారణమైన కర్మబంధమును దహించుచున్నాడు.

ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే
సాంఖ్యయోగో నామ ద్వితీయోఽధ్యాయః ॥ 2 ॥